తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక
నవంబరు 2016
వెల రూ.5/-



తిరుచానూరు
శ్రీ పద్మావతీఅమ్మవారి
బ్రహ్మోత్సవాలు-2016

నవంబరు 25 నుండి
డిసెంబరు 04 వరకు

శ్రీ పద్మావతీఅమ్మవారి


26-11-2016
చిన్నశేషవాహనం


27-11-2016
పెద్ద శేషవాహనం


27-11-2016
హంసవాహనం


28-11-2016
ముత్యపుపందిరివాహనం


28-11-2016
సింహ వాహనం


29-11-2016
కల్పవృక్ష వాహనం


29-11-2016
హనుమద్వాహనం


30-11-2016
పల్లకీవాహనం


30-11-2016 గజవాహనం



కళల చింతామణికందువచెల్లెలు

బంగారు పట్టు పీతాంబరాలు ధరించిన శ్రీ వేంకటేశ్వరా! నీ దేవేరియైన అలమేలుమంగ క్షీరసాగరంలో ఉద్భవించిన లక్ష్మి-చందురుని తోబుట్టువు కాన ఆమె ముఖంలో కూడ చంద్రుని కాంతులు చోటు చేసుకున్నాయి. చింతామణితో పుట్టినందువల్ల ఆమె తళుకుల మణిగా ప్రకాశిస్తున్నది. ఆమె గజ గమనానికి కారణం ఐరావతమనే దేవతల ఏనుగుతో కలిసి జన్మించడమే! పారిజాతంతో కలిసి పుట్టినందువల్ల ఆమె పాదాలు చిగురుల్లాగ ఉన్నాయి. పద్మపీఠంలో జన్మించినందు వల్ల ఆమె కన్నులు తామరల్లాగ ఉన్నాయి. ఇన్ని సౌందర్య లక్షణాలతో అలలారే ఈ లక్ష్మికి నీ మేనే నెలవు.

అమ్మవారు పాలసంద్రం నుండి తానొక్కటే ఆవిర్భ వించడం కాక- సమస్త పరివారాన్నీ, దయావాత్సల్యాది గుణాల్నీ, మహైశ్వర్యాన్నీ, ప్రభుత్వాధి కారసంపదను - తనతో పాటు 'గొప్పసారె' వైకుంఠానికి తెచ్చింది. అప్పుడు శ్రీవైకుంఠం సకల కళలతో విరాజిల్లింది. లక్ష్మి లేని వైకుంఠం నీళ్లులేని తామరకొలనే కదా!



పసిఁడిచీరవాఁడవు పాలు దచ్చితివి గాన
పసిఁడిఁ బోలినది చేపట్టేను నీ కరము

తొలుతనే చందురుని తోడఁబుట్టు గనుక
పోలుపుఁ జందురు మోము పోలికై నది
కళల చింతామణికందువచెల్లెలు గాన
మంచపు నీ తలఁబ్రాలు మట్టెల పాదాలు

మంచి యైరావతముతో మగువ సైదోడు గాన
ముంచిన కరిగమనముఁ బోలినది
పంచలఁ బారిజాతపు భావపుసోదరి గాన
యెంచఁగ చిగురుఁబోలె నీకె పాదములు

తామెర తొట్టెలలోన తగిలి తా నుండుఁ గాన
తామెర కన్నులఁబోలి తనరినది
యీమేర నిన్నిటాఁ బోలి ఇన్ని లక్షణములతో
నీమేన శ్రీ వేంకటేశ! నెలవై నిల్చినది



కార్తికమాస విశేషపూజ హోమ మహోత్సవాలు

తేదీలు	వారం	విశేషపూజ & హోమమహోత్సవాలు
31.10.16	సోమవారం	అంకురార్పణ
01.11.16 నుంచి 03.11.16	మంగళవారం నుంచి గురువారం	శ్రీగణపతి స్వామివారి హోమం
04.11.16 నుంచి 05.11.16	శుక్రవారం నుంచి శనివారం	శ్రీసుబ్రహ్మణ్యస్వామివారి హోమం
06.11.16	ఆదివారం	శ్రీనవగ్రహ హోమం
07.11.16	సోమవారం	శ్రీదక్షిణామూర్తిస్వామివారి హోమం
08.11.16 నుంచి 16.11.16	మంగళవారం నుంచి బుధవారం	శ్రీకామాక్షి అమ్మవారిహోమం (చండీహోమం)
17.11.16 నుంచి 27.11.16	గురువారం నుంచి ఆదివారం	శ్రీకపిలేశ్వరస్వామివారి హోమం (రుద్రహోమం)
28.11.16	సోమవారం	శ్రీకాలభైరవస్వామివారి హోమం
29.11.16	మంగళవారం	శ్రీచండికేశ్వరస్వామివారి హోమం & త్రిశూలస్నానం - పంచమూర్తుల తిరువీథిఉత్సవం

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సప్తగిరి

సంపుటి : 47　　నవంబరు, 2016　　సంచిక : 06



వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మండే నాస్తి కించన ।
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి ॥

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
0877-2264543

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఈ నెలలో....

ముఖచిత్రం : శాంతినిలయ నివాసిని
వెనుక చిత్రం : పద్మావతికి పరంధాముడి సారె..



బ్రహ్మోత్సవ మంగళదేవత

శ్రీ పద్మావతి అమ్మవారు సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి. విష్ణుదేవునివక్షఃస్థలనివాసిని. విష్ణు శక్తియే లక్ష్మి. లక్ష్మి లేకుంటే ఈ విశ్వమంతా లేమితో అతలాకుతలమౌతుంది. ఏ జీవి అయినా సుఖశాంతులతో వర్ధిల్లాలంటే లక్ష్మీకృపాకటాక్షం అవసరం. అందుకే ఆమెకు 'శ్రీ', అనీ'లక్ష్మి' అనీ పేర్లున్నాయి. 'శ్రీ' అంటే అందరిచేతా ఆశ్రయింపబడేది. 'లక్ష్మి' అంటే అందరికీ లక్ష్యస్థానమైందని అర్థాలు. ఈ ప్రపంచంలోని వస్తువులన్నీ లక్ష్మీస్వరూపాలే. పరమాణువునుండి పరబ్రహ్మవరకూ ఉండే అన్నింటిలోనూ వాటి వాటి శక్తిరూపంలో ఆదిలక్ష్మే ఉంటుంది. ఏ దేవతలకైనా వారి వారి శక్తులే వాళ్ల అర్ధాంగులు. పద్మావతి ఒక కారణంగా తిరుచానూరు, పద్మసరోవరంలో ఆవిర్భవించినా ఆమె ఆవిర్భవించడానికి గల కారణాలు పరామర్శించినప్పుడు ఆమె సాక్షాత్తు వైకుంఠవాసిని అయిన లక్ష్మి అనేసంగతి ప్రసిద్ధం.

శ్రీవారికి బ్రహ్మ స్వయంగా తాను ముందుండి ఉత్సవాలు జరిపించినా– అవి శ్రీవారికొక్కరికే గాక–స్వామి వక్షఃస్థలంలోని స్వామినికీ చెందుతాయి. భక్తజనోద్ధరణకోసం అమ్మవారు కొండక్రింద ఉన్నా–కొండలరాయనికి జరిగే బ్రహ్మోత్సవ సంరంభాలన్నీ అమ్మకూ జరుగుతాయి. సాధారణంగా బ్రహ్మోత్సవాలు ఆయా దేవతల ప్రతిష్ఠ జరిగిన సందర్భాన్నిబట్టిగానీ, వారు అవతరించిన నక్షత్రాన్నిబట్టి గానీ జరపడం సంప్రదాయం. అమ్మవారు కార్తికమాసంలో ఆవిర్భవించిన కారణంగా శ్రీవారికి జరిగినట్లే తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలు అమ్మకు నిర్వహించడం ఆనవాయితీ. ఒకప్పుడు శ్రీవారిబ్రహ్మోత్సవాలుకూడా తిరుచానూరులోనే జరిగేవి. కనుక స్వామికీ, స్వామినికీ భేదం లేదు. క్రమక్రమంగా తిరుమలక్షేత్రం విస్తరించిన తర్వాత అక్కడే శ్రీవారిబ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఎవరిక్షేత్రంలో వారిఉత్సవాలు జరగడం సముచితం.

అమ్మవారిఉత్సవాలను బ్రహ్మోత్సవాలు అనడంలో బ్రహ్మ ఉండి, జరిపించేవి కావు. బ్రహ్మశబ్దానికి పెద్దదనే అర్థమూ, పరబ్రహ్మం అనే అర్థమూ ఉన్నాయి. ఈ రెండర్థాల్లో అమ్మవారిబ్రహ్మోత్సవాలు సార్థకమౌతాయి.

అమ్మవారు సిరులతల్లి. ఆ కలిమి ఎంత ఉండాలంటే 'ఆగజాంతం ఐశ్వర్యం' అని పెద్దలంటారు. తన ఇంటిముందు ఏనుగులుండి, వాటి ఘీంకారప్రణవనాదంతో మేల్కొవడం మహైశ్వర్యం. అట్టి ఐశ్వర్యప్రదాయిని, మహారాజ్ఞి అమ్మవారు. స్వామికి గరుత్మంతుడు ప్రధానవాహనమైతే, అమ్మకు ఏనుగు ప్రధానవాహనం. ఇతరవాహనాలున్నా గజమనేది విశ్వానికి సంకేతం. 'గ' అంటే 'గచ్ఛతి' (పోయేది) 'జ' అంటే 'జాయతే' (పుట్టేది), ఇది విశ్వలక్షణం గనుక అందుకు చిహ్నంగా, ఐశ్వర్యానికి సంకేతంగా అమ్మవారిగజవాహనోత్సవం విశిష్టమైంది. చక్రవర్తులుకూడా ఎన్నో జీవులున్నా పట్టపుటేనుగునే చక్రవర్తి లక్షణాల్లో ప్రధానంగా స్వీకరిస్తారు. సృష్టిస్థితిలయాలు భగవంతుడే చేస్తున్నా–ఆదిశక్తి అయిన ఆదిలక్ష్మిసహకారంతోనే ఇదంతా జరుగుతూ ఉంది. ధనమొక్కటే లక్ష్మి కాదు. "ధన మగ్నిః, ధనం వాయుః, ధనం సూర్యో, ధనం వసుః...." అంటూ శ్రీసూక్తం అగ్ని, వాయువు, సూర్యుడు, ఇంద్రుడు మొదలగు వాళ్లందరూ ధనస్వరూపులేనని పేర్కొనింది. వ్యక్తిని ధన్యుణ్ణి చేసేది ధనం. ఆ ధనమే లక్ష్మి. ప్రకృతిలోని అష్టశక్తులే అష్టలక్ష్మీరూపంతో ఈ విశ్వాన్ని పోషిస్తున్నాయి. అందుకే లక్ష్మికి 'జగత్పోషిణి' అని పేరు. పద్మావతీఅమ్మవారు పద్మంలో ఆవిర్భవించడమనేది భౌతికార్థం. ఆ కమలం యోగశాస్త్రంలోని 'సహస్రారపద్మం' అందులోనుండి ఆవిర్భవించిన శక్తి 'జ్ఞానలక్ష్మి'. జ్ఞానం లేని సంపదలు బూడిదలో పోసినపన్నీరే! కనుక విద్యాలక్ష్మి, జ్ఞానలక్ష్మి, మోక్షలక్ష్మి కూడా అమ్మవారే. ఈ నవాహ్నిక ఉత్సవాలు జీవి నవావరణాలు దాటి, ఆత్మతత్త్వాన్ని గ్రహించి, ఆనందించడమే పరమార్థం. పంచభూతాలు తన వశంలోనే ఉంటాయని చెప్పడం పంచమీసంఖ్య విశేషం. సిరులతల్లి గిరులలో కాక, భక్తహృదయపురాల్లో నివసించడం మనఅదృష్టం! భాగ్యవిశేషం!

ఇక్కడ దేవేరివాహనసేవలన్నీ దాదాపు తిరుమలదేవుణ్ణి అనుసరించే ఉంటాయి.

పంచమిరోజున స్వామివారినుండి సారెగా మంగళద్రవ్యాలన్నీ తిరుచానూరు చేర్తాయి. మంగళదేవతకు స్వామి పంపే మంగళద్రవ్యాలు భక్తకోటికి మహాప్రసాదమై సర్వమంగళాలకు కారణమౌతాయి. కనుక ఈ అమ్మవారిబ్రహ్మోత్సవాలు విశ్వాంతర్గత ఆదిశక్తిరూపిణి అయిన ఆదిలక్ష్మికి జరిగేవి. భక్తకోటి ఈ తిరుచానూరు పద్మావతీఅమ్మవారిబ్రహ్మోత్సవాలలో విశేషంగా పాల్గొని, మంగళదేవత అయిన అమ్మవారికృపకు పాత్రులౌతారని ఆకాంక్ష!



తిరుచాన శ్రీ అలమేలుమంగ!

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

'తిరుచాన' అంటే శ్రీకాంత అని అర్థం. ఆమే 'శ్రీమహాలక్ష్మి'. ఆ సిరులతల్లిని 'అలమేలుమంగ' అని కొందరంటారు. పుష్పంపైన ప్రకాశిస్తున్న దివ్యవనితే, 'అలర్‌మేల్‌మంగ'. సహస్రదళాలు ఉన్న బంగారుపద్మంలో అవతరించింది కనుక ఆ జగన్మాతను 'పద్మావతి' అంటారు.

బాగుంది. ఇంతకూ ఆమె ఎవరు? ఎక్కడ ఉంటుంది. అలమేలుమంగ తిరుమల ఆనందనిలయుని పట్టపురాణి. ఆమె అర్చామూర్తిగా వెలసివున్న దివ్యక్షేత్రం తిరుచానూరు. దీన్నే 'అలమేలుమంగపట్నం' అంటారు. తిరుపతికి ఆగ్నేయమూలలో 3-4 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ పుణ్యక్షేత్రానికి, ఆటోలు, బస్సులు వెళ్తుంటాయి. పట్టుమని పది నిమిషాల్లో చేరుకోవచ్చు.

పెనిమిటి అయిన శ్రీనివాసుడు ఏడుకొండలపైన 'ఆనంద నిలయం'లోనా? ఆయనపత్ని అలమేలుమంగ ఆ కొండకింద తగ్గులో తిరుచానూరు 'శాంతినిలయం'లోనా? విచిత్రంగా ఉంది కదూ! ఇలా ఉండడంలో విశేషమైనకారణం ఒకటి ఉందంట!

చాలకాలం కిందట ఏడుకొండలకు దీటైన కొండలో అంతే ఎత్తులోనే 'శాంతినిలయం' అనే బంగారుమేడలో వుండేది పద్మావతి. కాని **'ఆనందనిలయం'**లోని అయ్యవారికంటే, **'శాంతి నిలయ'** అయిన అమ్మవారు భక్తులపై **"ఒకింత దయ"** ఎక్కువగా చూపుతుంది! ఆ **'కాసింతదయ'** అనే బరువువల్ల, ఈ తల్లి వున్న కొండ భూమిలోనికి దిగబడిపోయిందంట! అందువల్లే ఆనంద నిలయుడు అంత ఎత్తులో, ఈమేమో ఇంతకింద ఉండడం – అని పెద్దలమాట!

ఇంకో విషయం! ఆ స్వామి, ఆనందనిలయుడు శంఖ చక్రాలను ధరించి, ఎక్కడికో పరుగెత్తి పోవాలన్న తొందర్లో ఉన్నట్లుగా ఎప్పుడూ నిలబడే అగుపిస్తాడు. గంభీరంగా వున్న ఆయనకు ఏం చెప్పుకోవాలన్నా భయమే! ఆ బెదురువల్ల, అనుకొన్నవన్నీ అడగడానికి మరచిపోతాం.

మరి ఇక్కడో! అలమేలుమంగమ్మతల్లి ఎలాంటి తొందర్లు లేకుండా రెండుచేతుల్లో చల్లనిపద్మాలను పట్టుకొని, అభయ, వరదహస్తాలతో చనువుగా **"ఏం కావాలో అడగండర్రా!"** అన్నట్లుగా తీరంగా నిండుగా పద్మంపైన కూర్చొని నవ్వుతూ దర్శనమిస్తుంది. మనం చెప్పుకొన్నవన్నీ ఓపికగా వింటుంది. విన్న వాటిని విభుడైన వేంకటేశ్వరునికి వినిపిస్తుంది. అంతటితో ఊరుకోదు. తన నాథునిపై ఒత్తిడి తెస్తుంది. భక్తులకు కోరిన వరాలను ఇప్పిస్తుంది.

ఒకవేళ స్వామివారు ఆమెమాటను వినకుండా 'బెట్టు'గా ఉంటేనో! అప్పుడు అమ్మ అంటుంది కదా! స్వామీ! తిరుమలేశా! నా వల్లనే కదా! నీ గుండెమీద పదిలంగా, "వ్యూహలక్ష్మి"గా ఉన్న నా వునికివల్లనే కదా! నీవు 'శ్రీనివాసుడి'గా అయ్యావు. నా కోసం వైకుంఠాన్ని విడిచి రావడమేగాక, ఈ భూలోకంలోకూడా నా దయకోసం అశ్రులు చాస్తూ, ఈ పద్మసరోవరతీరాన తపస్సు చేశావు కదా! అప్పుడే ఆ విషయాన్ని మర్చిపోతివా స్వామీ! అంటూ భక్తులకోసం సిఫారసు చేస్తుంది.

సున్నితంగా స్వామివారిమనస్సును భక్తులమీదికి మళ్లింపచేసి ప్రసన్నంచేస్తుంది. దండిగా, మెండుగా, నిండుగా అనుగ్రహింపచేస్తుంది అమ్మలకు అమ్మ అలమేలుమంగమ్మ!

ఇంకేముంది? అమ్మమాటను కాదనలేక, అమ్మమాటను జవదాటలేక "సరే! సరే! అంటున్నా కదా! నాకంటెకూడా భక్తులపై నీకు కొంచెం దయ ఎక్కువే కదా!" అంటూ ఏడుకొండలవాడు ఏమాత్రం చెరగని, తరగని చిరుమందహాసంతో భక్తుల కోరికలను తీరుస్తూ ఉన్నాడు! తిరుచానూరు అలమేలుమంగమ్మ వల్ల ఏడుకొండలమీద నిత్యమూ జరుగుతున్న తంతు ఇదే! అందు

వల్లే- అలమేలుమంగమ్మను దర్శిస్తేనే, తిరుమలయాత్ర పూర్తి అవుతుందన్నది సత్యమైనమాట!

ఇక్కడ ఇంకోమాట! భక్తుల విషయంలో ఈ ఇద్దరూ ఒక్కటే! భక్తులకోసం, లోకకల్యాణకోసం ఇద్దరూ కూడ బలుక్కుంటారు. అసలు ఇద్దరూ వేరువేరు అయితే కదా! ఆనందనిలయుని 'దయా' స్వరూపమే అలమేలుమంగ! కనుకే ఆనందనిలయునిహృదయంలో అలమేలు మంగ ఉంటుంది. ఆమె మనసులో ఆ స్వామి ఉంటాడు. అందువల్లే- భక్తులు ఇలా ప్రార్థిస్తారు. ''అలమేలుమంగమ్మా! ఆనందనిలయుని హృదయ పద్మంలో నీవు ఉంటావు! నీ హృదయంలో ఆ స్వామి ఉంటాడు. మీ ఇరువురూ నిండుదయతో మా గుండెల్లో పదిలంగా నిత్యం కొలువై ఉండండి!"- అని.

దయగల తల్లి శ్రీ అలమేలుమంగ (పద్మావతి) తిరుచానూరులో అర్చా మూర్తిగా ఎలా వెలసిందో, తెలుసుకోవాలంటే సుమారు ఐదువేలఏండ్లనాటి గాథను సంక్షిప్తంగా అయినా చెప్పుకోవాల్సిందే మరి!

భృగుమహర్షి చేసిన నిర్వాకంవల్ల అలిగిన శ్రీమహాలక్ష్మి వైకుంఠాన్ని వీడి, భూలోకం చేరింది. ఆమెను వెదుకుతూ శ్రీనివాసుడు భూలోకం చేరుకున్నాడు. లక్ష్మికోసం వెదకి వెదకి వేసారిన శ్రీనివాసుడు ఆదివరాహక్షేత్రం చేరుకొన్నాడు. పిదప ఆకాశరాజుకూతురు పద్మావతిని వివాహం చేసుకొన్నాడు. కాని మహాలక్ష్మిలేని జీవితం వ్యర్థమని భావించిన వేంకటేశ్వరుడు లక్ష్మీదేవి కొల్హాపురంలో వుందని అక్కడికి వెళ్లాడు.

శుక్రవారపుతోట ఉత్సవం

శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయానికి దక్షిణదిక్కున కేవలం వంద అడుగుల దూరంలో అందమైన ఉద్యానవనం కనపడుతుంది. ఇదే "శుక్రవారపుతోట". చక్కగా తీర్చిదిద్దిన పూలమొక్కలతోపాటు అరటిచెట్లు ఉన్న విశాలమైన ఈ పూలతోట మధ్యలో 16 శిలాస్తంభాలతో నిర్మితమైన "వసంతమండపం" ఉంది. ప్రతిశుక్రవారం మధ్యాహ్నం వేళ ఈ మండపంలో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీరు, పసుపు, చందనం మున్నగు ద్రవ్యాలతో తిరుమంజనం,నివేదనలు జరిగిన తర్వాత అమ్మవారైన అలమేలుమంగ ఆస్థాన మండపంలో "సహస్రదీపాలంకరణ సేవ"లో పాల్గొంటారు.

వైశాఖంలో వసంతోత్సవాలు

ప్రతిసంవత్సరం వైశాఖమాసంలో వచ్చే పున్నమికి మూడు రోజుల పాటు శ్రీఅలమేలుమంగమ్మకు వార్షిక వసంతోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ప్రతిరోజూ నిత్యపూజాదులు అయిన తర్వాత అమ్మవారు శుక్రవారంతోటలోని వసంతమండపానికి వేంచేస్తారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీరు, పసుపు, చందనం వంటి అభిషేకద్రవ్యాలతో అంగరంగవైభవంగా తిరుమంజనాదులు జరిగిన తర్వాత, ఘనంగా ఆలయం మహాప్రదక్షిణమార్గంలో ఊరేగిస్తారు. ప్రత్యేకంగా పున్నమినాటి సాయంవేళ శ్రీపద్మావతిఅమ్మవారికి స్వర్ణరథోత్సవం నిర్వహిస్తారు.

కొండలరాయని కొల్హాపుర సందర్శనం

అదొక మహానగరం! కొండల్లో కోనల్లో తిరిగిన శ్రీనివాసునికి కొల్హాపురం అద్భుతప్రపంచంగా కనపడింది. ఎక్కడ చూచినా ఎత్తైన బంగారుగోపురాలు! ఎటుచూసినా మణిమయమందిరాలు! విశాలమైన వీథులు! రహదారులు! ఓర్పుగా నేర్పుగా పెంచిన మనోహరమైన ఉద్యానవనాలు! పుష్పవాటికలు! మనోహరంగా, వీనుల విందుగా సంగీతనాట్యకళలతో అలరారుతున్న సభామందిరాలు! రండి! లోపలికి రండి! కడుపార తృప్తిగా భోజనం చెయ్యండి అంటూ ఆహ్వానిస్తున్న నిరతాన్నదానసత్రాలనిర్వాహకులు! ఎక్కడ చూచినా సుసంపన్నంగా, శోభాయమానంగా ప్రకాశిస్తున్న కొల్హాపుర మహా నగరంలో ప్రవేశించాడు-కొండలరాయడు. ఆ నగరం నడిబొడ్డున ఎత్తైనప్రాకారాలతో వింత వింతకాంతులతో ప్రకాశిస్తున్న అద్భుత మైన భవనం! అదే శ్రీమహాలక్ష్మిమందిరం!

ఆ గృహంలోని వేదికపైన శ్రీమహాలక్ష్మిదర్శనంకోసం కళ్లను నిక్కించి చూశాడు. ఆ వెంద ర్శనం మాత్రం కానందువల్ల నిరాశకు లోనయ్యాడు. అయినా పట్టు వదలని ఆ పరంధాముడు పది సంవత్సరాలు ఆ తల్లి దర్శనంకోసం నిద్రాహారాలు మాని తీవ్రతపస్సుచేశాడు. అయినా జగన్మాత దర్శనం మాత్రం స్వామికి కలగలేదు. ఇంతలో "శ్రీనివాసా! ఇది విను!" అంటూ గంభీరంగా ఆకాశవాణి విన్పించింది.

ఆకాశవాణి!

"శ్రీమహాలక్ష్మిదర్శనం కోసం, అనుగ్రహం కోసం ఆర్తిగా ఆత్రుతపడుతున్న ఆనందనిలయవాసా! శ్రీనివాసా! జాగ్రత్తగా విను."

"తిరుమలేశా! ఈ మహానగరంలో కొలువై ఉన్న శ్రీమహాలక్ష్మి నీకు దర్శనం ఇవ్వదుగాక ఇవ్వదు. ఇక్కడి నుండి దక్షిణంగా వెళ్ళు. 'కృష్ణవేణి' అనే పుణ్యనది కనపడుతుంది. ఆ నదీమతల్లికి దక్షిణంగా ఇరవైరెండుయోజనాల దూరంలో 'సువర్ణముఖి' అనే దివ్యమైన పుణ్యనది ప్రవహిస్తోంది. ఆ నదికి ఉత్తరతీరంలో అనేకమంది యోగుల, మునుల ఆశ్రమాలు ఉన్నాయి. అలాంటి పవిత్రమైన ప్రదేశానికి నీవు వెళ్లి. అక్కడ నీ కుంతాయుధం (ఈటె, బల్లెం)తో ఒక సరస్సును నిర్మించు. ఆ పవిత్ర జలాల్లో దేవలోకం నుంచి తెప్పించిన బంగారుపద్మాలను ప్రతిష్ఠించు. ఆ తర్వాత నియమంగా, శ్రద్ధగా, భక్తిగా 12 ఏండ్లపాటు శ్రీమహాలక్ష్మిని ఉపాసన చెయ్యి. అలా చేసినట్లైతే నీ తపస్సు ఫలిస్తుంది. సుప్రసన్నహృదయ-సిరులతల్లి- శ్రీమహాలక్ష్మి సహస్రదళాల బంగారు పద్మంలో ప్రశాంతరూపంతో, ప్రశాంతచిత్తంతో అవతరించి మళ్లీ నిన్ను చేరుకుంటుంది. వెళ్లిరా" అన్నది. ఆ వాక్కులు విన్న వేంకటేశుడు వెంటనే గరుడునిపై ముందుగా ఆదివరాహక్షేత్రంలో స్వామి

పుష్కరిణిలో స్నానంచేసి, సువర్ణముఖీతీరం చేరుకొన్నాడు. పద్మసరస్సు ఏర్పాటుచేసితపస్సు ప్రారంభంలో కొంతకాలం పాలుమాత్రం తీసుకొంటూ, మరి కొంతకాలం నిరాహారంగా ఉంటూ– బీజాక్షరాలతో నిక్షిప్తమైన శ్రీమహాలక్ష్మీమంత్రాన్ని జపిస్తూ సుమారు 12 ఏండ్లు తపస్సు చేశాడు. పదమూడవ ఏట కార్తికమాసం, శుక్లపక్షం, పంచమీ శుక్రవారం, ఉత్తరాషాఢానక్షత్రం విజయలగ్నంతో కూడిన శుభదినాన అత్యంతశుభప్రదమైన వేళలో, శ్రీమహాలక్ష్మి ఆ పద్మసరస్సులో శ్రీనివాసుని ఎదుట ఇలా అవతరించింది.

అలమేలుమంగ ఆవిర్భావం

పద్మసరోవరంలో శ్రీనివాసుడు నాటిన సహస్రదళాల బంగారు పద్మం ఆశ్చర్యంగా, అద్భుతంగా వికసిస్తుండగా, ఆ పుష్పసౌరభాలు నలుదిక్కులా వ్యాపించాయి. ఇంతలో పవిత్రజలాలనుంచి ఆ బంగారు కమలం పైకి వచ్చింది. ఆ స్వర్ణపద్మంలోని కర్ణిక మధ్యలో బంగారురథం. దానిమీద బంగారు పద్మపీఠంపైన ఆసీనురాలైన శ్రీమహాలక్ష్మి పదహారేళ్లు కూడా నిండని యువతిగా ఆవిర్భవించి దర్శనమిచ్చింది. వజ్రవైడూర్యమరకత మాణిక్యాదిహారాలతో సుగంధసుమనోహరపుష్పమాలికలతో అలంకృత అయిన శ్రీమహాలక్ష్మి అవతరిస్తుండగా వింతవింతవెలుగులు అంతటా వ్యాపించాయి. అత్యంతకల్యాణప్రదమైన శుభఘడియల్లో శంఖనాదాలు. భేరీ మృదంగ నాదాలు అన్నిదిక్కుల్లో మారు మ్రోగాయి. నింగినుండి దేవతలు పుష్పవర్షం కురిపించారు. గంధర్వులు ఆనందంతో ఆడారు. పరవశించి గానం చేశారు.

తెప్పలపై తిరుమలేశుని రాణి!

ప్రతిఏటా జ్యేష్ఠమాసంలో పున్నమికి పూర్తి అయ్యేట్లుగా ఐదురోజులపాటు సాయంవేళల్లో పద్మసరోవరంలో జరిగే తెప్పోత్సవాల్లో, మొదటిరోజు శ్రీరుక్మిణీ సత్యభామాసమేత శ్రీకృష్ణస్వామివారు; రెండవరోజు శ్రీదేవీభూదేవీ సమేతంగా శ్రీసుందరరాజస్వామివారు; చివరి మూడు రోజులు శ్రీపద్మావతిఅమ్మవారు తెప్పలపై శోభాయమానంగా దర్శనమిస్తారు.

అలమేలుమంగ అద్భుతరూపం

అద్భుతరూపంతో పద్మసరోవరంలో ఆవిర్భ వించిన అమ్మ అలమేలుమంగమ్మ సుకుమారమైన సుందరరూపం వర్ణనాతీతం! ఆమె సొంపుసోయగం నయనమనోహరం! అమ్మ ముఖారవిందం పూర్ణచంద్రునిలా గుండ్రంగా ఉంది. అందంగాను ఉంది. ఆ అందాన్ని ఇంకా పెంచుతూ ఉన్నట్లుగా ఎర్రని పెదవులపై చెరగని, తరగని చిరుమందహాసం! ఆ పెదవుల మధ్యలో దోబూచు లాడుతూ కనపడీ కనపడకుండా ఉన్న ముత్యాలవంటి పలువరుస! సంపెంగవంటి నాసిక! ఆ నాసిక అందాన్ని మరింత రెట్టింపు చేస్తూ ఉన్న రతనాల ముక్కెర! ఆ నాసికకు ఇరువైపులా దయారసాన్ని పొంగింపచేస్తున్న సుందరమైన పద్మాలవంటి విశాలనేత్రాలు! నేత్రాల అంచున ఇరువైపులా ఓంకారాలలాగా భాసిస్తున్న కర్ణద్వయం! నిగనిగలాడే చెక్కిళ్ల సొంపును మరింత ప్రస్ఫుటం చేస్తున్న మణిమయకర్ణాభరణాలు! నాసికకుపైన కస్తూరీకుంకుమలతో భాసిస్తూ ఉన్న ఫాలభాగం! ఆ ఫాలభాగంపైన పద్మసరోవరంలోని జలాలపై నుండి వీస్తున్న చల్లని పిల్లవాయువులకు సుకుమారంగా కదలాడుతున్న నల్లని తుమ్మెదలవంటి ముంగురులు! ఆ జగన్మాతే అఖిలలోకాల మహాసామ్రాజ్ఞి– అన్నట్లుగా దివ్యకాంతులతో మిరుమిట్లు గొలుపుతూ ఆమె శిరసుపైన చక్కగా అమరినఅందాల నవరత్నకిరీటం! మామిడి చిగురులవంటి ఎర్రనివర్ణంతో ప్రకాశిస్తున్న ఆ తల్లిదివ్యమంగళశరీరం ఆపాదమస్తకం లావణ్యకాంతులతో, వింత వింతసొబగులు ఆవహించాయి. మెడలో కంఠాభరణాలు! చేతులకు నవరత్నాలగాజులు! కాళ్లకు కడియాలు! కాలివేళ్లకు బంగారు మట్టెలు! నడముకు వడ్డాణం! ఆ జగన్మాత పై రెండుచేతుల్లో పద్మాలు ధరించింది. పద్మాలహారాన్ని మెడలో అలంకరించుకొంది. కింది కుడిచేయి అభయముద్రతోను, ఎడమచేయి వరదముద్రతోను ఉంటూ పదహారేళ్ల వయస్సు నిండని నవయౌవన యువతిగా స్వర్ణకమలంలో శ్రీమహాలక్ష్మి ఆవిర్భవించింది.

జగన్మాత ఆవిర్భవాన్ని భృగునారద తుంబురమహర్షులు యోగులు, మునులు, ఇలా ఎందరో దర్శించి కీర్తించారు.

అద్భుతావహంగా అవతరిస్తున్న అలమేలుమంగను ఆనందనిలయుడు కన్నులార్పక తిలకిస్తూ, అంతులేని ఆనందాన్ని పొందాడు. ఇన్నాళ్లకు, ఇన్నేళ్లకు అలకమాని, భూలోకంలో పద్మావతి పేరుతో తనను చేరుకోవడానికి వచ్చిన శ్రీమహాలక్ష్మి మెడలో, శ్రీనివాసుడు తన కలువలమాలను అలంకరించి ఆమెను ఆలింగనం చేసుకొన్నాడు.

ఆ శుభవేళలో సమస్తదేవతలు, యక్ష గంధర్వ కిన్నర కింపురుషాదిదేవగణాలు. ఆ దివ్యదంపతులపై పుష్పవర్షం కురిపించారు. మంగళవాద్యాలను మోగించారు. శ్రీనివాసునితో కూడివున్న శ్రీపద్మావతిఅమ్మవారిని దర్శించిన బ్రహ్మేంద్రాది అఖిలదేవతలు అనేక విధాలుగా స్తుతించారు.

పద్మహస్తే నమ స్తుభ్యం ప్రసీద హరివల్లభే!
ఋగ్యజు స్సామ రూపాయై విద్యాయై తే నమో నమః

ఇలా కీర్తించిన దేవతలను ఉద్దేశించి, శ్రీనివాసునిఅనుమతితో శ్రీమహాలక్ష్మి ఇలా పలికింది. "ఓ దేవతలారా! మీరు ఇప్పుడు చేసిన స్తోత్రంతో నన్ను బిల్వదళాలతో అర్చిస్తే చాలు. వాళ్లు పోగొట్టుకున్న సంపదలను, పదవులను పొందడమేకాక, ఇంకా వృద్ధిని పొందుతారు. చివరకు ముక్తినికూడా పొందుతారు. అంతేగాక నేను ఆవిర్భవించిన 'కార్తికపంచమి' రోజున ఈ పద్మసరోవరంలో స్నానం చేస్తే చాలు. దీర్ఘాయువు, ఐశ్వర్యం, విద్యతేజోవంతులైన సంతానం పొంది సుఖించగల"రని పద్మావతి వరాలను ప్రసాదించింది. శ్రీనివాసుడు ఆమెను తనవక్షఃస్థలంలో "వ్యూహలక్ష్మి"గా ఉంచుకొని, తిరుమలకు వెళ

తుండగా, ఈ క్షేత్రంలో అర్చామూర్తిగా కొలువై ఉండవలసిందని బ్రహ్మాదిదేవతలు ఆమెను ప్రార్థించారు.

ఆనాటినుండి "స్వతంత్రవీరలక్ష్మి"గా "వ్యూహలక్ష్మి"గా స్వామి వారు లేకుండానే, తిరుమలలోని స్వామిమాదిరిగానే స్వతంత్రంగా ఉత్సవాలూ, ఊరేగింపులూ జరుపుకొంటున్న శ్రీమహారాజ్ఞిగా జగదేక మాతగా విరాజిల్లుతున్నది– అలమేలుమంగమ్మ!

చతుర్ముఖబ్రహ్మదేవుడు పద్మావతిఅమ్మవారు అవతరించిన 'పంచమీతీర్థం' నాటికి ముందు పదినాళ్ల పాటు జరిగే కార్తికబ్రహ్మోత్స వాలను ఘనంగా నిర్వహించాడు. తిరుమలలో మాదిరే, స్వతంత్రంగా శ్రీమహారాజ్ఞి అయిన అలమేలుమంగమ్మ పూటకొక్క వాహనంలో, పదినాళ్లపాటు తిరుచానూరు మాఢవీథుల్లో ఊరేగింది. చివరిరోజైన "పంచమినాడు" "పంచమీతీర్థం" పేరుతో అమ్మవారు అవతరించిన పద్మసరోవరంలో 'చక్రస్నానం' వైభవంగా జరుపబడుతుంది. సరిగ్గా పంచమీతీర్థంనాడు జరిగే అవభృథోత్సవవేళకు తిరుమల శ్రీస్వామి వారినుండి "పసుపుకుంకుమ, చీర, రవిక, చందనం, పూలమాలలు, పిండివంటలు" మున్నగువాటితో సారెను ఏనుగుఅంబారి పైన తీసుక వస్తారు.

పంచమీతీర్థం

తిరుమల శ్రీనివాసుడు తన పట్టపుదేవేరి పుట్టినరోజు "పంచమి తీర్థం" వేడుకలకు పంపిన పసుపుచందనాదులలో "పద్మపుష్కరిణి" తీరాన శ్రీఅలమేలుమంగకు, శ్రీసుదర్శనభగవానునికి వేదమంత్ర ఘోషలతో మంగళవాద్య పురస్సరంగా స్నపనతిరుమంజనం జరుగు తుంది. తిరుమంజనాదులు పూర్తైన వెంటనే సుముహూర్తంలో శ్రీసుద ర్శనభగవానునికి పద్మసరోవరంలో ఘనంగా చక్రస్నానాదులు జరు పడంతో పంచమీతీర్థవేడుకలు మంగళప్రదంగా పరిసమాప్తమవు తాయి. పంచమీతీర్థంనాడు తిరుచానూరు పద్మసరోవరంలో జరిగే చక్ర స్నానమహోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొంటారు. అత్యంత భక్తిప్రపత్తులలో శ్రీచక్రత్తాళ్వార్‌తో పాటు పుష్కరిణిలో మునకలిడి పునీతులవుతారు.

ఆనందనిలయుని పట్టపుదేవేరి అలమేలుమంగ అవతరించిన "పంచమీతీర్థ"వేడుకలనూ, కార్తికబ్రహ్మోత్సవాలనూ చూచి ఆనందించ వలసిందే తప్ప మనం ఎంతని వర్ణించగలం? ఏమని వర్ణించగలం?



పద్మావతికి పరంధాముడి సారె!

పద్మావతి పుట్టినరోజుకు జరిగే పదినాళ్ల పండుగలే కార్తిక బ్రహ్మోత్సవాలు. చివరిరోజున అంటే, అలమేలుమంగమ్మ అవతరించిన "పంచమి"నాటికి తిరు మల పరంధాముడు ప్రియంగా పుట్టినరోజు సారెను పంపిస్తాడు. రెండుపట్టు చీరలను, రెండు పట్టురవిక గుడ్డలను, పసుపుముద్ద, శ్రీగంధపుకర్ర, పచ్చిపసుపు కొమ్ములతోవున్న పచ్చని పసుపుచెట్లు, పూలమాలలు, తులసీమాలలతో పాటు ఒక బంగారుహారం (నగ), ఇవికాక పిండివంటలు ఒక పడి (51) పెద్దలడ్లు, ఒక పడి (51) వడలు, ఒక పడి (51) అప్పాలు, ఒక పడి (51) దోసెలు.

ఇలా వీటన్నింటిని ఆ రోజు ఉదయం ముందుగా తిరుమలలో శ్రీవారిమూల మూర్తికి సమర్పిస్తారు. ఆ తర్వాత వీటిని దేవస్థానం అధికారులు, పరిచారకులు, సిబ్బంది, కొత్తవెదురుబుట్టలలో పెట్టుకొని, కాలినడకన అలిపిరి పాదాలమండపం దగ్గరలోవున్న శ్రీపద్మావతి పసుపుమండపం దగ్గరికి వస్తారు. అక్కడి నుంచి పసుపు, కుంకుమ, చీర సారెలను ఏనుగు అంబారీపైన పెట్టుకొని, మేళతాళా లతో శ్రీకోదండరామస్వామివారిఆలయం, శ్రీగోవిందరాజస్వామి ఆలయాల మీదుగా తిరుచానూరుకు చేరుకుంటారు.

అక్కడ శ్రీపద్మావతి అమ్మవారిఆలయం అర్చకులు, అధికారులు తిరుమల శ్రీవారిసారెకు దివ్యమంగళనీరాజనాలతో ఘనస్వాగతం ఇస్తారు. పిదప తిరు చానూరు పురవీథులగుండా ఊరేగింపుగా వెళ్లి, శ్రీపద్మావతి అమ్మవారికి సమర్పి స్తారు. వాటితో శ్రీపద్మావతి అమ్మవారికి, శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు తిరుమంజ నాదులు ఘనంగా జరిపిన పిదప పద్మసరోవరంలో సుదర్శనచక్రత్తాళ్వారుకు అర్చకులు పవిత్రస్నానం చేయిస్తారు. సరిగ్గా ఆ సమయంలో వేలాదిమంది భక్తులు, పవిత్రస్నానాలు చేస్తారు.

సాక్ష్యం చెప్పిన అలమేలుమంగ!



ఐదువందల ఏండ్ల కిందట నిజంగా జరిగిన అద్భుతసంఘటన ఇది!

వస్త్రాలు నేసే కులాల్లో పద్మసాలీలను, జాండ్రవారిని ప్రధానంగా పేర్కొన వచ్చు. వీళ్ల ఇద్దరిదీ ఒకే కులం. ఒకే వంశం. ఒకే వృత్తి. రాకపోకలు ఇచ్చిపుచ్చు కోవడాలు కూడా ఉండినాయి. కాని వీళ్లలో వీళ్లకు పొరపొచ్చాలు వచ్చాయి. ముఖ్యంగా తిరుపతి, తిరుచానూరు, యోగిమల్లవరం, నారాయణవరం, మొద లగు ప్రాంతాల్లో వ్యాపించిన ఈ చేనేత వృత్తులవారికి (16వ శతాబ్దంలో) మరో వివాదం తోడయింది. అదేమంటే!

తిరుచానూరు **"అలమేలుమంగ"** మా ఆడపడుచు అంటే, కాదు కాదు మా ఆడపిల్ల అంటూ, ఆ తల్లికి పసుపుకుంకుమలు, సారెను తామే ముందుగా ఇవ్వాలని ఇద్దరూ వాదించుకొన్నారు. చివరికి ఇద్దరికీ గురువైన తాళ్లపాక చినతిరు వేంగళనాథుణ్ణి ఆశ్రయించారు.

ఈయనే తాళ్లపాక అన్నమయ్య మనుమడు. ఇతణ్ణే 'చిన్నన్న' అంటారు. అలమేలుమంగ అన్నమయ్యకు బాల్యంలో ప్రసాదాలు తినిపించినట్టుగానే, మనుమడు ఈ చిన్నన్నకుకూడా చిన్ననాడే అలమేలుమంగ స్వయంగా చనుబాలు తాపిందటం! అందువల్లే చిన్నన్నకు కవిత్వం అబ్బింది. చిన్నన్నతో ఎప్పుడంటే అప్పుడు అలమేలుమంగ మాట్లాడేదంట!



చిన్నన్న ఇద్దర్నీ సముదాయించి "అలమేలుమంగమ్మ"ను సాక్ష్యం చెప్పవమ్మా! నీవు ఎవరి ఆడపడుచువో అని ప్రార్థించాడు. అందరూ చూస్తుండగా అలమేలు మంగమ్మ వేయివెలుగులతో ప్రత్యక్షమయ్యింది. అందరూ చెవులు రిక్కించి వింటుండగా వజ్రకిరీటవిరాజితయై, నవరత్నాలు తాపిన వరదాభయహస్తాలతో చిరు నవ్వుతో, నిండుగా గంభీరంగా దర్శనమిస్తూ ఇలా పలికింది.

"నేను పద్మసాలీయుల ఆడపడుచును. పుట్టింటి వారైన పద్మసాలీయులు ముందుగా నాకు చీర, సారె సమర్పించిన తర్వాతనే ఇతరుల మర్యాదలను స్వీకరిస్తాను". అలమేలుమంగ పలికిన దివ్యమైన సాక్ష్యంతో సమస్య తీరిపోయింది. సరిగ్గా 1541 అక్టోబరు 23వ తేదీ గురువారం శుభకృత్తు నామసంవత్సరం కార్తికపున్నమి, గురువారంనాడు ఈ సంఘటన జరిగింది. దీనికి గుర్తుగా రాగిరేకు శాసనంకూడా ఉంది.

అందువల్ల మనం అందరం మౌనంగా ప్రశాంతచిత్తంతో తిరుమల పరంధాముని పట్టపురాణి పద్మావతిఅమ్మవారిని కన్నులారా దర్శించుకుందాం. ఆ అమ్మదయను పొందుదాం!

అమ్మదయ ఒక్కటివుంటే చాలు! అన్నీ ఉన్నట్లే!!

అలమేలుమంగమ్మకు ఆరగింపులు

శ్రీనివాసపరంధాముని పట్టపుదేవేరి పద్మావతికి ఉదయం సుప్రభాతవేళలో పాలు, పండ్లు ఆరగింపు చేస్తారు.

ప్రతిరోజు ముప్పూటలా పులిహోర, మిరియపుపొంగలి చక్కెరపొంగలి, దధ్యోదనాలను ఆరగింపుచేయడంతో పాటు, ప్రత్యేకంగా మొదటినివేదనలో సీరా(రవకేసరి)ను, మధ్యాహ్నం రెండవ నివేదనలో లడ్డులను, వడలను ఆరగింపు చేస్తారు.

నిత్యమూ జరిగే శ్రీ పద్మావతి పరిణయోత్సవ వేళలో అప్పాలు, చక్కెరపొంగలి, పులిహోరలు తప్పనిసరిగా ఉంటాయి.

ప్రతిసాయంత్రంవేళ జరిగే ఊంజల్‌సేవలో సిరులతల్లికి శనగగుగ్గిళ్ళ (సుండలు)ను నివేదిస్తారు.

రాత్రి ఏకాంతసేవా (పవళింపు) సమయంలో గోరువెచ్చని పాలు, పంచకజ్జాయం నివేదింపబడతాయి.

ప్రతిగురువారం తిరుప్పావడసేవలో పులిహోరలతో పాటు ప్రత్యేకంగా జిలేబీలు నివేదింపబడతాయి.

ప్రతిశుక్రవారం మధ్యాహ్నంవేళ పద్మావతికి ప్రత్యేకంగా పాయసం ఆరగింపు చేస్తారు. శుక్రవారపుతోటలో ఆ మధ్యాహ్నం అభిషేకానంతరం వడపప్పు, పానకం, మిరియపు పొంగలినీ, పిదప అలంకరణ అయిన తర్వాత పులిహోర, దోసెలు, సుండలూ నివేదిస్తారు.

శ్రీనివాసుడు చేసిన సూర్యప్రతిష్ఠ

పద్మసరోవరానికి తూర్పుతీరంలో పశ్చిమాభిముఖంగా శ్రీసూర్యభగవానునిఆలయం ఉంది. ఈ సూర్యస్వామిని సాక్షాత్తు శ్రీనివాసభగవానుడు స్వయంగా ప్రతిష్ఠించి, అక్కడే మహాలక్ష్మి కోసం తపస్సు చేశాడు. 12 ఏండ్ల తర్వాత ఆ సరస్సులో బంగారు పద్మంలో ఆవిర్భవించింది- ఆ తల్లి. అలా ఆనందనిలయునిచే ప్రతిష్ఠింపబడిన ఈ సూర్యునిఆలయం ఎన్నోమార్లు పునరుద్ధరింపబడింది. ఇటీవల 1866 ఏప్రిల్ 23న హథీరాంజీ మఠంవారు జీర్ణోద్ధరణ చేశారు. వైఖానసఆగమం ప్రకారం నిత్యపూజలేకాక ప్రతిఆదివారం ఉదయంపూటా, హస్తానక్షత్రంరోజున, శ్రీరథ సప్తమి రోజున శ్రీసూర్యనారాయణస్వామివారికి అభిషేకాలతో గ్రామోత్సవం జరుగుతుంది.

హైమసరోజాంగ! అలమేలుమంగ!
జీమూతసంకాశ! శ్రీవేంకటేశ!
మునిశాలికాసారముఖ్యభక్తాళి!
వనమాలి! అవధారు! వరదానశీలి!

పాండ్యమండలంలోని ఒక నగరం పుండరీకం. ఆ నగరానికి దగ్గరే తామ్రపర్ణి ప్రవహిస్తుంది. ఆ పట్టణాధిపతి కురువు. అతడు ద్వాపరయుగంనాటివాడు. అందుకే ఆ నగరికి 'కురుకాపురి' అని మరోపేరు.

ఆ రాజధానిలోని 'ఆదినాథదేవాలయం' అతిప్రసిద్ధం. దేవాలయంమాత్రం కాదు– ఆ ఊరిలోని వారందరు అభం శుభం తెలియని అమాయకులు. తమ సహచరులు మంచివారయినా కాకపోయినా అందరి మేలుకోరేవారు. అంతేనా? కాదు– వారు చదువరులు. వేదవేదాంగపారీణులుకూడా. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ పౌరులందరు పరమప్రసన్నులు. పరమప్రపన్నులు.

కురుకాపురిలో ఒక భాగవతోత్తముడు. అతనిపేరు 'వళధి నాగేంద్రుడు! ఆతని కుమారుడు ధర్మధరుడు. అతనితనూజుడు చక్రపాణి. అతనితనయుడు రక్తధారాహ్వయుడు. ఆ రక్తధరునికొడుకే పాటలలోచనుడు. అతనిసంతానమే భోక్తారి. ఆ వంశంలోనివాడే కారి నామధేయుడు!

కారి సామాన్యుడుకాడు. గర్వం లవలేశమైనా లేనివాడు. మంచివారికీ, చెడ్డవారికీ అందరికి ఉపకారి. అతనికి సాటి అతడే.

'కారి' యువకు డయ్యాడు.

తండ్రి 'భోక్తారి' కొడుకుకు పెళ్ళి చేయాలను కొన్నాడు. ఆ నగరానికి దగ్గర్లోనే ఒక గ్రామం. ఆ గ్రామంలోని పరమభాగవతోత్తముడు కమలాప్తవక్షుడు. ఆతనికుమార్తె నాథనాయిక. తన కుమార్తెకు 'కారి' తగినవాడని కమలాప్తవక్షుడనుకొన్నాడు. తన కొడుకుకు నాథనాయిక తగిందని భోక్తారి భావించాడు. ఇంకేం? సంబంధం కుదిరింది. అంగరంగవైభవంగా వివాహం జరిగింది. నాథనాయిక కొంతకాలం కురుకాపట్టణంలో గడిపింది. ఆ తరువాత పుట్టింటికి వచ్చి ఆపై అత్తవారింటికి వెళుతూ త్రోవలో కురంగేశుని ఆలయానికి వెళ్ళింది. ఆ స్వామిని సేవిస్తూ

"నందనందనా! నాకు కుమారుని ప్రసాదించు' అని ప్రార్థించింది.

అరవిందనాభుడు అతివమొఱ విన్నాడు.

'అమ్మా! నీ కోరిక నెరవేరుతుంది. నేనే నీకు పుత్రునిగా పుడతాను. వెళ్ళి రావమ్మా'! అని ఆశీర్వదించాడు. నాథనాయిక మెట్టిల్లు చేరుకొంది.

స్వామి తన యాన పాటించవలసిందిగా 'విష్వక్సేనుని' ఆదేశించాడు. విష్వక్సేనుడు నాథనాయికగర్భంలో ప్రవేశించాడు. ఆమె గర్భవతి అయింది. నవమాసాలు నిండాయి. కలియుగం ప్రవేశించాక– తొంభైదినాలు గడిచాక– వైశాఖం విశాఖనక్షత్రం కర్కాటక లగ్నంలో కొడుకు పుట్టాడు. ఆ సమయంలో ప్రకృతి అంతా పులకించింది.

వరాహావతారుడైన స్వామి పురిటింటిలో ప్రత్యక్షమై శిశువుకు జ్ఞానోపదేశం చేశాడు. అదే సమయంలో శేషుడు తింత్రిణీవృక్షంగా అవతరించాడు.

నాథనాయిక తన కోరికను తీర్చిన స్వామికి మొక్కుతుంది. కాని వెంటనే గాభరాపడింది.

కారణం బిడ్డ ఏడవడం లేదు. చనుబాలు తాగడం లేదు. మరేది పోసినా స్వీకరించడం లేదు. అలసిపోయాడనుకొంటే అలసట కనిపించదు. తల్లిదండ్రులు ఆలోచించారు. పురుడుతీరింది. కొడుకుకు 'మారన్' అని నామకరణం చేశారు. రోజులు గడచినా మార్పు కనబడలేదు. తల్లి బెంగపెట్టుకొంది.

'చాలాకాలం సంతానం లేదు. కానక కన్న సంతానం. అయినా ఏలాంటి కొడుకు? ఈలాంటి పుత్రోదయానికేనా నేను ఆనాడు కురుకానాథుని ప్రార్థించాను? వీడు బిడ్డడా? దయ్యమా? అని తనవారిని చూస్తూ తన బిడ్డను చూస్తూ 'బిడ్డా! నవ్వవేమిటయ్యా!

08



పరమయోగివిలాసం

– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

నేనూ, నీ నాన్నా- చేసిన తప్పేమి? ఊరుకున్నావేమి? కనులలో ముత్యాలు కారుతుంటే ఏడవవేమిరా? అమ్మా అని ఒకసారయినా పిలవవేమిటి? అసలు మావైపు చూడనే చూడవు. మేము పూర్వ జన్మల్లో ఏం పాపం చేశామో? ఒట్టిచేతులతో హరికి జోతాలు పెట్టవమ్మా! మొలకనవ్వులతో ముద్దులుకులుకుతూ కిలకిలా రావాలు సేయవేమిట్రా? నీ బావ నీకు మాటలు రావని' నిన్ను చూచి నవ్వుతున్నాడు. అంతేకాదు. అవ్వా తాతలు నిన్ను పలకరి స్తుంటే మాటాడవేమిరా? ఆ స్వామి తనలాంటి కొడుకును ప్రసాదిస్తానంటే సంబరపడ్డానుగాని నీలాంటికొడుకు పుడతాడని ఊహించలేదు. సామాన్యశిశులక్షణాలేవీ నీలో కనిపించడం లేదు. నీవు సర్వదా శ్రీహరినే తలచుకొంటున్నా వేమో? మా వంశో ద్ధారకుడవు నీవే' అని వగలపోయింది.

అపుడు పక్కనున్న మూర్ఖులయిన ఆడవాళ్లు తల్లినీ, బిడ్డనూ పదేపదే చూచి-

'ఎక్కడి బిడ్డడమ్మా. పుట్టి ఇన్నినాళ్ళయినా కన్ను తెరవడు. ఇంత నిబ్బరికం ఎక్కడా చూడలేదమ్మా!' ఏదో పెద్దదయ్యం బిడ్డకు పట్టింది. పెద్దవాళ్ళమయినా మా మాట వింటారా? వాళ్ళదృష్టిలో మనం వెర్రి వాళ్ళమేగా! అని మాటలాడుకొన్నారు.

'కాదు కాదు పుట్టినవాడు సామాన్యుడు కాదు. యోగీం ద్రుడు! అంతేకాదు నాథనాయిక వైష్ణవశ్రీ. రమావిభుడు అనుకొంటే ఎంతపని? మనం అనుకొంటేమాత్రం చాలా? మనం అల్పజ్ఞులం. అనధికారులం. క్రూరులం. ఆ స్వామివల్లనే బిడ్డ స్వస్థుడు కావలె. ఇతరులెవ్వరు ఈవంత తీర్చలేరు. స్వామికి శేషి ఈ బిడ్డ. అంచేత నలినాక్షుడే శరణ్యుడు. మీరు పామరులు. అంచేత ఇష్టం వచ్చినట్లు కారుకూతలు కూశారు. పరమబాంధవుడయిన పంకజో దరుని తిట్టడమా?' మరికొందరు అన్నారు.

"ఆ స్వామే ఈ కొడుకును ప్రసాదించాడు. ఆ స్వామి వున్నచోటనే బిడ్డను పడేద్దాం. ఇదే కర్తవ్య'మంటూ భార్యాభర్తలు గుడికేసి నడిచారు. ఆ గుడిప్రాంగణంలోనే ఒక పెద్దచింతచెట్టు. ఆదిశేషునిఅవతారంలాగా విస్తరించినచెట్టు.

ఆ చెట్టు మొదల 'బిడ్డను' పడుకోబెట్టారు? బిడ్డను చూచి ముద్దాడి ముంగిట స్వామి 'ఆదినాథ పెరుమాళ్' ఆలయానికి వెళ్ళి, నమస్కరించి "పరమమాయావీ, అంతా నీ చిత్తం, నీవు ప్రసా దించిన బిడ్డను నీకే అప్పగించాం" అంటూ వెళదామని దంపతులు అడుగుముందుకు వేశారు.

చింతచెట్టుదాటి కొన్నిఅడుగులే వేశారు. కాని నాథ నాయిక నడవలేకపోయింది. కాళ్ళు కదల్చలేకపోయింది. మరల వెనుదిరిగి బిడ్డ దగ్గరికి వచ్చి 'హా! కుమారా! అంటూ నేలవాలింది. వారికిక్కడ ఏమీ తోచక చంద్రమతిలా ఉన్న భార్యను ఓదార్చాడు. అయినా నాథనాయిక దుఃఖం పట్టలేక - "ఏ చింతా చీకులు తెలియని బిడ్డ. అభంశుభం తెలియని బిడ్డను ఈ చింతకింద పారవేసి ఇంటికి పోవడమా? నా గుండె 'ఊయి' కాబోలు' అని కదలి వెళ్ళింది.

అయినా మరోసారివెనుకకు తిరిగింది. 'మునిలాంటి వాడు. సోమునిలాంటివాడు. వేదాల చిక్కు తొలగించిన వ్యాస మునిలాంటివాడు. రామునిలాంటివాడు. నవ్వుల్లో వెన్నెల చిలి కించేవాడు. నిడువాలు కన్నులవాడు. బంగారుప్రతిమకు సాటి కా గలిగినవాడు' అని కొడుకును చూచి చూచి పలవరించింది.

నా పుత్రరత్నమా! నా వెండికొండ! నా పాలిదైవమా! ననుగన్న తండ్రి! నా కులోద్ధారక! నా కోడె' అంటూ ఏడవడం మొదలెట్టింది. ఈ దృశ్యమంతా చూచినస్వామి ఇంక జాగుచేయ రాదనుకొన్నాడు. 'పరమకల్యాణీ! మీరెందుకు బాధపడుతున్నారు? చింత మానండి. ఈ బిడ్డడు మానవమాత్రుడు కాడు. ఈ రూపంతో ప్రపంచాన్ని ఉద్ధరించడానికోసం మీ కడుపున పుట్టిన వాణ్ణి. మీకు అన్నిసౌఖ్యాలూ అబ్బుతాయి. ఇది సత్యం. ఇంక మీరు మీమీ ఇండ్లకు వెళ్ళండి' అని ఆనతిచ్చాడు. ఆ దంపతులు అందరితో కలిసి వెనుదిరిగారు.

నాథనాయిక కారిదంపతులు వెళ్ళిపోయాక- ఒక చిత్రం జరిగింది. ఆలయంలో ఎవరూలేరు. ఆలయపరిసరంలోనూ నిర్మా నుష్యమే! ఆదిశేషాంశావతారమైన చింతచెట్టుమాత్రముంది. దంప తులు నేలపై పడుకోబెట్టిన బిడ్డ అమాంతం గుహల్లోకి ఉరికే సింహంలాగా చింతచెట్టుతొర్రలో దూరాడు. పద్మాసనం వేసు కొన్నాడు. శైశవం వదలి. తరుణవయస్కుడయ్యాడు.

ఆదిమధ్యాంతరహితుడైన స్వామిని స్మరిస్తూ, ధ్యానంలో మునిగాడు. తనలాంటి జ్ఞాని ఎవడూ కనబడకపోవడంతో తగిన వారికోసం ఎదురుచూడసాగాడు.

'మారన్' పరిస్థితిని మాధవుడు గుర్తించాడు. సరోవరం నుండి వెలికివచ్చే సువర్ణకమలంలా వేదాలనే రెక్కలతేజి ఎక్కి భానుకోటిప్రకాశంలో ప్రత్యక్షమయ్యాడు. కారిసుతుడు తబ్బిబ్బు పడ్డాడు.

వేదాంతాలకే అగోచరుడయిన స్వామి నా ఎదుట సాక్షా త్కరించాడు అంటూ చంద్రుడు అమృతం కురిసే లాగున ఆనందా శ్రువులు రాల్చాడు. కన్నతండ్రిని చూచిన బిడ్డలాగా సంతోషిం చాడు.

గగుర్పాటుతో తామరసాక్షుని ప్రస్తుతింపసాగాడు.

స్వామి 'మారన్'ను చూశాడు. అతనివల్ల కాదగ్గ పని ఎంతో వుంది. అందుకే ఆ మారన్‌నోట వేదశాస్త్రాలు ద్రావిడా మోదవాక్యాలుగా వెలువడాలని కరుణతో వీక్షించాడు.

అంతే! భోగిరాట్కృపతో మారన్ నాలికమీద వేద శాస్త్రసారాలు ద్రావిడభాషలో పాశురాలయి వెలువడ్డాయి. ఆగ మాలు నాలుకపై నాట్యం చేశాయి. షట్ఛాస్త్రాలు లాలాజలంలా నోట ఊరాయి. ఏకముఖుడయిన సరస్వతీనాథునిలాగ వేదసారం వెలువడింది. మారన్ సారస్వతోదారసంపన్నుడయ్యాడు.

పదహారుసంవత్సరాలు గడిచాయి. పరాంకుశలనోట పద్యాలు(పాశురాలు) వెలువడ్డాయి. ఆ పద్యధార గంగానిర్ఝరాల లాంటివి. అవి యోగినికరవేద్యాలు. హరిగుణ హృద్యాలు. మకర కుండలధారుని సన్నుతించే మహితరాగాలు.

పరాంకుశులవారు పాటలుపాడుతూ ఆపై ఆరునెలలు మౌనవ్రతం వహించారు. తదనంతరం సర్వాలంకారప్రియుని కొని యాడుతూ పాశురాలు పాడడం మొదలెట్టారు.

అంతే!

భూలోకంలోని దివ్యదేశాలన్నీ కంటిముందు సాక్షాత్క రించి, తమవైభవం కీర్తించవలసిందిగా ప్రార్థించాయి.

శ్రీపతిఅర్చామూర్తులన్నీ తమ తమ దివ్యనామాలు కారిసుతునినోట వినాలని తహతహపడ్డాయి.

దేవాధిదేవునిసంగతి సరే! మా దేవతలను మరవ కండి అంటూ దేవేంద్రాదిదేవతలు వినయంతో అర్థించడం మొదలె ట్టారు.

ఆ 'కారినందనుడు' అన్నీ విన్నాడు.

మాధవాంశంగలవారిని ప్రస్తుతించాడు. వీనులవిందైన సూక్తులతో సంభావించాడు.

బ్రహ్మాదుల్ని కొనియాడాడు. తిరుమలేశునివైభవాన్ని సాక్షాత్కరింపజేశాడు. కుండలీపతిశైలగురుని కొనియాడారు. అల మేలుమంగావిహారాలను వినుతించాడు. శ్రీనివాసుని నాయకునిగా, తన్ను నాయికగా పాశురాలు పాడారు. వేదసారాలను ప్రబం ధాలుగా తీర్చిదిద్దాడు.

కారిమారసుతుని దర్శించినవారు, దూరం దూరంగా ఉంటూ విన్నవారు ఎంతో పరవశులయ్యారు. ఆ పాశురాలరుచిని అనుభవించి తన్మయులయ్యారు. ఈ విధంగా కొన్నాళ్ళుండి కొన్నాళ్ళు ధ్యానంలో మునిగిపోయారు.

కురుకాపురికి దగ్గర్లోనే 'తిరుక్కోవళూర్'

ఇదికూడా దివ్యదేశమే! పాండ్యమండలభూభాగమే. ఆ చోటనే స్వామి శేషశయనుడుగా అర్చావతారమూర్తిగా సాక్షా త్కరించాడు. ఆ వూరికి దగ్గరే ఒక ఏరు. ఆ నది 'యమున' లాంటిది.

తిరుక్కోవళూర్ పవిత్రస్థలం. విష్ణుభక్తులనివాసం. కరుణామూర్తుల నిలయం. అక్కడవారు గంభీరులు. లెక్క పెట్ట డానికి వీలుకాని వేదవేదాంతపారగులనివాసభూమి.

ఆ 'తిరుక్కోవళూర్'లో ఒక వాదికేసరి. సామవేది అయిన బ్రాహ్మణుని ఇంట అమితగణాలకు అధికారియైన కుముదా హ్వయుని కుముదాంశఫలితంగా చైత్రమాసం చిత్రానక్షత్రంలో ఒక శిశువు జన్మించింది. ఆ శిశువు సామాన్యమయింది కాదు.

పుట్టగానే యోగిసామ్రాజ్యపదపట్టభద్రుడుగా రాణిం చాడు. అష్టాంగయోగాలతో అనితర సాధ్యమయిన సిద్ధులు ఆర్జించాడు. సదా సర్వేశ్వరుని ప్రార్థిస్తూ మధురవాక్కులతో స్వామిని రంజించేవాడయ్యాడు.

అందుకే అందరు 'మధురకవి' అన్నారు. మధురకవి దివ్యదేశాలలోని అర్చామూర్తులను దర్శించాలని భావించాడు. తన వూరిలోని స్వామిని సేవించాడు. తదనంతరం భూమండలమంతా తిరుగుతూ ఉత్తరదేశంవైపు అడుగులు వేశాడు. ముక్తిదాయక క్షేత్రాలను దర్శించుకొంటూ 'బదరికి' వెళ్ళాడు. యమునను సేవిం చాడు. అప్పుడే దక్షిణపుదిక్కున ఒక కాంతి కనబడింది.

ఆ కాంతిని చూడగానే మధురకవి ఆశ్చర్యచకితు లయ్యారు.

"ఎన్నో భూములు తిరిగాను. ఇంతటికాంతిని నేనెక్కడా చూడలేదు. ఇంతటికాంతి సూర్యునికి తప్ప మరెవరికీ లేదు. బహుశః అది యోగులదివ్యప్రకాశమే! ఆ దివ్యయోగిని దర్శించి, సేవించి తరించాలనుకొన్నారు.

దక్షిణంవైపు కదిలారు.

ఆ కాంతి మధురకవులకు మార్గనిర్దేశం చేస్తూ ఉంది.

ఆ మహానుభావునికి నదులు, కొండలు, అడవులు దారులు చూపాయి. ఆ ప్రయాణం చాలాకాలం సాగింది. చివరకు కురుకాపురిలో చింతచెట్టులోని యోగితేజంగా మధురకవి కైవా రాలు చేశారు. ఆ యోగిపాదాలను కళ్ళకు హత్తుకొన్నారు. ఆనంద బాష్పాలు రాల్చారు.

'ఆ ముని సామాన్యుడు కాడు. శతమతరాద్ధాంత సంహారి. శఠకోపులు, పరాంకుశులు. ఆ మహామహునే గురువుగా భావిస్తాను'- అని దగ్గరికి చేరాడు.

పరాంకుశులు దివ్యదృష్టితో తనదగ్గరికి వచ్చిన మధుర కవులను గుర్తించారు. తన కృపాదృష్టితోనే మధురకవులకు సుజ్ఞానం ప్రసాదించారు.

'స్వామీ! మీరే నా గురువులు. మీరే నా పాలిదైవం, అంటూ వైష్ణవోచితనమస్కారం చేశారు.

తదనంతరం పరాంకుశుల పాశురాలలోని అంతరార్థం తెలుసుకోవాలనుకొన్నారు.

'యోగీశవిద్యాప్రకాశ! నిర్మలాచార! కృపాకర! మీరు పాడిన పాటలలోని పదపదార్థాలను దయతో ఈ దాసునికి అను గ్రహించండి' అని చేతులు జోడించారు.

పరాంకుశులు సంతోషించారు.

'నిజమే. నీ వేదయితే నన్ను అడిగావో అది పరమ రహస్యం. అయినా క్రమంగా నేను చెబుతాను. సావధానంగా విను. శౌరికి పర-వ్యూహ-విభవ-అర్చాఅంతర్యామి అనే దశ లున్నాయి. వేదాలు, ఇతిహాసాలు, ఆగమాలు వినుతించే అర్చావ తారమూర్తుల వినుతించే స్తవాలను నేను ద్రావిడప్రబంధాలుగా తీర్చిదిద్దాను. కృత, త్రేతా, ద్వాపరయుగాదులలో ధ్యాన యోగ అర్చనాదులవల్ల సిద్ధించే ఫలితమంతా కలియుగంలో నలినాక్ష సంకీర్తనంవల్లనే సిద్ధిస్తుంది. వ్యాసుడు భారతం వ్రాసినట్లు మాధ వుడు మా నోట చరాచరప్రాణికోటిసముద్ధరణకోసం వేదగర్భితము లయిన సూక్తులను ద్రావిడకృతులుగా ప్రకటించాడు.

నా రచనలు నాలుగు. ఇవి నాలుగూ చతుర్వేదసారాలు. సముద్రంలోని జలాన్ని స్వీకరించి మేఘాలు ఆకాశానికెగిరి భూమిపై వానలుగా కురిపించినట్లుగా ఈ రచనలు సాగాయి. ఇవన్నీ మార్దవాకృతులు. ఆదిప్రబంధం అయిన 'ముదలాయిరం' ఋగ్వేదసారం. నూరురేకులపద్మంలాగా నూరుపాశురాలగ్రంథం.

రెండవది యజుర్వేదతుల్యం. ఏడుకొండలకు ప్రతిగా ఏడుపాశురాలు గలది. మూడవది అథర్వణ వేదసారం. తొంబది ఏడుపాశురాలది. నాల్గవది సామనిరూపకం. రసశబ్దబంధం. పర బ్రహ్మ పరతత్త్వాదులను నిరూపణ చేసే మోక్షప్రబంధం. ఈ రచనలో 1102 పాశురాలున్నాయి. ఇది పది శతకాలసమాహారం. ఇవన్నీ జగదేకపూజ్యాలు. ఉపనిషత్ రహస్యాన్ని సరళంగా బోధిం చేవి. అంతాదిక్రమ నియమం కలవి.

తి.తి.దే. ఆధ్వర్యంలో

బహుభాషా కవిసమ్మేళనం

తి.తి.దేవస్థానాల ప్రచురణల విభాగం, కేంద్రసాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ సంయుక్తంగా శ్రీనివాసవైభవం పేరుతో బహుభాషాకవి సమ్మేళనం నిర్వహించనున్నది. 2016, నవంబరు 9, 10 తేదీలలో తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో సంస్కృతం, హిందీ, తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, అస్సామి, ఒరియా, బెంగాలి, మరాఠి, రాజస్థాని, మణిపురి, గుజరాతి భాషలకు చెందిన సుప్రసిద్ధులైన కవులు తమ కవితలను వినిపించడంతో పాటు ఇంగ్లీషు, హిందీ భాషలలో వాటి వివరణ ఇస్తారు. సాహితీప్రియులు, భక్తులు ఈ కార్య క్రమంలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాము.

- ప్రత్యేకాధికారి, ప్రచురణల విభాగం, తి.తి.దే.

ఈ ప్రబంధాలు చదివినవాడు, విన్నవాడు, వనజాక్షునికి 'అడియేన్' అని దాస్యానుభవం ప్రకటించినవాడు ధన్యులని మధుర కవి భావించారు. అంతేకాదు. "అజ్ఞానమనే సముద్రంనుండి తరింపచేసిన స్వామి ఈతడే! నా తలపు మరెవ్వరి మీద లేదు. కురుకాధిపతి గురుపదాబ్జాలే శరణం. నాకు మరొకటి తెలియదు. పరమగురువు, నా పాలిదైవం ఆతడే అంటూ గురువుల పేర ఒక సుకృతి రచించారు. అదే 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' అనే ఒక దివ్యప్రబంధం.

కురుకాధీశ్వరస్వామి నమ్మాళ్వార్ నామాంతరుడైన కారి మారిసుతుల కైంకర్యాలకు మెచ్చి 'పొగడదండ' ఇచ్చారు. తదాదిగా 'వకుళాభరణ' నామం ప్రచారమైంది.

ఈ గురుశిష్యులు 'హరిపదధ్యానామృతం' అనుభవిస్తూ ఆ చింతచెట్టుకిందనే కాలంగడిపారు.

ఈ కథ, విన్నా-చెప్పినా-విశదంచేసినా- వ్రాసేవారికీ కోరికలు నెరవేరుతాయి. సంపదలు తమంత తాము చేకూరు తాయి. ఆయుర్వృద్ధి, నశించనిసంపదలు కరతలామలకమవు తాయి. కైవల్యం సిద్ధం, ధనధాన్యాలు తంగేటిజున్ను. ప్రాయం కొంగుపసిడి. అంతేకాదు. ఒకసారి తలచుకొన్నా చాలు- ఏలాంటి జడునికయినా సారస్వతసంసిద్ధి.

నమ్మాళ్వారుకు కారిమారులు, కారిసూనులు, పరాం కుశులు, వేదం తమిళ్‌సెయ్‌ద పెరుమాళ్, ఉదయభాస్కరులు, కురుకేశులు, తెణ్ణరంగప్పొడి, అరుళ్‌మాఱన్, కురుకాధిపతులు, తిరుక్కురుకూర్‌నంబి అనే నామాంతరా లున్నాయి.

వృషభే తు విశాఖాయాం కురుకాపురికారిజమ్ ।
పాండ్యదేశే కలే రాదౌ శఠారిం సైన్యపం భజే ॥

(ఇంకా ఉంది)



శాంతినిలయ నివాసిని

- డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య, 98481 11794

తిరుమల శ్రీవారుండేగర్భాలయం "ఆనందనిలయం". కారణం-ఆనందస్వరూపుడూ, ఆనందదాయకుడూ, అయిన శ్రీవారు అందులో స్థిరంగా విగ్రహరూపంలో ఉండి, భక్తుల్ని సర్వదా సంరక్షిస్తుండమే! ఇట్లే శ్రీవారిప్రాణేశ్వరి శ్రీపద్మావతీదేవి ఉండే తిరుచానూరులోని ఆలయంలో గర్భాలయం పేరు శాంతినిలయం. అమ్మవారు శాంతినిలయ.

దేవతలందరూ సహజంగా శాంతి, ఆనందస్వరూపులే! ఆయా పరిస్థితుల్నిబట్టి త్రిగుణాలు వారిలో ప్రవేశిస్తాయి. సాకారంనుండే నిరాకారస్థితికి చేరాలన్నాయి-ఉపనిషత్తులు. నిరాకారోపాసన చాలాకష్టతరమనింది-భగవద్గీత. కనుక జీవులు సులువుగా తరించడానికి భక్తిమార్గాన్ని పోషించే విగ్రహారాధనే ముఖ్యం! దేవత ఆలయంలో సర్వత్ర సూక్ష్మరూపంలో ఉన్నా-స్థూలంగా మనకు గోచరించేది- గర్భాలయంలోనే! ఆయా దేవతలగుణప్రభావాల్నిబట్టి పెద్దలు-సముచితమైన, సార్థకమైన పేరుతో గర్భాలయాల్ని స్మరించడం, పిలవడం జరుగుతుంది.

శాంతి, దాంతి అనే పదాలు తరచుగా అందరూ వినేవే! అంతరింద్రియాలను దృఢంగా నిగ్రహించి ఉండడం శాంతి. దీన్నే 'శమం' అనీ అంటారు. బహిరింద్రియాల్ని నిగ్రహించి ఉండడం దాంతి. దీన్ని 'దమం' అనీ అంటారు. శాంతి శుద్ధసత్త్వస్థితి. దాంతి కాస్త తక్కువస్థితిలో ఉండేది. అంటే సామాన్యసత్త్వస్థితి. లక్ష్మీదేవినిగూర్చి దేవేంద్రుడు గావించిన శ్రీస్తోత్రంలో "శుద్ధసత్త్వస్వరూపా, క్రోధహింసా వర్జితా" అన్నాడు. అమ్మవారు కామక్రోధాదులైన అంతశ్శత్రువుల్ని జయించి, వాటిల్ని శాసిస్తుంటుంది. ఈ స్థితినే శుద్ధసత్త్వస్వరూపమంటారు.

మొదట బ్రహ్మచర్యాదిక్లేశాల్ని సహించేదాంతిని స్థిరంగా సాధిస్తే - ఆపై అంతశ్శత్రువుల్ని నిర్మూలించే శాంతి ఏర్పడుతుంది. "శాంతము లేక సౌఖ్యము లేదు" అన్నారు - త్యాగరాజు. అశాంతి సర్వానర్థాలకూ మూలం. అమ్మవారిని ఆశ్రయించి, నిర్మలభక్తితో అర్చించేవాళ్లకు - జగన్మాత కనుక ఆమె మానసిక శాంతిధనాన్ని ప్రసాదిస్తుంది. ధనం అంటే 'సంతోషపెట్టేది' అని వ్యుత్పత్తి. నిజమైన సంతోషం శాంతిధనమే! ఎన్ని భౌతికభోగభాగ్యాలున్నా- అశాంతులుగా ఉండేవాళ్లూ, ఏమిలేకున్నా ప్రశాంతులుగా ఉండేవాళ్లూ ఉన్నారు. కారణం- వస్తువులుండడం, లేకపోవడం కాదు. తృప్తి లేకపోవడమే అశాంతికి కారణం. కనుక శ్రీపద్మావతీ అమ్మవారు ప్రపూర్ణ ఆనందనిలయుని హృదయేశ్వరి కనుక 'శాంతికి నిలయ'మై విరాజిల్లుతూంది.

శాంతి తర్వాతి దశ నిత్యానందస్థితి. కనుక అమ్మవారిని మొదట నిష్కామభక్తితో, నిర్మలహృదయంతో సేవించి, శాంతమనస్కులై-పిదప సప్తావరణాలుగా ఉండే సప్తగిరులు దాటి, శ్రీనివాసుణ్ణి ఆనందనిలయంలో దర్శిస్తే-జన్మధన్యమై జన్మరాహిత్యస్థితి సిద్ధిస్తుంది. కనుక పారమార్థికంగా మొదట శాంతి కావాలి. పిదప ఆనందం కావాలి. శాంతంలేకుండా ఆనందం శూన్యం! ఈ తత్త్వరహస్యాన్ని గుర్తించడానికే అమ్మవారినివాసం, 'శాంతినిలయం' కాగా, అయ్యవారినివాసం' 'ఆనందనిలయం' అయింది. శాంతి సర్వత్ర లీనమైంది-శాంతినిలయం. ఆనందం సర్వత్ర లీనమైంది- ఆనందనిలయం.

లక్ష్మీఅష్టోత్తరశతనామావళిలో 'శాంతాయైనమః' (74 వనామం) అని ఉంది. అమ్మవారు శాంతమే తనరూపమైన తల్లి. భగవంతునియొక్క క్షమాగుణాన్ని

వృద్ధిచేసే శక్తిమతి. 'తత్‌క్షాంతిసంవర్ధినీమ్' కదా! ఎట్టి శత్రువునైనా, ద్రోహినైనా క్షమించేగుణం ఒక్క శాంతికే ఉంది. కనుక క్షమాగుణం శాంతికి తల్లివేరులాంటిది.

కావ్యవాఙ్మయంలో 'శాంతం' ప్రకృతిరసమనీ, తక్కినవి అందులో నుంచి వికృతి చెందినవనీ (వికృతిరసాలు) చెప్పారు- శాంత రసవాదులు. నిజమైన పరమశాంతమైన స్థితిలో నుంచే ఈ సృష్టిసర్వమూ (వికృతి)రూపొందింది. కనుకనే లక్ష్మీఅష్టోత్తరశతనామావళిలో మొదటి నామం 'ప్రకృతి', రెండవది 'వికృతి' అని ఉన్నాయి. కల్లోల వికృతి స్థితినుండి సృష్టి ఏర్పడదు. కనుక 'శాంతినిలయ' అంటే సృష్టికి పూర్వ మున్న ప్రశాంతిస్థితి. ఆ స్థితిలో అంతర్గతంగా ఉన్న అమ్మవారిచైతన్య శక్తివల్ల పరమాత్మ ఆకారుడై చలించి, సృష్టిస్థితిలయాదిపంచకృత్యాలు చేస్తున్నాడు. సృష్టికి పూర్వం ఉండేదీ శాంతే! సృష్టిలయం అయ్యాక ఉండేదీ శాంతే! ఈ ఆద్యంతశాంతులమధ్య ఊగిసలాటలాడుతుండేది సంసారం. విశ్వభ్రమణం. శాంతస్థితిమాత్రం అచలం. నిర్వికారం. కేవలం ఆనంద మయం. ఆ స్థితిని "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ" - (తైత్తిరీయోపనిషత్-2అధ్యా-4వ అనువాకం) అనింది- ఉపనిషత్తు. అంటే ఆ ఆనందమూ, శాంతీ-వాక్కులకు, మనస్సుకు అందనిదీ కేవలం అనుభూతిపరమైంది.

సౌభాగ్యలక్ష్మీఉపనిషత్తు అమ్మవారిమంత్రానుష్ఠానవిధానాన్ని వివరిస్తూ "శ మితి బీజశక్తిః" అనింది.

శం-శమించడం అంటే అన్నిఇంద్రియాలు వాటివాటిచేష్టలు మాని, ప్రశాంతంగా ఉండడం. ఇదే శాంతి. కనుక ఈ శాంతియే అమ్మవారి మంత్రబీజశక్తి. బీజంలో వృక్షశక్తీ, వ్యాప్తీ, ఫలత్వం- మున్నగునవి ఉన్నట్లే 'శమ్-శాంతి' అనే బీజంలో విశ్వశక్తి అంతా సూక్ష్మీకరింపబడిఉంది. ఇలా అమ్మవారి 'శాంతినిలయం' పారమార్థికంగానూ, విశ్వనిర్మాణశక్తిబీజంగానూ విరాజిల్లే ఆలయం. 'శమ్' అనేది సర్వఫలప్రదమూ, సుఖదాయకమైన బీజాక్షరం. ఇదే శ్రేయస్సు! శాంతిలోనే పరమశ్రేయస్సు ఇమిడి ఉంది.

శ్రీపతికి-'శాంతోదితదశ', 'నిత్యోదితదిశ' అనే రెండు స్థితులున్నాయి. తరంగాలు లేని జలాశయంవలె మిక్కిలి శాంతంగా ఉండే స్థితి- శాంతోదితదశ. తన విశ్వాత్మకమైన రూపగుణవైభవాన్ని తాను అనుభవించే భగవంతునిస్థితి నిత్యోదితదశ. అమ్మవారు శాంతోదితదశలో ఉండే స్వామిని చేరి, ఆనందిస్తుంది. ఆ దశలో స్వామీ ఆనందిస్తాడు.

అందుకే అమ్మవారినిలయం-శాంతిరూపం. శ్రీవారినిలయం-ఆనందరూపంగా వెల్గొందుతున్నాయి.

ఇలా మనం నిత్యం కోరుకొనే భౌతిక శాంతిసౌఖ్యాలుగాక - శాశ్వతమైన, అచంచలమైన, పవిత్రమైన శాంతి, ఆనందనిలయాలు- అమ్మవారి, శ్రీవారిగర్భాలయాలు. కనుక ఇరువుర్నీ తాత్త్వికదృష్టితో సేవిస్తే, భావిస్తే- ఈ శాంతి, ఆనందనిలయాలు మన హృదయాలే అవుతాయి. ఈ దశ భక్తకోటికి అనుగ్రహించాలని శ్రీపద్మావతీశ్రీనివాసుల్ని అర్థిస్తాం. లోకానికి నిజమైనశాంతినీ, ఆనందాన్నీ ప్రసాదించడానికే ఈ దంపతులు శాంతి ఆనందనిలయాలలో అర్చామూర్తులై అవతరించి, అశేషభక్తుల్ని తరింపజేస్తున్నారు.

యా దేవీ సర్వభూతేషు శాంతిరూపేణ సంస్థితా।
నమ స్తస్యై నమ స్తస్యై నమ స్తస్యై నమో నమః॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.



శ్రీ స/ప తి సరాగాలు

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



అన్నమయ్య నాయిక అలకులకులుకుల అలమేలుమంగ. నాయకుడు కొండల కోనేటిరాయడైన శ్రీవేంకటేశ్వరుడు. ఆగమశాస్త్ర తిరువీథుల్లో విహరించే ఆదిమధ్యాంత రహితపరతత్త్వప్రతీక అయిన పరమాత్ముణ్ణి అన్నమయ్య, సాధారణ శృంగార నాయకుడిగా కుదించి, భువికి దించాడు. ఇక విశ్వమంతా రూపుదిద్దుకున్న ప్రకృతితత్త్వమైన ఆదిశక్తిని ఓర చూపుల పూలబాలగా అతి సాధారణప్రణయ నాయికగా అనువదించాడు. దీనితో మానవాతీత శక్తులు రెండూ మానవమాత్రులై మనముందు వర్తిస్తూ, నర్తిస్తూ మానవసహజమైన అన్యోన్య దాంపత్యంతో ఒకరికొకరు నీడై తోడై దర్శనమిస్తుంటాయి.

సృష్టి ద్వంద్వాత్మకం. అందులో స్త్రీపురుష ద్వంద్వం- సృష్టికి మూలం. స్త్రీ పురుషులు వివాహానికి ముందు బ్రహ్మచారులుగా ఉండేంతవరకే వాళ్లది వ్యష్టి జీవితం. పిదప వివాహంతో ఆ ఇద్దరూ ఒకటౌతారు. అపుడే వాళ్లకు మనసా, వచసా, కర్మణా - అనే మూడు ముళ్లు పడతాయి. ఇక విడిపోయే ప్రసక్తి ఉండదు. వాళ్లిద్దరూ ఒకరిలో ఒకరు సగమై, ఇద్దరూ కలిసి ఒకటౌ తారు. అదే 'దంపతి' అనే శబ్దరూపం. అమరం "దంపతీ జంపతీ జాయాపతీ భార్యాపతీ చతౌ" అనింది. 'జాయా చ పతి శ్చ దంపతీ, జంపతీ, జాయాపతీ చ. భార్యాచపతి శ్చ భార్యాపతీ- ఆలుమగలు, దంపతులు, జంపతులు, జాయా పతులు, భార్యాపతులు-అవుతారని వివరించింది. దంపతు లనేది నిత్యబహువచనం. దీనికి దంపతుడు, దంపతి అని కానీ ఏకవచరూపం లేదు.

ఇల్లాలు ఉండేది ఇల్లు. దంపతుల్లోని ఇద్దర్నీ ఒకటిగా బంధించేది దివ్యమైన, నిర్మలమైన ప్రేమ. 'ప్రేమ' అనేది రెండక్షరాలే అయినా దానితత్త్వంమాత్రం ద్వంద్వాతీతం. దాంపత్యం 'అద్వైతం సుఖదుఃఖయోః' అని భవభూతి చెప్పిన అనుభూతి - దంపతుల అద్వయభావాన్నే వ్యక్తం చేస్తూంది. అనుభూతి లేనిదాంపత్యం వృథా! ఆ అనుభూతి రెండుహృదయాల, రెండుమనస్సుల, రెండు జీవితాల, రెండు తత్త్వాల ఏకత్వంతో సుస్థిరంగా ఉన్నపుడే దాంపత్యం ఆదర్శవంతంగా, ఆనందమయంగా, ధర్మకార్యాచరణశీలంగా, అనపాయతతో ప్రకాశిస్తుంది.

దేవతల్లో త్రిమూర్తుల దాంపత్యాలు అనపాయినీత్వంతోనే ఆదర్శంగా నిల్చాయి. విష్ణువు లక్ష్మిని హృదయంపై నిల్పుకొన్నాడు. బ్రహ్మ ముఖంలో నిల్పుకొన్నాడు. శివుడు అర్ధశరీరమే ఇచ్చాడు. ఇలా వాక్కు, అర్థాల్లాగా దంపతులు పరస్పరం ప్రేమ అనే అంత స్సూత్రంతో ఏకంగానే ఉంటారు. భౌతికంగా వేర్వేరుగా కన్పిస్తున్నా - ఆంతరంలో దాంపత్యమనేది పరమప్రేమాత్మకం. ఇదే భారతీయుల గృహస్థాశ్రమధర్మానికి మూల కందం.

ప్రస్తుతం శ్రీసతీ, శ్రీపతుల అంటే లక్ష్మీనారాయణులైన - అల్మేలుమంగా వేంకటేశ్వరులదాంపత్యసరాగ వైశిష్ట్యాన్ని యథామతిగా ఆలోచిస్తాం! ఈ యిద్దరూ దివ్యులే అయినా - భూలోకంలో అవతరించి, తమదాంపత్య వైశిష్ట్యంతో లోకానికి ఆదర్శులయ్యారు. ఈ యిర్వురి దాంపత్యం నిత్యవైభవం. ఏకత్వతత్త్వరహస్యపూర్ణం.

అన్నమయ్య వేంకటేశ్వరశతకంలో మంగాంబా వేంకటేశ్వరదాంపత్యసరాగాల్ని ఉదాత్తస్థితిలో దర్శించి, నుతించాడు. పురుషుడు నిమిత్తమాత్రుడు. అతనికీర్తి ప్రతిష్ఠలు అతనిభార్యవల్లనే ప్రకాశిస్తాయి. మంగాంబ తన హృదయంపై ఉండడంతో స్వామి తన్మయుడై తన పరమ పదత్వాన్నీ, అపారమహత్త్వాన్నీకూడా పట్టించుకోడు. గుర్తించుకోడు. వక్షఃస్థలస్థిత లక్ష్మియే తనసర్వస్వం. తన హృదయం ఆమెది. ఆమెహృదయం తనది. అందుకే అన్న మయ్య –

ఆతఁడె నీవు, నీవనఁగ నాతఁడె, నీపలుకే తలంపఁగా
నాతని పల్కు, నీ హృదయ మాతఁడె పో, యలమేలుమంగ! నీ
చేతిదె సర్వజంతువులజీవన మంతయు నంచు సన్ముని
వ్రాతము సన్నుతించు ననివారణ నీసతిఁ వేంకటేశ్వరా!

మీ దాంపత్యాన్ని చూచి, మునీశ్వరులు ఇలా స్తుతిస్తున్నారు. "అమ్మా! అలమేలుమంగా! అతడే నీవు. నీవే అతడు. నీ మాటే ఆయనమాట, ఆయనమాటే నీమాట. నీ హృదయమే అతడు. ఆయనహృదయమే నీవు. సకల జీవులజీవనమంతా నీచేతిదే అంటూ అమ్మను నుతి స్తూన్నారు" అన్నాడు. నిజమే! నిజమైన దాంపత్యలక్షణ ధర్మ మిదే! దంపతులయ్యాక వ్యక్తిగతభావాలూ, చూపులూ, మాటలూ, చేతలూ, మనస్సూ అనేవి – ఉండవు. అంతా ఏకత్వమే! ఈ తత్త్వాన్ని మునీశ్వరులు గుర్తించి, సన్నుతిస్తు న్నారు– అమ్మను. ఈ మాటలు– అన్యోన్య దాంపత్యమహ త్త్వాన్నే నిరూపిస్తున్నాయి. ఈ దివ్యదంపతులు ఎక్కడా వేర్వేరు కారు.

అయ్యా! వేంకటేశ్వరా! మీ దివ్యదంపతులకు ఇండ్లూ వాకిళ్లూ మొదలైనవి ఏమిటో తెలుసా? చెప్తా విను.

నెఱి నలమేలుమంగకును నీకును పద్మభవాండభాండమే
మెఱసిన బొమ్మరిల్లు; తగుమేడలు మీదటి లోకముల్, ప్రభల్
తెఱలఁగ మించు నయ్యినుడె దీపము, గుజ్జెనగూడు చంద్రుడే!
తొఱలిన దేవసంఘములె తొత్తులు, బంట్లును వేంకటేశ్వరా!

"స్వామీ! అలమంగకూ, నీకూ ఈ బ్రహ్మాండమంతా బొమ్మరిల్లు. అది ఆడుపిల్లలు చిన్నప్పుడు బొమ్మలు పెట్టి ఆడుకొనే ఒక ఆటలో కట్టుకొనే చిన్నయిల్లు. ఇక మేడలం టావా? పైన ఉండే లోకాలు! కాంతులు విరజిమ్మే ఆ సూర్యుడే ఆరిపోని దీపం. గుజ్జనగూడు చంద్రుడు. చంద్రుడు అమృతకిరణుడు. ఆ కిరణాలలో అమృతమే బాలికలు బొమ్మలుపెట్టి ఆడుకొనేటప్పుడు చేసే వంటకం. ఇక సమస్త దేవతలూ మీకు తొత్తులు, బంట్లు! మంగాంబా వేంకటే శ్వరులు జగత్తుకు ఈశ్వరీఈశ్వరులు కనుక – వాళ్లకు దాస దాసీజనం, భృత్యులూ దేవతలందరూ భక్తులుకూడా వాళ్లే! "ఉదారచరితులు, వసుధైక కుటుంబీకులు" కదా!

ఈ దివ్యదంపతులు వసుధైక కుటుంబకులు కనుక వీళ్లకు ప్రత్యేకంగా మనకువలె ఇల్లూ– వాకిలీ, దీపాలు, వంట వస్తువులూ, సేవకులు– మందీమార్బలం అవసరం లేదు. ఈ దంపతులు అవిభాజ్యులూ, అనపాయులూ కనుక వీళ్లకు విశ్వమే ఇల్లు. అదీ నిజానికి వీళ్లవిశాలతత్త్వానికి చాలదు. ఇంతటి విశ్వమైనా అదొక చిన్నబొమ్మరిల్లే! మేడలు– కట్టించినవి కావు. అవి పై నుండే లోకాలే! దీపం మహాకాంతులుండే సూర్యుడే! భోజనపదార్థం – అమృత కిరణుడైన చంద్రుడే! దేవతలే దాసులూ, సేవకులూ, పరి చారకులూ, పనులు చేసేవాండ్లూ. అమ్మ 'దాసీభూత సమస్త దేవవనిత' కదా! అయ్య–దాసభూతసమస్తదేవనికరుడు కదా! కనుక సకలదేవతలూ ఈ లక్ష్మీనారాయణదంపతులకు పరి చర్యాకరులే! పరిచర్యాపరులే! ఇలా చెప్పడంవల్ల ఈ దంపతుల్లో ఒకరి హోదా తక్కువ, మరొక్కరి హోదా ఎక్కువ అనే భేదం లేదు. అందుకే పరమపదంలో లక్ష్మీనారాయ ణులు నిత్యమూ దంపతులుగానే దర్శనమిస్తుంటారు.

సాధారణంగా అత్తగారింటికి అల్లుడు వచ్చి నప్పుడు – ఆ ఊర్లో ఉండే స్త్రీలు – వాళ్లఊరిఅమ్మాయి సౌభాగ్యాన్నీ, దాంపత్యవైభవాన్నీ చూచి, తమలో తాము ప్రశంసిస్తుంటారు. అపుడు ఆప్రశంసల్లో అల్లుడు కేంద్రం.

ఇతఁడలమేలుమంగవిభుఁ డీతడెపో కలశాబ్ధికన్యకున్
సతతము చిత్తమిచ్చిన రసజ్ఞుడు, ప్రాజ్ఞుడు, సర్వవైభవో
న్నతుడు, రమాసతీప్రియుడు, నందక శార్ఙ్గ ధరుం డటంచు ని
న్నతివలు మెచ్చి మెచ్చి కొనియాడుదు రేప్పడు వేంకటేశ్వరా!

"స్వామీ! వేంకటేశ్వరా! నీవు మంగాంబ పుట్టింటికి తొలిసారిగా పండుగకు వచ్చినావు. అపుడు మా ఊరిలోని మంగాంబ స్నేహితురాండ్రూ, బంధువులూ, పరిచారికాజనం నిన్ను చూచి ఏమంటున్నారో తెలుసా? ఇదో ఈ అయ్యే మన అలమేలుమంగమ్మ భర్త! ఇతడే పాల సంద్రంలో పుట్టిన లక్ష్మికి ఎప్పుడూ మనసిచ్చినరసజ్ఞుడు. అన్నీ తెలిసిన వాడు. సకలవైభవాలు కలవాడు. లక్ష్మీపతి, నందకం శార్ఙ్గం మొదలైన దివ్యాయుధాలు ధరించిన సాక్షాత్తు శ్రీహరి అంటూ నిన్ను చూచి, అక్కడి స్త్రీలందరూ తెగ మెచ్చుకొని, ప్రశంసిస్తుంటారు.



ఈ వనితల పొగడ్తలో మంగాంబావైభవంతో పాటు– స్వామివారివైభవమూ, రూపలావణ్యదివ్యత్వ లక్షణాలూ, ఆప్యాయత, అనురాగం, లక్ష్మీధరత్వం, లక్ష్మీప్రియత్వం– మొదలైన విశేషాలన్నీ ఉన్నాయి. వాళ్ల ఊరి అమ్మాయి కనుక ఆమె గొప్పతనం వాళ్లకు బాగా తెలుసు. కానీ, అబ్బాయినిగురించే – వాళ్లు వినడమే తప్ప– చూడలేదు. ఈ రోజు చూచారు. ఆ ఊరిఅల్లుని కుండాల్సిన గొప్ప లక్షణాలన్నీ ఉన్నాయని గ్రహించి, ఆనందించి కొని యాడారు. మా అమ్మాయికి అన్నివిధాలా తగిన భర్తే అని ఒక 'యోగ్యతా ప్రశంసాపత్రం' ఇచ్చారు.

ఏ విషయంలోనూ అమ్మాయికీ, అబ్బాయికీ హెచ్చు లొచ్చులూ, అరమరికలూ లేవు. అన్నింటా సమానతం, ఐక్యం ఈ దంపతుల్లో ప్రస్ఫుటమవుతూంది. రుక్మిణీ కృష్ణుల్ని తొలిసారిగా చూచినపుడు ఆ పురస్త్రీలూ ఇలాగే ప్రశంసించారు. అంతేకాదు– ఈ దంపతుల్ని ఏర్పరచడంతో బ్రహ్మ నిందలేనివాడయ్యాడన్నారు. అంటే రుక్మిణికి కృష్ణుణ్ణిగాక మరొకణ్ణీ, కృష్ణునికి రుక్మిణిని గాక మరొకతెనూ కట్టపెట్టి ఉంటే అందరిచేతా నిందలు పొందేవాడు. అలాకాక ఈ ఇద్దర్నీ కట్టపెట్టిన బ్రహ్మ ఒకమంచి పని చేశాడన్నారు. శ్రీసీతారాముల విషయంలోనూ ఇదే ప్రశంస! కనుక శ్రీపద్మావతీ శ్రీనివాసుల దాంపత్యంలోనూ మనస్సు, మాట, చేత, అన్నీ ఆదర్శంగా ఒకేవిధంగా ఉంటాయి. ఈ అన్యోన్యదాంపత్యం అద్వైతం! అభిన్నం!

అలమేలుమంగ ఉత్తమగృహిణి. మగనిమనసెరిగిన మగువ. భోజనం – సిద్ధం చేయడంలో– ఆమెకు స్వామివారిఅభిరుచులు బాగా తెలుసు. పైగా అవి తనకూ చాలఇష్టమైనవే! కనుక–

నించిన పంచదారలును నేతులుఁ దేనెలుఁ గమ్మఁగాఁగఁ దా
లించిన కూరలున్ బరిమళించఁగ నయ్యలమేలుమంగ వ
డ్డించిన నిర్మలాన్నములు డెందమెలర్పఁగ నారగింతు నీ
మించిన వేయుఁజేతులను మేలము లాడుచు వేంకటేశ్వరా!

వైకుంఠపాళి

:: 12 – సమాధానాలు ::

	1 స	2 మ	ర్థ	3 రా	మ	4 దా	సు	
5 అ		ఘ		ధే		ర		6 జై
7 పా	ళి		8 మ	యు	డు		9 లే	మి
ల		10 తం		డు		11 పౌ		ని
	12 సౌ	బ	లి		13 శై	ల	జ	
14 శ్రీ		ళి		15 మ		స్తి		16 గౌ
17 భా	వి		18 ప	దా	తి		19 ధా	త
ష్యం		20 కా		ల		21 శే		మి
	22 మా	న	స	స	రో	వ	రం	

లంపటపడని మేలు లవలేశమే చాలు!

అమ్మవారి ముక్కుపుడక



సీ. కాంతి జీవితమందు కలదను సత్యంబు
   బోధించు రత్నాల ముక్కుపుడక
సున్నజుట్టినదైన నెన్నజాలినదంచు
   బోధించు బంగారు ముక్కుపుడక
పరమాత్మజేరుటే పరమార్థమని సదా
   బోధించు హరిరాణి ముక్కుపుడక
నాసాగ్రదృష్టి నభ్యాసంబు జేయగా
   బోధించు యోగంబు ముక్కుపుడక

తే.గీ. హరికి పట్టపురాణియై అలరుతల్లి
అలరుమేల్మంగ ముక్కున వెలుగులీను
నాసికాభరణమ్ము విజ్ఞానమిడును
సృష్టిసంపూర్ణ తత్త్వవిశేషగతుల ॥

ఆ.వె. మంగళప్రదమ్ము మానితవైరాగ్య -
సంపదాకరమ్ము జన్మమృత్యు
రహితమోక్షదం రహిమించు శ్రీహరి -
దయితముక్కుపుడకదర్శనమ్ము.

- ఆముదాల మురళి, 94404 32683.

మంగాంబ స్వామివారికి తెలుగువంటకాల రుచి ఎంతమధురంగా ఉంటుందో తెలిసేట్లుగా పదార్థాలు సిద్ధం చేసింది. చక్కెర, నెయ్యి, తేనె, కమ్మనివాసనలు వెదజల్లే తాలించినకూరలు, మంచిబియ్యంతో చేసిన అన్నం, అందులో చిత్రాన్నం, పరమాన్నం ఇలా ఎన్నోరకాల అన్నాలూ స్వయంగా వండి, తానే వడ్డిస్తుంది.

దేవతాస్త్రీలందరూ ఆమెకు పరిచారికలైనా– తన భర్తకు తానే వంటలు చేసి, వడ్డించడం, స్వామి ఆనందంతో, ప్రశంసిస్తూ, పరిహాసాలాడుతూ ఆప్యాయంగా భుజించడం అనేది – ఇల్లాలుకూ, ఇంటాయనకూ ఒక మరపురాని మధురానుభూతి! అందులో భోక్తసామాన్యుడా? ఆయన వేయిచేతులున్న శ్రీమహావిష్ణువు. (సహస్రబాహుడు). అందరూ ఒకచేత్తో భుజిస్తే– స్వామి మంగాంబ చేసిన పదార్థాల్ని వేయిచేతుల్తో తమషా పట్టిస్తూ హాయిగా తింటున్నాడట! మరి ఆ దంపతులభోజనసన్నివేశం 'న భూతో న భవిష్యతి' కదా! 'మేలములాడుతూ తిన్నా' డనడంలో స్వామి ఒక్కడే తినడం కాక – ఆ వెయ్యిచేతుల్తో అమ్మకూ తినిపిస్తూ ఇరువురూ ఏకభాజనభోజనులయ్యారనే దాంపత్యవైశిష్ట్యం ఈ సన్నివేశంలో వ్యక్తమవుతూంది. ఈ భోజనం విశ్వాత్ముల ఆనందభోజనం. వీళ్లఆనందం విశ్వాని కంతా ఆనందం. వీళ్లిద్దరూ శాంత్యానందనిలయ దంపతులు!

ఇలా దాంపత్యం అన్యోన్య హృదయరంజితతో, ఐక్యంతో ఉండాలి. భౌతికసుఖాలకంటే ఆత్మీయసుఖాల సమైక్యమే దాంపత్యానికి ఆయువుపట్టు. ఈ స్థితి–పరిపక్వ మైన, నిర్మలమైన, పరిపూర్ణమైనప్రేమ ఇరువురిలో ఉన్నపుడే రాణిస్తుంది. ప్రేమ హృదయంగమం కావాలి. అపుడే ప్రతి మాటలో, చూపులో, చేతలో సర్వత్ర ఒక్కటిగానే వ్యక్తమై, దాంపత్యానికి వన్నెతెస్తుంది. అప్పుడే ఒకరికోసం ఒకరు జీవిస్తున్నారనే మాట సార్థకమవుతుంది. చంద్రుణ్ణి వదలి వెన్నెలా, వెన్నెల్ని వదలి చంద్రుడూ ఉండనట్లుండాలి– దంపతులు. జాయాపతిత్వం జీవేశ్వరుల ఐక్యాను సంధాన పరమానందభరితం!

నాగులచవితి

- డా॥ మైలవరపు శ్రీనివాసరావు



నవంబరు 3వ తేదీ నాగులచవితి సందర్భంగా..

**నాగులచవితినాడు భక్తితో
నాగేశ్వరస్వామికి పూజచేసి, పుట్టలో
పాలు పోయటం మనభారతీయసంప్రదాయం.
సందర్భాలు వేరైనా పాముల్ని పూజించడం
మనదేశంలో అన్ని ప్రాంతాల్లోనూ ఉంది.
ప్రకృతిని ఆరాధించే సంస్కృతి మనది.
ప్రకృతిలో కన్పించే ప్రతిజీవికీ
అవి మనకు చేసే మేలుకు కృతజ్ఞతగా-
సందర్భానుసారంగా పూజలు చేస్తుంటాం.
వాటిలో ఒకటి సర్పపూజ.
నాగపంచమి, సుబ్రహ్మణ్యషష్ఠి పేరుతో
మరికొన్ని పండుగలు మనప్రాంతంలో చేసుకునేవి -
ఈ ఆచారాన్ని పాటించడానికే!**

**ఎప్పటినుంచో ఆచారం తప్పకుండా వస్తూ -
ఎందరో ఆచరించే పండుగ 'నాగులచవితి'.
కార్తికమాసంలో శుక్లపక్షంలో చవితినాడు వచ్చే
ఈ పండుగనాడు ఊళ్లోగానీ, ఊరివెలుపలగానీ
సహజసిద్ధంగా ఏర్పడినపుట్టలో పాలుపోస్తారు.**

పాలు తాగడానికి పుట్టలోపల పాము ఉంటుందా? ఉంటే, పాలు పోయడం మాట అటుంచి అసలు ఆ వైపు వెళ్లడానికి ఎవరైనా సాహసిస్తారా? మరి పాము లేదని తెలిసాక ఈ పాలను అలా వ్యర్థం చేయడమెందుకు?... కొత్త కాలపువాళ్లు ఈ విషయంలో ఇటువంటి ఎన్నో ఎదురు ప్రశ్నలు వేస్తారు. వాటికన్నిటికీ సమాధానం తెలుసుకుంటే ఎప్పటినుంచో వచ్చే ఆచారంలోని రహస్యం అర్థమై, సంప్రదాయం దెబ్బ తినకుండా ఉంటుంది. అందుకని లో విశేషాన్ని ఆలోచిద్దాం....

పురాణాలలో సర్పాలకు సంబంధించిన అంశాలు ఎన్నో ఉన్నాయి. సనాతనహైందవధర్మంలోకూడా నాగదేవతల ప్రస్తావనా-వాటిల్ని పూజించేసంస్కృతీ ఉంది.

ఉపకారాలు ఎన్నో....

మనదృష్టిలో మనప్రాణాలు తీసేది పాము కాబట్టి, శత్రువనే భావంతో చంపెయ్యాలని అనుకోవడం సహజం కావచ్చు. అయితే, దేవలోకంలో అమృతాన్ని రక్షిస్తూ ఉండేవి పాములే! ఎన్నివలలు వేసినా, ఎన్నిమందులుపెట్టినా చంప వీలుకాకుండా తిరుగుతూ - పొలాల్లో బొరియలు పెట్టి, పంటనష్టానికి కారణమయ్యే ఎన్నో ఎలుకల్ని వాటికన్నాల్లోకి వెళ్లి, తిని, మనకు ఒక విధంగా మేలుచేసేవి పాములే!

నలమహారాజును కాటేసి, అతనిసౌందర్యాన్ని హరించి, భారతకథలో నలునికి ఉపకారం చేసింది- కర్కోటకమనే నాగమే! దుర్యోధనుడు భీమునికి విషాన్నం పెట్టించి, కాళ్లు చేతులు కట్టించి నీళ్లలో పడవేస్తే అతనికి మహాబలం కలిగేలా చేసినవాడు 'ఆర్యకు'డనే నాగరాజే! అష్టదిగ్గజాలతో కూడిన ఈ భూభారాన్ని మొత్తాన్ని మోస్తున్నవాడుకూడా నాగమే!

భక్తితో పెట్టే పేర్లు

ఎన్నో సహాయాల్ని పాములు మనకు చేస్తూన్న కారణం గానే నీళ్లే స్థానంగా గల నారాయణుడు తనశయ్యగా ఉన్న శేషుడనే పామువిషపుగాలిని కాదనడంలేదు. నెత్తిమీద గంగ ఉన్న శంకరుడుకూడా శరీరంనిండా ఉండే పాముల విషపు గాలిని వద్దనడంలేదు. నీటిశుభ్రతకూ, విషపుగాలికీ సంబంధం ఉందనడానికి ఈ రెండు ఉదాహరణాలూ సాక్ష్యం.

పాములవల్ల ఎంతో సహాయం జరుగుతోందనే కారణం గానే లోకంలో ఎందరో నాగులమీద భక్తితోనూ, సర్పాలు

సుబ్రహ్మణస్వరూపమనే భావనతోనూ పాపయ్య (పాము+ అయ్య)-పాపారావు-సుబ్బలక్ష్మి (సుబ్రహ్మణ్య పదానికి వికృతి 'సుబ్బ' అనుకోవాలి)-సుబ్బరావు-శేషయ్య-నాగరాజు... వంటి పేర్లు పెట్టుకున్నారు-వాళ్ల వాళ్ల సంతానానికి. అంతేకాదు.

కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్య చ।
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనమ్॥

కర్కోటకసర్పాన్నీ - నలదమయంతుల కథనూ- ఋతు పర్ణమహారాజుచరిత్రనూ వింటే కలిదోషం తొలుగుతుందని కూడా చెప్పారు.

ఆధ్యాత్మికరహస్యం

తలనుంచీ తోకవరకూ మెలికలు వేసుకుని ఉన్న రెండు పాముల రాయి ఒకటి, రావిచెట్టుకింద ఉండటం దేవాలయాల్లో కనిపిస్తూ ఉంటుంది. దీనిలోనే అసలు రహస్యం దాగి ఉంది. ముక్కు కున్న పింగళ - ఇడ అనే పేరున్న కుడి /ఎడమముక్కు రంధ్రాలద్వారా ప్రతివ్యక్తీ పీల్చేగాలి లోపలికి వెడుతుంది. ఆ వెళ్లడంకూడ ఈ పాములు మెలిక వేసుకుని ఉన్నట్లు శరీరం లోనికి పోయి సంచరిస్తూ ఉంటుంది. కొలిమిలో ఉన్న నిప్పును తోలుతిత్తినుండి వస్తూన్న గాలి, ఎలా ఆరనీయకుండా మండేలా చేస్తుందో- అలాగే ఎప్పుడూ ప్రసరిస్తూండే ఈ గాలి, శరీరంలో ఉండే ఉష్ణాన్ని పెరగకుండా - తగ్గకుండా చేస్తూంటుంది. ఎప్పుడైతే తోలుతిత్తినుండి గాలి ఊదడం మానేస్తామో, అప్పుడు నిప్పు ఆరి, కొలిమి చల్లబడుతుంది కదా! అలాగే ఈ ముక్కుశ్వాస ఆగిపోగానే శరీరంలోని వేడిమి పూర్తిగా పోయి, ఒళ్లు చల్లబడిపోతుంది. దాన్నే మరణమన్నారు- పెద్దలు.

ఇదంతా ఎందుకంటే ఈ శరీరాన్ని నియంత్రించేది ఈ వాయువే! కోపం వచ్చినప్పుడు శ్వాసవేగం పెరుగుతుంది. అందుకే 'వాడు బుసలుకొట్టాడు', 'కస్సుమని లేచాడు' వంటి వాక్యాలు ప్రయోగిస్తారు. ఈ రెండూకూడా పాముకు సంబం ధించిన ప్రయోగాలే. కాబట్టి ఈ దేవాలయంలోని జంట

విరిమీది హరిప్రియ



అలమేలుమంగమ్మా! నువు పూమిద్దెపైనున్న ముద్దరాలమ్మా!
పువ్వుపై మొలిచిన పుష్పరాశివి నీవు
పద్మాలయవు నీవు పద్మప్రియవు నీవు
పద్మహస్తవు నీవు హరిసమస్తమే నీవు.

మా అపాయాల హరించు హరికి అనపాయనివి
దయతోటి మము బ్రోచు మృదుహృదయస్వరూపిణివి.

నీచరణాల్ని శరణన్న మా ఆర్తి తీరును
సింధుకన్యవు నీవు హరిఆత్మబంధువువి
ధనధాన్యధన్యవు హిరణ్యసువర్ణవు
సర్వతీర్థస్థితవు సర్వసంపత్కరివి.

నీ గడప త్రొక్కినవారిని కడుపుచల్లగ చూడుతల్లీ!
తల్లిదీవెన ఎల్లశుభముల వెన్నెలలను వెదజల్లు నమ్మా!
కొండలెక్కిన స్వామికే సిరి నీవు లేకుండ
శ్రీనివాసుడు అన్న కీర్తి లోకాన సమకూడునా?

పలుకు తేనెల తల్లివి, చిఱునగవుమల్లికల కల్పవల్లివి,
నీ మహి మేమెు అంబరం, నువు భక్తహృదయాబ్జబంభరం,
పసుపు కుంకుమలు నీదు చిఱునామసిరులు।
నీ చిఱునవ్వుతో మాకు భాగ్యాబ్ధిచంద్రికలు వరలు.

-డా॥కలువగుంట రామమూర్తి, 92474 99120.

పుట్టమన్ను

చెదపురుగుల నోటనుంచి ఊరే ఒక విధమైన జిగురుతో మట్టిని ప్రత్యేకంగా వేరుచేసి మళ్లీ ఆ నోటిఊటతో కట్టబడేదే పుట్ట. ఈ జిగురు కారణంగానే, వర్షపునీటికి కూడా పాడవనంత గట్టిగా కోటలా ఉంటుంది- పుట్ట.

ఏ కార్యక్రమంలోనైనా 'అంకురారోపణం' అనే ప్రారంభఘట్టానికి ఈ పుట్టమట్టినే పాలికలలో వేసి, ఆ మట్టిలో నవధాన్యాలను చల్లి, అవి ఏపుగా పెరిగిన విధానాన్నిబట్టి ఆ మట్టికున్న గొప్పతనాన్ని పరోక్షంగా గ్రహించవలసిందని చెప్పారు-ప్రాచీనులు. ఎక్కడ సహజసిద్ధంగా పుట్టపెరిగితే, ఆ పుట్టకింద నీరుంటుందనేది వరాహమిహిరుడు చెప్పినసత్యం.

పాములవిగ్రహం 'శ్వాసను నియంత్రించుకుని సక్రమంగా ఉండవలసింది సుమా!' అని హెచ్చరిస్తుందన్నమాట. ఈ విగ్రహంకూడా ఉండేది- రావిచెట్టుకిందే!

అశ్వత్థ వృక్షం

సంస్కృతంలో రావిచెట్టును 'అశ్వత్థవృక్షం' అంటారు. 'శ్వః' అంటే రేపటిరోజని అర్థం. న+శ్వః= అశ్వః. 'రేపటి రోజున చేద్దాం! అనే ఆలోచన లేనివాడని దీని అర్థం. అగ్నిని రగుల్కొల్పి, నేయి వేస్తూ '...ఇంద్రా యేదం న మమ' 'ఈ హవిర్భాగం ఇంద్రునికి చెందుగాక' అని అన్నంతలోనే అగ్ని దేవుడు ఆ హవిర్భాగాన్ని ఇంద్రునికిచ్చి, తర్వాత 'చదవబోయేమంత్రంప్రకారం ఎక్కడికి వెళ్లాలా?' అని సిద్ధంగా ఉంటాడట!

'రేపు వెడదాంలే'! అనే బద్ధకపుధోరణి లేనివాడు 'అగ్ని' అని 'అశ్వ' పదానికి అర్థం. అలాంటి అశ్వుడు (అగ్ని) కొంత కాలంపాటు రావిచెట్టులో (స్థ) ఉన్నాడు కాబట్టి ఆ వృక్షం అ+శ్వ+స్థ= 'అశ్వత్థ' అయింది.

అందుకనే అగ్నిలో రావిసమిధలనే వేస్తారు- 'ఆయన కిష్టం గదా'! అని. కాబట్టి అగ్నిని రగుల్కొల్పేది వాయువని అర్థమైంది. కోపానికి ప్రతీక అగ్ని.

సర్వానర్థాలకూ మూలమైనకోపం 'తనకోపమె తనశత్రువు' అనే వాక్యం ద్వారా తెలుస్తోంది కదా! అలాంటి కోపాన్ని అణుచుకోవడానికే గాలిని నియంత్రించడమనే విధానాన్ని ప్రాణాయామం పేరిట ఏర్పాటు చేశారు- ప్రాచీనులు. కాబట్టి ఈ వాయువుకు ప్రతీకలైన జంటనాగుల విషయంలో జాగ్రత్తగా ఉండవలసిందని చెప్పడానికే ఈ విగ్రహాన్ని దేవాలయాల్లో - అందునా రావిచెట్టు (అగ్ని) కింద ఉంచుతారన్నమాట!

జ్ఞానామృతం

ఇక ఈ నాగులకు పుట్టలో పాలుపోయడంలో కూడా ఒక విశేషం ఉంది. పుట్టకు ఎలా ఎన్నెన్నో కన్నాలున్నట్లే ఈ శరీరమనే పుట్టకూ నవరంధ్రాలున్నాయి. పుట్టకిందిభాగం విశాలంగా ఉండి, పోను పోను సన్నగా ఎలా అయిపోతుందో, అలాగే ఈ శరీరంకూడా కూర్చునప్పుడు పిరుదులూ, కటిభాగం కారణంగా పెద్దదిగా, వెడల్పుగా కన్పిస్తూ పోను పోను వైశాల్యంలో మరీ చిన్నదై, ఆ భాగం తలగా పిలవబడుతుంది. పుట్టలో పాలు పోసినట్లు ఈ శరీరమనే పుట్టలోకూడా జ్ఞానమనే అమృతాన్ని 'తలనుంచే పోయాలి' అని దీని అర్థం. ఏ విషయాన్నైనా 'తలతో' చదివినదానికీ. ఏదోలా చదివినదానికీ భేదం లేదా మరి!

తలనుంచి అలా కిందివరకు దిగి ఉండేది 'కుండలినీ' శక్తి కదా! కుండల మంటే 'పాముల చుట్ట' అని అర్థం. కుండలాలు కలది కాబట్టి దీనిపేరు 'కుండలిని' అయింది.

నైవేద్యం

ఇక ప్రసాదంగా చిమ్మిలిని పెట్టడం- కార్తికమాసంలో ఉండే మంచుతో కూడిన చలికి ఆరోగ్యం చెడకండా ఉండేందుకే. పుట్టవద్ద దీపం పెట్టకపోవడం ఎవరికి వాళ్ళు తమ తమ జ్ఞానదీపాన్ని వెలిగించుకోవలసిందని సూచించేందుకే!

కాబట్టి 'ఇది తగిందీ - ఇది తగందీ' అనే యుక్తాయుక్త జ్ఞానమనే పాలను, ప్రతివ్యక్తీ తన నవరంధ్రాలతో ఉండే పుట్ట అనే శరీరంలో, పైభాగమైన శిరస్సుమీదుగా పోస్తూ-వెన్నుపామును (ఇడా పింగళ అనే పేరున్న శ్వాసనాడులను) అదుపులో ఉంచుకోవడమే - నాగులచవితి పర్వదినం నాడు పాలు పోయడంలోని అర్థమని గ్రహించాలి.



సమస్త జననీం వందే

- ఈ. అనంతరంగరామన్, 98854 60460

స్తోత్రం అంటే-మంచిగుణాలు కల వానిలో ఉండే గుణాలను కీర్తించడం. సమస్త కల్యాణగుణాకరుడైన శ్రీనివాస భగవానునిలో విశేషించి దయాగుణం, దాని పర్యంతసీమ అయిన వాత్సల్యం ప్రకాశిస్తున్నాయని దివ్యసూరులైన ఆళ్వార్ల అనుభవం. ఎదుటివాని కష్టాన్ని చూచి అయ్యో! అని జాలిపడడం దయ. దోషాలను గుణాలుగా ప్రీతితో గ్రహించడం వాత్సల్యం. శ్రీనివాసుని దయాగుణాన్ని, వాత్సల్యాన్ని స్తుతిస్తూ వేదాంత దేశికులు దయాశతకమనే స్తోత్రాన్ని రచించారు. ఈ స్తుతిని పైపైన గమనిస్తే శ్రీనివాసుని దయ, వాత్సల్యాలను కీర్తించే స్తుతిగా తోచినా, నిశితంగా చూచినపుడు ఇది ఈ రెండు గుణాలకు మారుపేరు అయిన జగన్మాత లక్ష్మీదేవిని స్తుతిస్తున్నదనే స్పష్టమౌతుంది. ఈ అంశాన్ని దేశికులే స్వయంగా "శ్రీనివాసస్య కరుణామివ రూపిణీం సమస్త జననీం వందే" అని అంటూ అందంగా సూచించారు.

లక్ష్మీదేవి జగన్మాత. లోకంలో, కన్నతల్లి తన బిడ్డలకు కడుపులో రూపు నిచ్చి, కని, పాలిచ్చి పెంచుతుంది. ఈ విషయాన్నే "శ్రీనివాసుని దయా దేవీ! నీవు ప్రళయసమయంలో రూపుమాసి, అసత్తువలె పడి ఉండే చేతనవర్గాన్ని చూచి జాలిపడి, వాటికి కరణకళేబరాలను ఇస్తున్నావు" అంటూ దేశికులు దయాదేవి జీవులకు చేసే కరణకళేబర ప్రదానాన్ని "చైతన్యస్తన్య దాయినీం శ్రీనివాసస్యకరుణామ్" అని జ్ఞానమనే పాలిచ్చి జీవులను పెంచేవిధానాన్ని ప్రస్తావించారు. ఇది లోకమాత లక్ష్మీదేవికార్యమే కదా!

ఏడుకొండల వేంకటేశ్వరుని
హృదయమే ఆ పద్మసరోవరం.
అందులో కొలువైన
అర్ధాంగ లక్ష్మియే అలమేలుమంగ.
ముజ్జగాలనేలే ఆ పద్మావతి
మనస్సు కరుణామృతసరస్సు.
భక్తులు చేలాంచలం పరచి
చేయెత్తి మొక్కాలేగాని
లేదన్నదే లేదు.

తల్లి వాత్సల్యగుణానికి ప్రతీక. లక్ష్మీదేవికి ఉండే ఈ గుణాన్ని దేశికులు శ్రీనివాసునిదయపై ఆరోపిస్తూ-"దయాదేవీ! ఎక్కువ పాపాలు చేసిన నన్ను విడచి, పరిమితపాపాలు చేసిన ఇతరులకోసం నీవు వెదుకుతున్నావు. నీ కడుపు నన్ను చూచి, అంతులేని నా పాపాలను స్వీకరిస్తే తప్ప నిండదు" అని చమత్కరించారు. దయాదేవి వాత్సల్యగుణాన్ని ప్రశంసించడం లక్ష్మీవాత్సల్యాన్ని పొగడడమే!

పాంచరాత్రాగమం లక్ష్మీదేవిని పురుషకారస్వరూపిణి అని పల్కింది. శరణాగతుని పాపాల్ని క్షమించి, వారిని రక్షించమని స్వామితో వాదులాడి, అంగీకరింపజేయడమే లక్ష్మిచేసే పురుషకారం.

తిరుమలకొండ చల్లని సెలయేళ్లుకు ప్రసిద్ధి అని దివ్యసూరికీర్తనం. కొండపై పారే సెలయేళ్లు చల్లనిస్వభావం కలిగిన లక్ష్మీ స్వరూపాలే- అని దేశికులంటారు.

భగవదవతారాలన్నిటిలో వెన్నంటి ఉండే లక్ష్మీస్వభావం లక్ష్మీవైభవం దయాశతకంలో ఎక్కడ గమనించినా ప్రస్ఫుటమవుతుంది.



కార్తికజ్యోతి

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

పురాణవాఙ్మయంలో పన్నెండుమాసాలకు ప్రత్యేక మహిమలు చెప్పే చిరుపురాణాలున్నాయి. కార్తికపురాణం, మాఘపురాణం-వంటివి. వేదాలలో యజ్ఞాద్యనుష్ఠానాలుకూడా వివిధఋతువుల్లో వివిధవిధానాలు ఏర్పరచాయి. వాటిని సామాన్యజనులకు కూడా ఆచరణయోగ్యంగా మలచడానికి పురాణాలు పూనుకున్నాయి. కార్తికం-మాఘం-శ్రావణం-వంటి మాసాలలో ప్రత్యేక ధార్మికకార్యాలు విధించాయి.

కార్తికమాసం అనగానే తెల్లవారుజామున స్నానాలు, ఉభయసంధ్యల్లో శివకేశవాదిఆలయాలలో దీపారాధనలు, నదులలో, తటాకాలలో దీపాలను విడిచిపెట్టడం..... చక్కని సందడి! ఇందులో దివ్యత్వంతో పాటు ఒక ఉత్సాహం, ఉల్లాసం వెల్లివిరుస్తాయి. చిరుచలిలో బద్ధకాన్ని వదుల్చుకొని చేసేస్నానం, చిరుదీపాలు నీటి అలల్లో తేలియాడుతుంటే ఉండే సౌందర్యం... ప్రకృతిలో దివ్యత్వాన్ని ప్రతిష్ఠించి, ప్రదర్శించే హైందవమతంలోని దివ్యకళాచాతురిని కొనియాడవలసిందే!

కార్తికంలో దేశమంతా ప్రత్యేకంగా ఆధ్యాత్మిక చైతన్యంతో విలసిల్లుతుంది. ఎవరికి తగ్గ నియమాన్నివారు పాటిస్తూ దైవాన్ని కొలుచుకుంటారు. కార్తికం దీపానికీ, మాఘం స్నానానికీ, వైశాఖం దానానికీ ప్రాధాన్యం. కార్తికంలో వచ్చే చవితి, ఏకాదశి, ద్వాదశి, పూర్ణిమ, సోమవారాలు ప్రత్యేకపర్వాలు. కొందరు మాసమంతా నక్తవ్రతం చేస్తారు. శివ, కేశవ, దేవీభక్తులకు ఇది ప్రత్యేకసాధనా మాసం. ఈ మాసంలో విష్ణువును దామోదరనామంతో పూజిస్తారు. మార్గశీర్షంలో 'కేశవ'నామంతో మొదలుకొని వరుసగా పన్నెండు నామాలతో ప్రతిమాసంలోని శుద్ధఏకాదశినాడు విష్ణువును ఆరాధించడం సంప్రదాయం. ఆ వరుసలో కార్తికశుద్ధ ఏకాదశి 'దామోదరు'నిది. అందుకే ఈ మాసానికే 'దామోదరమాసం' అని పేరు.



కార్తికంలో బృందావనవ్రతం విశిష్టమైంది. ఈ మాసంలో బృందావనానికి ప్రతీకగా తులసిని పూజించడం ప్రతిప్రాంతంలో జరుగుతుంది. తులసి, ధాత్రి (ఉసిరిక) సమేతంగా విష్ణువును పూజించడం ఈ మాసంలో ఆచారం. వృక్షాలలోని దివ్యత్వాన్ని దర్శించే సంస్కృతిలోని ఘనతకు నిదర్శనం.

మరొక ప్రత్యేకత 'వనభోజనం'. ఇది సామాజికసమైక్యతకు ఒక సంకేతం. నిజానికి దీనికికూడా ఒక సంప్రదాయ పద్ధతి ఉంది. పవిత్రవృక్షాలున్న వనానికి చేరి-తులసి, మారేడు, ఉసిరికవంటి వృక్షాలసన్నిధిలో దేవతారాధన చేసి, వండి నివేదించిన ఆహారపదార్థాలను భుజించడం ఆనవాయితీ.

ఇక కార్తిక శుద్ధ ఏకాదశికి విశిష్టత ఉంది. దీనికి 'ఉత్థాన ఏకాదశి' అని పేరు. ఈ రోజున ఏకాదశీవ్రతాన్ని చేసినవారికి విశిష్టఫలం చేకూరుతుందని శాస్త్రం. మార్గశీర్షంతో మొదలుపెట్టిన ఏకాదశీవ్రతానికి, ఈ కార్తికంతో సంవత్సరకాలం పూర్తవుతుంది. అందుకే దీనికి ప్రాధాన్యం.

ఆశ్వయుజపూర్ణిమ, కార్తికపూర్ణిమ- ఈ రెండూ శరత్పూర్ణిమలు. ఈ పూర్ణిమ నాడే రాసలీలామహోత్సవం జరిగింది. యోగశుద్ధులైన జీవులు గోపికలు. వారిని పరమాత్ముడు అనుగ్రహించిన మోక్షప్రదానలీల రాసలీల.

ఈ పూర్ణిమనాడు దేవీఆరాధనకూడా ముఖ్యమైంది. సహస్రారచంద్రకళా స్వరూపిణి అయిన లలితామహాత్రిపురసుందరిని ఈ పర్వంనాడు ఆరాధించాలి.

కృత్తికానక్షత్రంనాడు పూర్ణిమ ఏర్పడేమాసం కార్తికం. కృత్తిక అగ్నినక్షత్రం. అగ్నియందు ఈశ్వరస్వరూపాన్ని ఆవిష్కరించి ఆరాధించడమే యజ్ఞం. అందుకే వేదాలలో 'నక్షత్రేష్టి' అనేది- కృత్తికానక్షత్రంతోనే ప్రారంభమవుతుంది. ఆ యజ్ఞతత్త్వానికి సంకేతంగానే 'దీపారాధన' అనేది కార్తికంలో ప్రధానమయ్యింది. కార్తికంలో దీపార్చన, దీపదానవంటివి-యజ్ఞఫలాలను ప్రసాదిస్తాయి. కార్తికసోమవారం వంటివి శివ ప్రాధాన్యాన్ని చెబుతున్నాయి. 'కార్తికం' అనగానే మనకు శివుడే గుర్తువస్తాడు. శివక్షేత్రాలలో గొప్ప వైభవం కనిపిస్తుంది. కాశివంటి ఉత్తరాదిశైవతీర్థాలు కూడా శివశోభను సంతరించుకుంటాయి.

కృత్తికానక్షత్రజాతుడైన, యజ్ఞాగ్నిస్వరూపుడు సుబ్రహ్మణ్యుని ఆరాధనకుకూడా ఈ మాసం ప్రత్యేకం. 'కుమారదర్శనం' పేరుతో కార్తికపూర్ణిమను వ్యవహరిస్తారు.

జ్యోతిర్లింగస్వరూపుడైన శివునికి ప్రతీకగా- ప్రతిదీపమూ ఒక జ్యోతిర్లింగమై భాసిస్తూ-విశ్వవ్యాపకమైన ఈశ్వరజ్యోతిని దర్శించి, ఉపాసించమని ఉపదేశించే మాసమిది.

కోపము మానినగా కూడదు శాంతి



అక్టోబరులో జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవం



శ్రీవారి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమము



ఆంధ్రప్రదేశ్ తరపున శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి మాన్యశ్రీ నారాచంద్రబాబు నాయుడు







శ్రీవారి దర్శనానంతరం ఆలయంలో గౌ॥ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ నారాచంద్రబాబు నాయుడు



2017 తి.తి.దే. క్యాలెండరును ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి




బ్రహ్మోత్సవాలలో భక్తులను అలరించిన వివిధ ప్రదర్శనలు, కళాబృందాలు

కైంకర్యమే.. తనువు దాల్చితే....

7

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



(జరిగిన కథ - కాంచీపూర్ణులు అనుగ్రహించిన 'దేవరాజాష్టకం' గత సంచిక నుండి భక్తులకు వివరించబడుతోంది. రామానుజులు కాంచీపూర్ణుని మహత్త్వాన్ని గుర్తించారు. ఆ తర్వాత......)

సంసారమరుకాంతారే దుర్వ్యాధివ్యాఘ్రభీషణే ।
విషయక్షుద్రగుల్మాఢ్యే తృషాపాదపశాలినీ ॥

పుత్రదారగృహక్షేత్రమృగతృష్ణాంబుపుష్కలే ।
కృత్యాకృత్యవివేకాంధం పరిభ్రాంతమిత స్తతః ॥

అజస్రం జాతతృష్ణార్త మవసన్నాంగ మక్షమమ్ ।
క్షీణశక్తిబలారోగ్యం కేవలం క్లేశసంశ్రయమ్ ॥

సంతప్తం వివిధైర్దుఃఖైః దుర్వచై రేవ మాదిభిః ।
దేవరాజ! దయాసింధో! దేవదేవ! జగత్పతే! ॥

త్వదీక్షణసుధాసింధువీచివిక్షేపశీకరైః ।
కారుణ్యమారుతానీతైః శీతలై రభిషించ మామ్ ॥

"కరుణాసముద్రా! వరదరాజస్వామీ! దేవాధిదేవా! లోకాలకు పతి అయినవాడా! క్రూరవ్యాధులు అనే పులులచేత భయంకరమైందీ, లౌకికసుఖాలు అనే క్షుద్రమైన ముళ్లపొదలతో నిండిందీ, ఆశలు అనే మహావృక్షాలతో దట్టమైందీ, పుత్రులు, భార్య, ఇల్లు, ఆస్తి - అనే ఎండమావులనీటితో నిండిందీ అయిన సంసారం అనే భయంకరారణ్యంలో "ఇది చేయదగిందీ, ఇది చేయకూడందీ" అనే వివేకాన్ని ఏమాత్రం లేకుండా ఎక్కడెక్కడో తిరిగి తిరిగి అల్లాడి, నిరంతరం విషయతృష్ణార్తుడనై, శరీరం కృశించినవాడనై, అసమర్థుడనై, శక్తి, బలం, ఆరోగ్యం అనే వీటిలో దేనినీ లేనివాడనై, పలుక్లేశాలతో పూర్తిగా తపింపబడ్డవాడనై, చెప్పడానికి వీలు కాని, ఇటువంటి అనేకబాధలతో ఆర్తుడనై ఉండే నన్ను నీ కరుణ అనే వాయువుచే ప్రేరేపించబడ్డవి, చల్లనివి అయిన నీ కటాక్షామృత నదీప్రవాహతరంగాలతో అభిషేకించు".

ఈ శ్లోకాలు అన్నీ "అచ్యుత" అనే మొదటిశ్లోకంలోని సంబోధనను వివరిస్తున్నాయి. ఈ అయిదు ఒకే అన్వయాన్ని కల్గినవి కనుక 'కులకం' అనబడుతాయి. సాంసారికతాపాలతో అత్యంతం ఆర్తిని పొందిన, నన్ను నీ కృపాకటాక్షామృతవర్షంతో చల్లబరచి అనుగ్రహించాలనేది వీటితాత్పర్యసారం.

జీవితంపై వ్యామోహం ఉంటే, జీవించడంకోసం కావాల్సినవాటిపైకూడా వ్యామోహం ఉంటుంది. ధన, కనక, వస్తు వ్యామోహాలూ, ప్రాపంచికమైన విషయవాంఛలూ వీటన్నింటినీ కలిగిఉండడాన్ని 'రాగం' అంటారు. ఈ 'రాగం' గలవాళ్లే రాగులు. ఇవేమీ లేకపోతే వాళ్లను విరాగులు అంటాం. దీనిభావమే వైరాగ్యం.

భక్తిమార్గంలో పయనించేవాళ్లకు ప్రాపంచికవిషయవాంఛలపైగల వ్యామోహం ఆటంకాలు కల్గిస్తుంది. సాంసారిక విషయాలను పరిత్యజించి, వైరాగ్యాన్ని పెంపొందించుకోవడం సర్వదా శ్రేయస్కరం. వైరాగ్యం భక్తిని ఇనుమడింప జేస్తుంది. ప్రాపంచిక బంధనాలు భక్తిమార్గానికి అవరోధాలు. వాటిని తెంచుకుంటేనే మార్గం సుగమమం అవుతుంది. భక్తిద్వారా భగవదనుభూతి, అనుగ్రహం కలుగుతాయి. మానవుడు ఇంద్రియాలను జయించినప్పుడే ఆత్మోత్తేజం కలుగుతుంది. ఇంద్రియాలను జయించాలంటే వైరాగ్యమే శరణ్యం. దీనికి సత్యజ్ఞానదర్శనం అవసరమౌతుంది. జ్ఞానహీనుడైనవాడు అశాశ్వతమైన శరీరంతో సంబంధం గల గృహారామక్షేత్రాదులను మోహవశంచేత శాశ్వతంగా భావిస్తాడు. ఇది భ్రమ. ఈ భ్రమే అతణ్ణి వైరాగ్యంనుండి దూరం చేస్తుంది. ఐహికమైన, దుఃఖమయమైన సంసారవలయంలో చిక్కుకొనేట్టు చేస్తుంది.

భార్యాపుత్రులు, మిత్రులు, బంధువులు ఇలా.. అశాశ్వతమైన అనేకఅంశాలపై వ్యర్థంగా మనస్సును లగ్నం చేసుకొని, కాలాన్నిసైతం వ్యర్థం చేసుకుని, తన సర్వశక్తులనూ వారికోసమే

ధారపోస్తూ, జీవితాన్ని శోకమయంగా మార్చుకుంటారు. ఈ జీవితంలో సాధించాల్సింది సాధించకుండా సాంసారికమైన విషయవాంఛలకే కాలాన్ని వ్యర్థం చేసుకోవడంవల్ల మళ్లీ జన్మ లభిస్తుంది. కథ మళ్లీ మొదలవుతుంది.

అలాకాక ప్రాపంచికబంధాలను తెంచుకొని వీతరాగుడై, భగవంతుణ్ణి స్మరిస్తూ భక్తిమార్గంలో పయనించాలనే ఆలోచన పూర్తిగా చేతులు దాటిపోయిన తర్వాతమాత్రమే తడుతుంది. వృద్ధాప్యం సమీపించి, శరీరం సహకరించని స్థితిలో భగవంతుణ్ణి స్మృతికి తెచ్చుకొని విలపిస్తాడు. ఇదంతా వివేకహీనులు చేసే కృత్యాలు.

అలా కాక నశించేస్వభావం గల ఐహికభోగాలపై ఆసక్తిని మొదట్నుండే నిగ్రహించి, వైరాగ్యభావాన్ని కలిగి ఉండడమే అత్యంతప్రయోజనకారి అవుతుందని, యోగమార్గంలో సాధన చేసిన విరాగులు, ఆధ్యాత్మికవేత్తలు, పరమభక్తులు, భాగవతోత్తములు భావించారు. ఆ కోవలోకి చెందిన భాగవతోత్తముడే కాంచీపూర్ణులు.

అజ్ఞానాంధకారబంధురమైన ఈ లోకమే సంసారం. దీన్ని కాంచీపూర్ణులు తమ 'వరదరాజస్తవం'లో ఒక భయంకరారణ్యంగా రూపించారు. అరణ్యంలో పులి మొదలైన క్రూరమృగాలు ఉంటాయి. సంసారంలోకూడా భరించలేని వ్యాధులే క్రూరమృగాలు. అరణ్యంలో లోపలకు పట్టిలాగే ముళ్లపొదలు చాలా ఉంటాయి. సంసారంలో లౌకికసుఖాలే ఆవిధంగా పట్టిలాగే ముళ్లపొదలు. అరణ్యంలో ఎన్నోరకాల వృక్షాలు ఉంటాయి. సంసారంలోకూడా పలువిధాలైన ఆశలే ఆ వృక్షాలు.



తాపాన్ని పొందినవారిపై మంచివర్షం పడితే వాళ్ల సకల తాపాలు తీరి, చల్లదనం కలిగేటట్లే, తాముకూడా సాంసారికతాపాలను అన్నింటినీ దాటి, ఉపశమనం పొందేటట్లుగా వరదరాజస్వామిదివ్యకటాక్షదృష్టివృష్టి కురియాలని ప్రార్థిస్తూ దేవరాజస్తవం చేశారు– కాంచీపూర్ణులు.

చూచెనా కన్నెత్తి, చూపుతోఁ బాపుల
  దుశ్చింత లన్నియుఁ దొలగిపోవు ;
సెలవివారగ నొక్కచిరునవ్వు నవ్వెనా
  అజ్ఞానతిమిరంబు లడగిపోవు;
పల్లెత్తి దయతోడఁ బల్కెనా యొకపల్కు
  కరకుటెదందయుఁ గరగిపోవు;
ఆదరమారంగ నండకుఁ జేర్చెనా
  ఆతతాయియుఁ బరమాప్తు డగును;
పూతచరితుడు సజ్జనపూజ్యతముడు;
నా తిరుకచ్చినంబిసంగాతమునను
పరమపావనుడగు మహాపాపుడైన;
మెరయదే యిన్ము నిప్పుచే? మెత్తవడదె?

కాయమునకుఁ బదమ్ములకరణి జనత
కాశ్రయమ్మగు విమలశూద్రాన్వయుండు
ధరణిసురులకుఁగూడ నాదర్శ మతడు
నిఖిలమానవసంస్తవనీయగుణుడు.

భాగవతపుంగవుల యెడఁబాటు గొనగ
రాదు, పుట్టిన వంగడమేదియైన;
ముండ్లపొదలోన మొలవదే మొగలిపూవు?
పుట్టదే పున్గుపిల్లికిఁ జట్టమందు?

– అని ఆలోచించుకుని రామానుజులు కాంచీపూర్ణుల దయకు పాత్రులై, అనేకవిషయాలు తెలుసుకోదలిచారు. తల్లి అనుమతికూడా లభించింది. ఇకనేం? అనుకున్నదే తడవుగా కాంచీపూర్ణుల దగ్గరకు వెళ్లి –

వందనమో మహాత్మ! జనవందిత! సత్వగుణార్ణవా! సదా
నంద! సమాశ్మకాంచన! జనార్దన! దివ్యపదాంబుజద్వయీ
వందనసేవనస్తవనపావనజీవన! సాధుభావనా!
మందశుచిస్మితానన! సమానవనీపకమేదినీపకా!

అని స్తుతించి, "నేను మిమ్ము ఆచార్యునిగ వరిస్తున్నాను. మీరు నన్ను శిష్యపరమాణువుగా స్వీకరించు"మని నంబిపాదాల్ని ఆశ్రయించారు. నంబి తమపాదాలు విడిపించుకున్నారు. రామానుజులు చేతులు జోడించి, నంబిముందు నిలిచారు.

(ఇంకా ఉంది)

అపురూపం అలమేలుమంగ ఆలయం

- డా॥ ఈమని శివనాగిరెడ్డి, 98485 98446



అలర్మేల్‌మంగాపురం చూడందే తిరుపతియాత్ర పూర్తి కాదంటారు. అలర్ అంటే 'పువ్వు' అనీ, మేల్ అంటే 'మీద ఉన్న' అనీ, మంగ అంటే 'మగువ' అనీ, అలర్మేల్ అంటే, పువ్వుమీద ఆసీనురాలైన యువతి అనీ, ఆమె ఎవరో కాదు సాక్షాత్తు లక్ష్మీదేవి అని పెద్దలంటారు. పద్మాన్ని ఆసనంగా చేసుకొంది గాబట్టి ఆమెకు పద్మావతి అని పేరువచ్చింది. ఆకాశరాజు కూతురుగా జన్మించిన పద్మావతిని శ్రీనివాసుడు పెళ్లి చేసుకొన్నాడనీ, పెళ్లైన తర్వాత, వారికి కనిపించిన అగస్త్యమహాముని, కొత్తదంపతులు ఆరునెలలపాటు కొండ ఎక్కరాదనే నియమం పెట్టడంవల్ల, ఆ దంపతులు శ్రీనివాసమంగాపురంలో ఆ ఆర్నెల్లూ కాలం గడిపారనీ, అందుచేత శ్రీవారిని కల్యాణవేంకటేశ్వరుడంటారనీ, రాను రానూ ఆ ప్రదేశం శ్రీనివాసమంగాపురంగా పిలువబడిందనే ఐతిహ్యం ప్రచారంలో ఉంది. తొలుత పద్మావతికి ఇక్కడే ఆలయముండేదనీ, తరువాత తిరుచానూరులో కొలువైనందున తిరుచానూరుకు అలమేలుమంగాపురమనే, పేరువచ్చింది.

క్రీ.శ. 8వ శతాబ్ది నాటికి, తిరుపతికి 3 కి.మీ. దూరంలో సువర్ణముఖీనదీతీరాన గల ఈ ఊరికి శుకమహర్షి తపస్సు చేయడం వల్ల తిరుశుకనూరనీ, క్రీ.శ. 16-15 శతాబ్దాల మధ్య శాసనాల్లో చిరుచ్చుగనూరు అనీ, తిరుచ్చొగనూరని పేర్కొనబడిందనీ చరిత్రకారులు చెబుతున్నారు.

శ్రీనివాసునిభార్య అయిన పద్మావతీదేవి, కరివేపాకు తెచ్చుకోవటానికి, తిరుచానూరుకు వచ్చి, ఇక్కడనే శిలగా మారిపోయిందనీ, ఆ శిలపై కట్టిన దేవాలయమే పద్మావతిదేవి ఆలయంగా పేరొందిందనే కథ ప్రచారమైంది. ఎన్ని కథలు, గాథలు ప్రచారమైనా, తిరుమల శ్రీ వేంకటేశ్వరుణ్ణీ, తిరుపతి గోవిందరాజస్వామినీ దర్శించుకొన్న భక్తులు తిరుచానూరులోని పద్మావతిఅమ్మవారిని దర్శించుకోకపోతే, వారితిరుపతియాత్ర పరిపూర్ణం కాదన్న పెద్దలమాటతో, తిరుమల - తిరుపతియాత్రికులు అలమేలుమంగాపురంలోని పద్మావతీ దేవిఅమ్మవారిని విధిగా దర్శించుకొనే ఆచారం అనాదిగా వస్తూంది.

ఒకప్పుడు శ్రీవారిధాన్యాగారంగా పేరొందిన ప్రస్తుత పద్మావతీదేవాలయం విశాలప్రాంగణంలో నిర్మించబడింది. ముందుగా ఐదంతస్తుల రాజగోపురంలోకి ప్రవేశించిన భక్తులకు చల్లగాలులు ఆహ్వానం పలుకుతాయి. సాగి, లోనికి వెళ్లగా ఎదురుగా వరదరాజస్వామి, శ్రీకృష్ణ, బలరామాలయాలు, కుడివైపున మహావిష్ణుఆలయం, ఎడమవైపున పద్మావతిదేవి ఆలయం దర్శనమిస్తాయి. శ్రీకృష్ణాలయం, గర్భాలయం, అర్థమండపం, మహామండపాలతో అలరారుతుండగా, పద్మావతీఅమ్మవారి ఆలయంకూడా గర్భాలయ, అర్ధమండప, ధ్వజస్తంభ, బలిపీఠాలతో, వాహనాలయంలో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దబడింది. కొలువైన అలర్మేల్ మంగతాయారు, పద్మావతిదేవి, పద్మపీఠంపై, పద్మాసనంలో చేతుల్లో పద్మాలు ధరించి, సర్వాలంకారశోభితగా భక్తుల కోరికలను తీరుస్తూంది.

ఆలయంలో ఇంకా శ్రీదేవీ, భూదేవులకు కూడా ప్రత్యేకాలయాలుండి, ఆధ్యాత్మికశోభను సంతరించుకొంది. చుట్టూ విశాలమైన, ఎత్తైన ప్రాకారం, వెనుకవైపు కోనేరు, మధ్యలో నీరాళి మండపం నిర్మించబడినాయి. తొలుత శ్రీవారి వక్షఃస్థలంపై కొలువుదీరిన లక్ష్మీదేవి, అటు తరువాత శ్రీవారి ఆలయంవంటశాలలో స్థిరనివాసమేర్పరచుకొందని అన్నమయ్య 'వాలినరాజసముతో వంటశాలలోనే, మేలిమిగ గూచున్నదలమేలుమంగ' అనీ, 'కంటి శుక్రవారము గడియ లేడింట, అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని' అని తిరుమలలోని అలమేలుమంగ (పద్మావతి అమ్మవారిని)ను అర్చించటం గమనించాల్సిన విషయం.

కార్తికశుక్లపక్ష పంచమీశుక్రవారం, ఉత్తరాషాఢ నక్షత్ర శుభదినాన పుట్టిన పద్మావతీదేవికి, శ్రీ పాంచరాత్రాగమశాస్త్ర సంప్రదాయంరీత్యా అలమేల్మంగాపురంలో పద్మావతీ దేవీబ్రహ్మోత్సవం పరమ వైభవోపేతంగా జరుగుతుంది. భగవత్ప్రార్థన, అంకురార్పణ, ధ్వజారోహణల మొదలుగా గల 21 క్రియలున్న బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవం తరువాత హవిర్ని వేదనం, క్షమా ప్రార్థనంతో ముగుస్తాయి. జగన్మాత అయిన పద్మావతీదేవికి చాంద్రమాన ప్రయుక్త జ్యేష్ఠమాసపూర్ణిమకు పంచాహ్నికం (ఐదు రోజులపాటు)గా తెప్పోత్సవం అంగరంగవైభవంగా జరుగుతుంది. శ్రీప్రశ్నసంహితలో – 'శైశిరే గ్రీష్మకాలే వా శుక్లపక్షే శుభేదినే' వాసరే పూర్ణిమాయాం వా కర్తవ్య స్తు ప్లవో త్సవః' అని చెప్పడంవల్ల–తిరుచానూరులోని కోనేరులోని తీర్థ మండపాన్ని కదలీస్తంభచందనతోరణవితానచిత్రవస్త్రపుష్ప మాలలతో అలంకరించి, 'తత్ర పూజాం విశేషేణ కృత్వా దేశిక సత్తమః, నివేదయే త్తతోఽన్నాద్యం' అనే శాస్త్రోక్తిరీత్యా విశేష పూజలు నిర్వహించిన తరువాత పానకనారికేళ సలిలాలను, ఏలాలవంగ జాజీఫలాది భక్ష్యభోజ్యాదిహవిస్సులను నివేదించి, శిల్పి చేత శాస్త్రసమ్మతంగా నిర్మించిన, అలంకరింపబడిన తెప్పను పుణ్యాహజలంతో శుద్ధి చేసిన తరువాత కోనేరులోని నీటిని అభి మంత్రించి, తెప్పలో భూమినీ, విమానంలో శేషుణ్ణీ ఆవాహనం చేసి, వరుణదేవుణ్ణీ ఆహ్వానించి, పద్మావతి అమ్మవారి తెప్పో త్సవాన్ని జ్యేష్ఠపూర్ణిమనాడు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మ వారి చక్రస్నానం సందర్భంగా వేలసంఖ్యలో తిరుచానురు పుష్క రిణిలో స్నానం చేస్తారు.



తిరుచానూరు పద్మావతి అమ్మవారిబ్రహ్మోత్సవాల సందర్భంగా మరో విశేషప్రక్రియ జరుగుతుంది. తిరుమలనుండి అమ్మవారికి తులసి, పచ్చిపసుపుముద్ద, పట్టుపీతాంబరాలు, ప్రసాదాలు తీసుకొని, తిరుపతి పురవీథుల్లో త్రిప్పి, తిరుచానూరుకు తెచ్చే ఆచారం ఇప్పటికీ కొనసాగుతుంది.

పద్మావతి అమ్మవారి ఆలయానికి సంబంధించిన ఒక శాసనంలో అమ్మవారు సాక్ష్యమిచ్చిన సందర్భం ఒకటుంది. తాళ్లపాక చిన్నన్న 'అన్నమయ్యచరిత్ర' వ్రాసినపుడు అతడే రాశాడని చెప్పుకొంటున్న ఒక... శాసననకలు ఒక తాళపత్రంలో ఉందని, దాన్ని 1940లో చిన్నన్నవారసుడైన సూర్యనారాయణ దేవస్థానం అధీనంలో శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వరప్రాచ్యలిఖితభాండాగారం మరియు పరిశోధనసంస్థకు అందించాడనీ తిరుమల చరితామృతాన్ని వ్రాసిన పి.వి.ఆర్.కె.ప్రసాద్‌గారు ఉటంకించారు. ఆ తాళపత్రగ్రంథంలో నేతనేసే సాలీలు, జాంద్రవారు తామే అలమేలు మంగవారసుల మన్న విషయంలో, వారిద్దరిమధ్య ఒక వివాద మేర్పడింది. రెండు వర్గాలవారు పండితుడైన తాళ్లపాక చిన్నన్నకు మొరపెట్టుకొని, తీర్పు ఇవ్వమని ప్రాధేయపడినారు. చిన్నన్న పద్మావతీదేవిని ప్రార్థించి సమస్యకు పరిష్కారం చెప్పమని వేడుకోగా, సాలీలే నాకు వారసులని చెప్పిందని, ఆమెఆదేశానుసారం సాలీలే అమ్మవారివంశీకులనే నిర్ణయాన్ని ప్రకటించాడు. ఆనాటి నుంచి వీరిని పద్మసాలీలని పిలుస్తున్నారని వినికిడి. తీర్పునకు సంతోషించిన పద్మసాలీలు, తాళ్లపాక చిన్నన్నకు 20000 వరహాలు కానుకగా ఇచ్చి, ఆ డబ్బుతో ఆళ్లగట్టులో స్థలంకొని శ్రీనివాసునికి ఒక ఆలయాన్ని నిర్మించమని వేడుకొన్నారనీ, వారికోర్కెమేరకు తొండవాడసమీపంలో ప్రస్తుత రహదారి ప్రక్కనున్న మొండిగోపురమున్న చోట ఆ ఆలయముండేదనీ, దాన్ని తిమ్మప్ప ఆలయమని పిలుస్తారనీ, ఆ ఆలయం ఖర్చు నిమిత్తం, పద్మసాలీలు, ప్రతిమగ్గానికి ఒక బంగారురూక వసూలు చేసి, కులపెద్దలు ప్రతిసంవత్సరం ఇవ్వాలనికూడా తీర్మానం చేశారు. ఆ కులంలో వివాహం జరిగినపుడు, చిన్నన్నకు ఒక రూక చొప్పున ఇవ్వాలని, ఈ ఒప్పందం చిన్నన్నవారసులకు, కుల పెద్దల వారసులకూ ఆ చంద్రతారార్కం కొనసాగుతుందనీ వ్రాసిన రాగిరేకు క్రీ.శ.1543లో వ్రాయబడిందని పివీఆర్కే ప్రసాద్ తిరుమల చరితామృతంలో పేర్కొన్నారు. రండి. అపురూపమైన ఆలమేలుమంగఅమ్మవారిఆలయాన్ని సందర్శించి తరించండి.

వెనుకొన్న కోపము విడిచితే మేలు

పాలకడలిని వీడివచ్చిన శ్రీ మహాలక్ష్మి 'పద్మసరోవరం'లో శ్రీహరి తపస్సు కారణంగా అవతరించింది. హరి పట్టపురాణి చేతులలో విలాసంగా తామరపూలను ధరిస్తున్నది. పద్మాసనాసీనురాలు. ప్రాంచరాత్ర పూజలందుకొంటూ తిరుచానూరులో కొలువై విరాజిల్లుతోంది. సిరుల తల్లికి ఆగమోక్తంగా ఎన్నో ఉత్సవాలు, ఊరేగింపులు జరుగుతున్నాయి.

ఎన్ని ఉత్సవాలున్నా తిరుమలతిరుపతిక్షేత్రాలలో బ్రహ్మోత్సవాలకే పెద్దపీట. భక్తులు తిరుచానూరు పంచమీతీర్థానికి తండోపతండాలుగా తరలివస్తారు. అమ్మవారికి కోనేటితీరంలో జరిగే తిరుమంజనాన్ని చూసి, ఉప్పొంగిపోతారు. మనసారా మంగమ్మను ప్రార్థిస్తూ, పంచమీతీర్థస్నానాలు చేస్తారు.

పంచమినాడు, తిరుమలేశుని ఆలయం నుండి పసుపు, కుంకుమ, సారెలు - తిరుచానూరుకు అర్చకులు తెస్తున్నారు. 'ఓం' కారాదిగా ఉన్న వేదబీజాక్షరాలలో నిక్షిప్తమైన వెలుగుగా మహాలక్ష్మీదేవిని ఆరాధిస్తున్నారు. అర్చామూర్తిగా ఈ క్షేత్రంలో వెలసిన తల్లికి జరిగే ఉత్సవాలన్నీ కల్పవృక్షాలే, కమనీయస్వరూపాలే. బ్రహ్మోత్సవాలు వాహనసేవలతో, స్నపనకార్యక్రమాలతో, ఊంజల్‌సేవలతో మరింత కన్నులపండువుగా సాగుతాయి. ఈ వాహనసేవల అర్థాన్నీ, పరమార్థాన్నీ చిత్రికపట్టిన వ్యాసం మీకోసం..

ధ్వజారోహణం

అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడైన శ్రీవారిహృదయేశ్వరి పద్మావతీదేవికి గజధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు శ్రీకారం చుట్టుకుంటాయి. ధ్వజం ఆలయంలో జీవస్థానం. అందుకే **"ధ్వజో జీవ స్సఉచ్యతే"** అని ఆర్యోక్తి. ఈ నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు సకలదేవతలనూ పరిషద్దేవతలనూ, ఇతర భక్తకోటినీ ఆహ్వానించడమే ధ్వజారోహణంలోని అంతరార్థం.

చిన్నశేషవాహనం

శ్రీపద్మావతీదేవి బ్రహ్మోత్సవాలలో మొట్టమొదటిది- చిన్నశేషవాహనం, శేషుడు శ్రీవైకుంఠంలో నిత్యసూరుడై, లక్ష్మీనారాయణులకు సేవలందిస్తున్నాడు. కలియుగంలో అర్చామూర్తిగా వెలసిన శ్రీనివాసునికి శేషపర్వతమై శోభిల్లుతున్నాడు. శ్రీవారిహృదయేశ్వరియైన పద్మావతీదేవేరికి జరుగుతున్న కార్తికమాసబ్రహ్మోత్సవాలలో శేషుడు-చిన్నశేషుడై ముందుగా సేవలందిస్తున్నాడు. శేషభూతమైన ఈ ప్రపంచం సిరులతల్లిరక్షణలో సుఖాన్ని పొందుతూంది. శరణాగతిగద్యలో భగవద్రామానుజులు 'అఖిలజగన్మాతరం అస్మన్మాతరం' అని అఖిలజగన్మాతగా లక్ష్మీదేవిని తెలియజేశారు.

పచ్చతోరణం



మా తల్లి... అలిమేలుమంగ..!!

– డా॥ ఆకెళ్ల విభీషణ శర్మ, 98662 34482

పెద్దశేషవాహనం

శ్రీపద్మావతీమాతకు కార్తికబ్రహ్మోత్సవాలలో రెండవ వాహనం పెద్దశేషుడు. నిత్యముక్తులలో ఆద్యుడైన శేషుడు లక్ష్మీ సహితుడైన శ్రీవారికి దాసుడిగా, సఖుడిగా, శయ్యగా, సింహాసనంగా, ఛత్రంగా సమయోచితంగా సేవలందిస్తాడు. అభయ వరదహస్తయైన శ్రీవారిపట్టమహిషి అలమేలుమంగకు వాహనమై, తన విశేషజ్ఞానబలాలకు తోడైన దాస్యభక్తిని తెలియజేస్తున్నాడు.

తిరుమల శ్రీవారు శేషుణ్ణి మన్నించేవారు, తిరుచానూరు పద్మావతీదేవి శేషుడినే వాహనంగా ఆదరిస్తున్నారు.

వైరాగ్యాన్ని పరమలక్షణంగా కలిగిన శేషుని వృత్తాంతాన్ని పురాణాలూ, స్తోత్రవాఙ్మయం బహుముఖంగా కీర్తిస్తున్నాయి. శేషవాహనస్ఫూర్తి భాగవతులలో నిత్యం లక్ష్మీశ్రీనివాసుల దాస్యానురక్తిని పెంపొందిస్తుంది. తద్వారా జీవుడిదేహం ఇహసుఖానికన్నా, పరసుఖానికి అంకితమవ్వాలన్న జ్ఞానం లభిస్తుంది.

ఇహం అనేది ఒకటే. పరం అనేది ఒకటే. ఈ రెండింటికీ జీవుడే గురి. ఇహపరాలకు కర్తయైన లక్ష్మీనాథుని అనుగ్రహం శరణాగతులై దాస్యభక్తిని అవలంబించేవాళ్లకే సుసాధ్యమౌతుంది. అంతేకాక విషతుల్యమైన మానవుల సమస్తపాపాలను తొలగించి, పరమపదాన్ని ప్రసాదించే అలమేలుమంగ పెద్దశేషవాహనసేవ భక్తకోటికి సదా ఆశ్రయణీయమైంది.

హంసవాహనం

వార్షికబ్రహ్మోత్సవాలలో రెండోరోజు రాత్రివేళ హంస వాహనంపై శ్రీపద్మావతీదేవి వీణాపాణియై దర్శనమిస్తుంది. సరససద్గుణనికురంబ శారదాంబగా అలమేలుమంగమ్మ కనువిందు చేస్తుంది. చదువులతల్లివాహనం హంస. హంసకు పాలూ, నీళ్లూ వేరు చేసే వివేకం ఉంది. నీళ్లను వదిలి, పాలను గ్రహిస్తుంది. సకలవిద్యలూ పద్మావతిఅమ్మవారి అనుగ్రహం వల్ల చేకూరుతాయి.

అనునిత్యం వేణుగానవిలోలుడైన శ్రీవేంకటేశ్వరునివద్ద వీనులవిందుగా వీణ వాయించే అలమేలుమంగ, హంస వాహనంపై తిరుమాడవీథులలో విహరిస్తుంది. తాళ్లపాకకవుల సంకీర్తనలలో రవళించిన సకలవిద్యాసారం అలమేలుమంగమ్మ అనుగ్రహమే. యోగిమనోవిహారుడైన శ్రీ వేంకటేశ్వరునిపై భక్తినీ, శరణాగతినీ సమస్తభక్తబృందాలకు ప్రసాదిస్తున్న కరుణాంతరంగ అలమేలుమంగమ్మ.

“ఓ పరమైశ్వర్యస్వరూపిణీ! నీ కృపావిలసనానికి ఎవ్వడు పాత్రుడవుతున్నాడో, వాడు పండితుడౌతున్నాడు. వాడు ప్రభావ సమగ్రుడౌతున్నాడు. వాడు వివేకి అవుతున్నాడు. వాడు దాత అవుతున్నాడు. వాడు కులీను డవుతున్నాడు. వాడు కళావేత్త అవుతున్నాడు. వాడు ధన్యుడవుతున్నాడు. వాడు మనోజ్ఞాకారుడవుతున్నాడు.” అని శ్రీనాథమహాకవి అన్నమాటలు అక్షరసత్యాలు.

ముత్యాలపందిరివాహనం

పద్మావతీమాత మూడవనాటి ఉదయం ముత్యాల పందిరి వాహనాధిరూఢయై మంగాపురతిరుమాడవీథులలో విహరిస్తుంది. ముద్దులొలికించే ముత్యాలు అలమేలుమంగకు ప్రీతిపాత్రమైనవి. స్వాతికార్తెలో వానచినుకులు సాగరంలోని ముత్యపుచిప్పల్లో పడి, మేలిముత్యంగా రూపొందుతాయనీ, ఏనుగులకుంభస్థలాలలో ఉంటాయనీ, తామ్రపర్ణీనదీతీరంలో లభిస్తాయనీ కవిసమయం. ముత్యాలను ఆభరణాలుగా ధరించడం, తలంబ్రాలుగా పోసుకోవడం సదాచారం. అన్నమయ్య పులుకడిగిన ముత్యాలను, అమ్మవారినవ్వులకు, చూపులకు, మాటలకు, పులకలకు, సిగ్గులకు ప్రతీకలుగా స్వీకరించాడు.

అలమేలుమంగ చిరునగవులే ముత్యాలసేసలై, ముత్యాలమాలలై శ్రీ వేంకటేశ్వరుని నల్లనిదేహానికి మనోజ్ఞ శోభను చేకూరుస్తాయి.

లోపల ఆశలనే ముత్యాలగనులు గల దేవ దేవి, నోటి ముత్యాలు రాలకుండా కోపగించి, ముత్యాలగద్దెపై పడుకొన్నవేళ అన్నమయ్య.

సింహవాహనం

కార్తికబ్రహ్మోత్సవాలలో పద్మావతీమాత మూడవరోజు రాత్రి సింహవాహనంపై దర్శనమిస్తుంది. సింహం పరాక్రమానికీ, శీఘ్రగమనానికీ, వాహనశక్తికీ ప్రతీక. అమ్మవారికి సింహం వాహనంగా సమకూరినవేళ దుష్టశిక్షణ, శిష్టరక్షణ అవలీలగా చేస్తుంది. భగవతి పద్మావతి ఐశ్వర్యం, వీర్యం, యశస్సు, శ్రీ (ప్రభ), జ్ఞానం, వైరాగ్యం అనే ఆరుగుణాలనూ భక్తులకు

ప్రసాదిస్తుంది. శ్రీ వేంకటేశ్వర హృదయేశ్వరిని స్వామితో మమేక మైన శక్తిగా ధ్యానించడం సంప్రదాయం.

అనపాయినిగా, శ్రీవారివక్షోవిహారిణిగా కీర్తించబడు తున్న అలమేలుమంగ తరగని సిరిసంపదలనిచ్చే మహాశక్తి స్వరూపిణి. ఈ జగత్తులో పరాక్రమయుక్తమై, కాంతియుక్తమై స్ఫుటంగా గోచరించే వైభవాన్ని శ్రీనివాసుని విభూతిగా తెలియ జేస్తున్నారు. ఆ విభూతులన్నింటి సమైక్యరూపమే సింహ వాహనంపై తిరుచానూరు తిరుమాడవీథులలో ఊరేగుతున్న అలమేలుమంగ.

సర్వసంపదలకు ఆధిదేవత. సింహవాహనంపై ప్రసన్నంగా దర్శనమిచ్చే పద్మావతీదేవి ప్రపన్నజనులను పరి రక్షించే ధైర్యలక్ష్మి.

కల్పవృక్ష వాహనం

కల్పవృక్షం పద్మావతీదేవికి బ్రహ్మోత్సవాలలో నాల్గవ రోజు ఉదయం వాహనమవుతుంది. పాలకడలిని అమృతానికై మథించినవేళ లక్ష్మీదేవికి తోబుట్టువైంది కల్పవృక్షం. ఆకలి దప్పుల్ని తొలగించి, పూర్వజన్మస్మరణను ప్రసాదించే ఈ ఉదార దేవతావృక్షం. అన్నికోరికలనూ తీరుస్తుంది. ఖడ్గాన్నీ, యోగ దండాన్నీ ధరించే గోపకిశోరుడిలా గోసంపదను పరిరక్షించే మంగళదేవత అలమేలుమంగ. మంగమ్మపాదాలు కల్పతరువు చిగురును తలపిస్తున్నాయని అన్నమయ్య

తరుణి పాదాలు కల్పతరువుచిగురుఁ బోవె,
పరగఁగఁ దన వెనుబల మంటాను...

– అని కీర్తించాడు.

శ్రీపద్మావతీదేవి పాదపద్మాలను కల్పతరువుగా భక్త కోటి భావించి కృతార్థులౌతున్నారు. ఈ జగత్తులో లక్షణశక్తిగా ఉండే దేవి లక్ష్మి. 'లక్ష్యాలక్ష్యరూపిణీ లక్ష్మీ'... ఈ జగత్తులో కార్యరూపంలోను, కారణరూపంలోను ఉండేశక్తి లక్ష్మిపద్మా వతియై కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరుణ్ణి శ్రీవైకుంఠంనుండి ఇలకు తెచ్చింది. అలమేలుమంగ అనుగ్రహంవల్ల ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం కలుగుతాయి. సర్వరసస్వరూపిణి ఆ తల్లి.

హనుమద్వాహనం

కార్తికబ్రహ్మోత్సవాలలో నాలుగవరోజురాత్రి అలమేలు మంగ హనుమద్వాహనంపై దర్శనమిస్తుంది. అతులమతిమంతు డైన హనుమంతుడు శ్రీరామచంద్రునికి అనన్యభక్తుడు. త్రేతా యుగంలో ఆదిలక్ష్మి సీతగా అవతరించి, శ్రీరాముడిగా అవ తరించిన స్వామిని వివాహమాడి రావణునిచే చెరబట్టపడింది.

సీతాన్వేషణలో, మారుతి సాగరాన్నిదాటి లంకకు చేరి, సీతమ్మను అశోకవనంలో దర్శించాడు. శ్రీరాముని విరహంతో కృశించి, అశ్రుధారల్తో సంభాషిస్తున్న లోకమాత శోకాన్ని చూచి, హనుమంతుడు ఖిన్నుడయ్యాడు. ఆమెను అనునయిస్తూ రాఘవుడు భల్లూక వానరసైన్యంతో లంకను ముట్టడిస్తాడనీ, శీఘ్రంగా నిన్ను రక్షిస్తాడనీ హితవు పలికాడు, లేకపోతే నావీపుపై చేర్చుకొని రామునివద్దకు తీసుకువెళ్లగలనని భక్తితో పలికాడు.

ఆ సీతామాత (వేదవతి) కలియుగంలో పద్మావతిగా అవతరించింది. అర్చామూర్తిగా తిరుచానూరులో పూజలందు కొంటూంది. తనజాడను శ్రీవారికితెలిపిన మహాభక్తుడైన అంజనేయునికోరికను తీర్చడానికా అన్నట్లు అలమేలుమంగ బ్రహ్మోత్సవాలలో హనుమంతుణ్ణి వాహనంగా సంభావించింది.


ఈ హనుమంతునిపైనున్న మంగమ్మదర్శనం భక్తులకు బలాన్ని, కీర్తిని, ధైర్యాన్ని, ఆరోగ్యాన్ని విశేషంగా ప్రసాదిస్తుంది.

పల్లకీ వాహనం

అలమేలుమంగమ్మ కార్తికబ్రహ్మోత్సవాలలో పల్లకి వాహనంలో ఐదవరోజు ఉదయం దర్శనమిస్తుంది. అమ్మవారు జగన్మోహిని, విశ్వరూపిణి, దేవదేవి. విరాడ్రూపానికి సూర్య చంద్రులు జడబిళ్లలుగా అమరుతున్నాయని చిలుకగానం చేస్తుంది. వెన్నెల బొమ్మ అలమేలుమంగమ్మ కూర్చున్న పల్లకిని ముద్దుగుమ్మలు మోసినట్లు అన్నమయ్య కీర్తించాడు.

కులుకక నడవరో కొమ్మలాలా
జలజల రాలీని జాజులు మాయమ్మకు...

చెలికత్తెలు వయసువేడితో ఉన్నారు. విసవిసానడుస్తు న్నారు. పల్లకిలో కూర్చున్న ముద్దుగుమ్మ మంగమ్మకు కురులు చెదిరాయి. విరులు జలజలరాలుతున్నాయి. అన్నమయ్య కల వరం చెందాడు. కులకకుండా నడవమని చెలికత్తెల్ని కోరు తున్నాడు. మంగమ్మకు నుదురు చెమరుస్తున్నది. అదురుతున్న పల్లకిలో మేను కదుల్తూంది. ముత్యాల కుచ్చులు అదుర్తున్నా యని తెలియజేశాడు.



షోడశ లక్ష్మీనివాసస్థానాలు

విశ్వమంతా లక్ష్మీమయమే!
కానీ కొన్నివిశిష్టవస్తువులలో, ప్రదేశాలలో ఆ తల్లి ఇష్టపడి నివసిస్తుంది. వాటిల్ని లక్ష్మీ నివాసస్థానా లంటారు. అవి పదహారుగా పెద్దలు పేర్కొన్నారు.

1) సత్యం పలికేవాళ్లలో 2) భగవద్భక్తులలో 3) శుచి, శుభ్రత, శోభ కల్గినఇండ్లలో 4) మహావీరులలో 5) జయ పతాకాలలో 6) ఏనుగులలో 7) గోవులలో 8) ఛత్రచామ రాది చక్రవర్తి లక్షణాలలో 9) తామరపూలలో 10) పంట భూములలో 11) పూలతోటలలో 12) స్వయంవరాలలో 13) రత్నాలలో 14) దీపాలలో 15) అద్దాలలో 16) మంగళద్రవ్యాలలో. ఇవి ప్రశస్తంగా లక్ష్మీనివాసస్థానాలు.

ఇవికాక అనంతవిశ్వంలో ఎక్కడెక్కడ పవిత్రత, ధర్మం, శాంతం, మంచితనం, దానగుణం, దయాగుణం, సచ్ఛీలం, మంచిమాటలు, బంగారు, వెండి, ధాన్యం, మంచి విద్య, జ్ఞానం, ఆరోగ్యం, ధనం, జయం- మొదలైనవి ఉండే మంచితావులన్నీ అమ్మవారినివాసస్థానాలే! ఎందెందు పరి శీలించి గమనిస్తే-అందందే మహాలక్ష్మి తాండవిస్తూంటుంది.

అందుకే అమ్మవారి అష్టోత్తరశతనామావళిమొదట రెండునామాలు- 'ప్రకృతి, వికృతి' అని ఉన్నాయి. సృష్టికి మూలపదార్థమూ ఆమే! మార్పు చెంది, నానావిధాలుగా గోచరిస్తున్నవిశ్వమూ ఆమే!

కనుక విశ్వమంతా లక్ష్మీమయమే!

- డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య

గజవాహనం

కార్తికబ్రహ్మోత్సవాలలో ఐదవరోజురాత్రి పద్మావతీదేవి స్వర్ణగజవాహనంపై విహరిస్తుంది. గజపటాన్ని ఆరోహణం చేయడంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమౌతున్నాయి. అలమేలుమంగ వాహనసేవలలో గజవాహనసేవ ఘనమైంది. అసంఖ్యాకభక్తులు ఈ వాహనసేవలో సేవించి తరిస్తారు. 'హస్తి నాద ప్రబోధినీం' అని శ్రీసూక్తం గజానికీ, అమ్మకూ ఉండే నిత్యానుబంధాన్ని చెబుతూంది. గజజాతికి కూటస్థమైంది – నాలుగుదంతాలు కల ఐరావతం. ఇది పాలకడలిలో అమృత మథనం జరిగినవేళ లక్ష్మీదేవితో జన్మించింది. గజం ఐశ్వర్య సూచకం. అందుకే "ఆగజాంతం ఐశ్వర్యం" అని ఆర్యోక్తి. పాల సంద్రంలో ప్రభవించిన సిరులతల్లికి గజరాజులు భక్తితో అభి షేకించాయని శ్రీస్తుతి చేశారు – వేదాంతదేశికులు...

దిక్కుల భారాన్ని ఎనిమిదిదిగ్గజాలు వహిస్తున్నాయి. కనుక గజమే శ్రీనివాసునికీ, పద్మావతి అమ్మవారికీ తొలిసారిగా పరిచయానికి మూలమైంది.

"దిగ్గజాలు తొండాల అంచులతో బంగారుకలశాన్ని ధరించి, ఆకాశగంగానదియందలి స్వచ్ఛమైనజలంతో ఆ లోక మాతను అభిషేకిస్తున్నాయి. జగత్తులకు జనని, సర్వలోకాలకూ ప్రభువైన విష్ణువుయొక్క గృహిణి, అమృతసముద్రపుత్రి అయిన శ్రీదేవిని ప్రాతఃకాలంలో నమస్కరిస్తున్నాను." అని కనకధారా స్తవంలో దిగ్గజాలచే అభిషేకా న్నందుకున్న లోకమాత వైభవాన్ని శంకరులు కమనీయంగా కీర్తించారు.

"నీవే తప్ప ఇతః పరం బెరుగ" నని శరణాగతిని పొంది, మొసలి బారినుండి సాక్షాత్తు శ్రీవారిచేత రక్షింపబడిన గజేంద్రుడు ఆశ్రయించిన శరణాగతిమార్గాన్ని ప్రతిజీవుడూ ఆశ్రయించాలన్న సందేశాన్ని ఇచ్చే వాహనసేవ గజవాహన సేవ.

సర్వభూపాలవాహనం

కార్తికబ్రహ్మోత్సవాలలో పద్మావతీమాత ఆరవరోజు ఉదయం సర్వభూపాలవాహనంపై విహరిస్తుంది. సకలలోకే శ్వరుడు శ్రీ వేంకటేశ్వరుడు. శ్రీవారిహృదయపీఠంపై నిలిచి లోకాన్ని కటాక్షిస్తున్న కరుణాంతరంగ అలమేలుమంగ. ఆదిత్య పురాణం రెండో అధ్యాయంలో దిక్పాలసంసేవితుడైన స్వామి, రమాసహితుడై లోకాలను పాలిస్తున్న కరుణామూర్తిగా కీర్తించ బడ్డారు.

సర్వభూపాలురు వాహనస్థానీయులై అమ్మవారిని సేవించి తరిస్తున్నారు. ఇందులో దిక్పాలకులుకూడా ఉన్నారు. ఈ వాహనసేవరోజున మానవుడు భగవదనుగ్రహానికి అధికారాన్ని సంపాదించాలి. ఇదికూడా దేవతానుగ్రహంవల్లే ఏర్పడుతుంది. అందుకే శంకరులు

"లోకంలో ఇష్టులూ, శ్రేష్ఠమైనబుద్ధి గలవాళ్లూ అయిన నరులు ఏ చూపు ఒకింత పడితేచాలు స్వర్గపదవిని సులభంగా పొందుతారో అట్టి కమలాలయచూపు – బాగుగా వికసించిన పద్మంలోని కాంతివంటికాంతి కలది – నాకు కోరినపుష్టిని కూర్చు గాక!" అన్నారు.

సర్వభూపాలవాహనంపైన ఆ దేవదేవిని దర్శించి, సేవిస్తే సకలరాజ్యభోగాలూ సిద్ధిస్తాయి.

గరుడవాహనం

బ్రహ్మోత్సవాలలో పద్మావతీదేవి ఆరవనాటిరాత్రి గరుడవాహనంపై ఊరేగుతుంది. గరుడుడు నిత్యసూరులలో అగ్రేసరుడు. 'వేదాత్మా విహగేశ్వరః' అని శ్రుతి ప్రబోధిస్తూంది. గరుడుని రెండురెక్కలు జ్ఞానవైరాగ్యాలకు చిహ్నాలుగా సంప్రదాయజ్ఞులు సన్నుతిస్తున్నారు. శ్రీవారికీ, అమ్మవారికీ నిత్యవాహనం గరుడాళ్వార్లు. గరుడసేవను 'పెరియతిరువడి'గా భావిస్తున్నారు. భక్తికి సాకారమైన గరుడుడు దేవేంద్రునివజ్రఘూతానికి ఈకవేసిన బలశాలి. 108 దివ్యదేశాలలో గరుడ సేవకు ప్రత్యేకమైన ఆదరణ ఉంది.

శ్రీవారినీ, అమ్మవారినీ నిత్యం సేవించే గరుడాళ్వార్లు దాసుడిగా, ఆసనంగా, వాహనంగా, ఇంకా అనేకవిధాలుగా సేవిస్తున్నాడని భాగవతోత్తములభావన.

సూర్యప్రభవాహనం

పద్మావతీ అమ్మవారికార్తికబ్రహ్మోత్సవాలలో ఏడవనాడు సూర్యప్రభవాహనంపై విహరిస్తుంది. ప్రకృతికి చైతన్యప్రదాత, లోకానికి ఆరోగ్యాన్ని ప్రసాదించే సహస్రకిరణుడు సూర్యనారాయణుడు.

సూర్యప్రభపై ఊరేగుతున్న అలమేలుమంగ 'యేషోఽన్తరాదిత్యే' అనేశ్రుతివాక్యాన్ని వివరిస్తూంది. పరమాత్మ సూర్యమండలంలో ఉండే అలవాటు కలవాడు. కనుక శ్రీవారి ఎదలో కొలువుండే అమ్మవారికి, 'సూర్యప్రభ' బ్రహ్మోత్సవాలలో వాహనమవడం సముచితంగా ఉంది. అంతేకాక సూర్యునికి, అమ్మవారిపట్ల ఉన్న భక్తిని సాక్షాత్తు శ్రీనివాసుడే వేంకటాచల మాహాత్మ్యంలో ప్రశంసించాడు. సూర్యనారాయణుని సాక్షిగా తిరుచానూరులో శ్రీవారు తపమాచరించి, కృతార్థులయ్యారు. తిరుచానూరులో నేటికీ నిత్యపూజలతో భాసిల్లుతున్న సూర్యదేవాలయం ఇందుకు సాక్షీభూతంగా నిలిచి ఉంది.

సూర్యప్రభ వాహనసేవలో అమ్మవారి దర్శనం ఆరోగ్యం, ఐశ్వర్యం, సత్సంతానం, సుజ్ఞానం మొదలైన ఫలాలను పరిపూర్ణంగా ప్రసాదిస్తుంది. అనంతకోటికిరణాలతో సకల జీవరాశిని రక్షించే సూర్యునిలాగా, అమ్మవారు అనంతవరప్రదాత్రియై, సర్వలోకశరణ్యయై సూర్యప్రభవాహనంపై శోభిల్లుతూంది.

చంద్రప్రభవాహనం

మొగము చందురుఁ బోలె ముంచిన యీ యిందిరకు
తగిన తోఁడబుట్టుగా నాతడే కనుక...

చంద్రముఖియైన మంగమ్మకు తగినతోబుట్టువైనవాడు చంద్రుడు. చంద్రుడు ఓషధీశుడు. జీవకోటికిపోషకుడవుతున్నాడు. అందువల్ల భక్తబృందాల కన్నులనేకలువలు చంద్రప్రభవాహనంపై పద్మావతిని చూడగానే వికసిస్తున్నాయి. భక్తిసాగరం ఉప్పొంగి, జీవుల మనస్సులనే చంద్రకాంతమణులు శరణాగతిభావాలను స్రవిస్తున్నాయి. చంద్రప్రభవాహనసేవవల్ల ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికమనే తాపత్రయాలు తొలగి, జీవనం సుఖవంతమౌతుంది.

మనశ్శాంతికీ, మానసికానందానికీ చంద్రుడే కారణం. ఈ చల్లని తెల్లనిచంద్రప్రభవాహనంపై ఊరేగే చంద్రసోదరిని దర్శించడంవల్ల మనస్సు ప్రశాంతంగా, హాయిగా ఉంటుంది.

రథోత్సవం

శ్రీపద్మావతీమాత బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవరోజు ఉదయం రథోత్సవంలో అత్యంతప్రసన్నంగా దర్శనమిస్తుంది. వాహనసేవలో

బ్రహ్మోత్సవ వాహనాల ఛాయాచిత్రాలను ఈ సంచిక 2 మరియు 55వ పుటల్లో ఇవ్వడం జరిగింది. పాఠకులు గమనించగలరు.

తలమానికమయింది రథోత్సవం. అందులోనూ రథోత్సవం ఎందరో భక్తులు సేవించి, తరించేందుకు అవకాశమిస్తుంది. రథసేవలో పాలుపంచుకొనే ఆబాలగోపాలం గోవిందనామ సంకీర్తనంతో, భజనలతో సేవాభాగాన్ని వ్యక్తీకరిస్తారు.

రథంపై ఊరేగుతున్న పాలకడలిగారాలపట్టికి నమస్కరించడమే భాగ్యమని భక్తులు భావిస్తారు.


రథోత్సవానికి విశిష్టమైన ఆధ్యాత్మిక అర్థం కఠోపనిషత్తు – "ఆత్మ రథికుడనీ, శరీరం రథమనీ, బుద్ధిసారథిగా, మనస్సు పగ్గమై, ఇంద్రియాలు గుర్రాలుగా, విషయాలనే వీథులలో సాగుతాయని" చెబుతూంది.

శరీరాన్ని రథంతో పోల్చడంవల్ల స్థూల, సూక్ష్మ శరీరాల భేదం ప్రబోధించబడుతూంది. అలమేలుమంగరథంపై బ్రహ్మోత్సవాలలో ఊరేగుతున్నవేళ భక్తబృందాలు ఉత్సాహంతో అడుగడుగునా తిరునీరాజనాలను అందిస్తారు. పదకవితాపితామహుడు అమరాంగనలచే మంగళహారతులను అందుకొనే అలమేలుమంగను మనోహరంగా గానం చేశాడు.

మంగళ మమ్మకున్ సకలమంగళ మంబుజనేత్రకున్, జయ
మంగళ మిందిరాసతికి, మంగళ మీ యలమేలుమంగకున్..

అశ్వవాహనం

కార్తికబ్రహ్మోత్సవాలలో పద్మావతీదేవి ఎనిమిదవరోజు రాత్రి అశ్వవాహనంపై ఊరేగుతుంది. అశ్వం వేగంగా పరిగెత్తే అందమైన జంతువు. అందుకే ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలుగా అభివర్ణిస్తున్నాయి. అలమేలుమంగ అన్ని కోరికలను తీర్చడంలో ఒకే ఒక ఉపాయంగా, సౌభాగ్యంగా ఆర్షవాఙ్మయం తెలియజేస్తూంది. దారిద్ర్యదుఃఖాన్ని పోగొట్టే అలమేలుమంగ ఆశ్రితుల హృదయంలోని శోకాన్ని తొలగించే లోకమాత. లోకనాథుడైన శ్రీనివాసునికి నిత్యానపాయిని అలమేలుమంగ.



పద్మావతీ శ్రీనివాసుల తొలిచూపువేళ, ప్రణయవేళ, పరిణయ వేళ సాక్షిగా అశ్వం నిలిచింది. పరమాత్ముడైన హరి పట్టపురాణి అలమేలుమంగ అశ్వవాహనసేవాభాగ్యాన్ని పొందుతున్న భక్తులకు కలిదోషాలు తొలగిస్తుంది.

పంచమితీర్థమహోత్సవం

ఈ క్షేత్రంలో ప్రతిసంవత్సరం వృశ్చికమాసం పంచమి రోజున అవబృథాన్ని సంకల్పించి, ఆ రోజుకు ముందు తొమ్మిదవరోజున ధ్వజారోహణం చేయడం జరుగుతుంది. చిన్నశేష వాహనం మొదలుగా అనేకవాహనాలపై అమ్మవారు బ్రహ్మోత్సవంలో తిరువీథులలో ఊరేగుతూ, వివిధ సన్మంగళ ఫలాలను భక్తులకు ప్రసాదిస్తుంది.

ఈ పర్వదినంనాడు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. తన పత్నికి తిరుమలనుండి శ్రీవారు తులసి, కుంకుమ, పసుపు, పీతాంబరం, పణ్యారం వంటివి ఏనుగులపై ఊరేగింపుగా తిరుచానూరుకు ఆలయమర్యాదలతో అందజేస్తారు. సుదర్శన స్వామితో అవభృథస్నానానికి బ్రహ్మోత్సవ ఆయాసపరిహారార్థం ఉత్సవమూర్తిగా అమ్మవారు పద్మసరోవరతీరానికి చేరుకుంటారు.

కార్తికపంచమినాడు శ్రీనివాసునికి అమ్మవారి ఆలయ సరోవరంలో చక్రస్నానం జరిగేవరకూ పూజలు నిర్వహించరు. దధి, మధు, క్షీరహరిద్రాజల, నారికేళజలాదులతో జరిగే స్నపనాన్నీ, పసుపు కుంకుమలనూ కలకాలం పొందదానికి పంచమి తీర్థానికి వచ్చిన నారీమణులూ, తరగనిసిరిసంపదలూ, ఆముష్మికప్రాప్తినీ పొందడానికి వచ్చిన భాగవతులూ కనులారా వీక్షించి తరిస్తారు.

చక్రస్నానం అయి అమ్మవారి ఉత్సవమూర్తులు ఆలయం చేరే లోపల వేలాదిభక్తులు పద్మసరోవరస్నానంతో ధన్యులవుతున్నారు. పద్మసరోవరంలో పంచమితీర్థవేళ స్నానమాచరించేభాగ్యం కోటి జన్మలపుణ్యఫలం.

పరమభాగవతోత్తములైన
శ్రీ అనంతాళ్వారు గురించి ఈ సంచికలో చదువవచ్చు.

అనంతాళ్వారు

ఒకప్పుడు వేంకటాచలంలో విషజీవులు కన్పిస్తుండంతో ఎవరూ ఉండేవారుకాదు. వేంకటేశ్వరుడు పుష్పాలంకార ప్రియుడు. రామానుజాచార్యులు తన శిష్యులను, ఎవరైనా వేంకటాచలంలో నివాసముండి, పుష్పవాటిక పెంచి, పూల మాలలు కట్టి, స్వామివారికి కైంకర్యం చేస్తారా? అని అడిగారు. వృద్ధుడైన అనంతాళ్వారులు లేచి, నేను వెడతానని అంటే వెళ్ళ మని అన్నారు. ఆయన పుష్పవాటికను ఏర్పాటు చెయ్యడానికి చెరువు తవ్వుతున్నారు. భార్య గర్భిణి. ఈయన మట్టి తవ్వి గంపలో పోస్తే ఆమె పట్టుకుని వెళ్ళలేక చెమటలు పోసి, అలసి పోయి నిలబడిపోతుండేది. ఈయన మళ్ళీ పిలుస్తుండేవాడు. ఇది చూచి, వేంకటేశ్వరస్వామికి బాధ కలిగి చిన్నపిల్లవాడి రూపంలో వచ్చి, అయ్యా! మీరు తవ్వి పోసిన బుట్ట నేను పట్టు కుని వెళతానని అన్నాడు. ఇద్దరం కైంకర్యమూ చేసుకుందామని వస్తే మధ్యలో నీవెవరు? పోతావా? పోవా? అన్నారు. కొడతా రేమో అని ఆ పిల్లవాడు వెళ్ళిపోయాడు.

అనంతాళ్వారుభార్య అతికష్టంమీద బుట్ట పట్టుకుని వెడు తున్నది. స్వామికి మనసాగక బయలుదేరి వచ్చి, అనంతా ళ్వారు వెనుక ఉండి ఆయన మట్టి బుట్టలో పొయ్యగానే పరుగుతో వెళ్ళి, మట్టి పోసేసి మళ్ళీ ఖాళీ బుట్ట అక్కడ పెట్టేవాడు. ఆళ్వారులు ఏమిటి? ఎంత ఓపికతో మా ఆవిడ ఎలా చేస్తున్న దని గునపం అక్కడ పెట్టి, వెనుకకు తిరిగి చూచారు. పిల్లవాడు కనపడ్డాడు. "నిన్ను పొమ్మన్నాను కదా! మళ్ళీ వచ్చావా?" అని గునపం పట్టుకుని ఒక్కదెబ్బ కొట్టబోయారు.





తిరుమల విశిష్టత

– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ

పిల్లవాడు పరిగెత్తాడు. వెనకనే గునపంతో ఈయనా పరుగుపెట్టారు. ఇప్పటి బ్రహ్మోత్సవాలలో స్వామి ఊరేగింపు జరిగే మాడవీథులలో ముందు వేంకటేశ్వరస్వామి, వెనుక అనంతాళ్వారుస్వామి పరిగెత్తారు. ప్రదక్షిణంగాను, అప్రదక్షిణం గాను, ఉత్తరంనుండి దక్షిణానికి, దక్షిణంనుండి ఉత్తరానికి పరిగెత్తారు. స్వామి ఆనందనిలయంలోకి పారిపోయారు ఆ పారి పోతున్నపుడు కోపం ఆపుకోలేక పిల్లవాడిమీదకి గునపం విసి రేసారు. అది వెళ్ళి, ఆ పిల్లవాడిగడ్డానికి తగిలింది.

సాయంకాలం పుష్పమాలలు కట్టుకుని అనంతాళ్వారులు ఆనందనిలయంలోకి వెళ్ళేసరికి గడ్డం వాచి, రక్తం పెచ్చుకట్టి వేంకటేశ్వరస్వామి కనపడ్డాడు. అర్చకులు హడలిపోయారు. ఇంత రక్తం కారిందేమిటి? అని. అప్పుడు వేంకటేశ్వరస్వామి మాట్లాడే వారు. "నా భక్తుడు గునపంతో కొట్టాడు. రాబోయే తరాలలో నా భక్తులు వచ్చి, నా గడ్డంమీద పచ్చబొట్టు చూచి, అనంతా ళ్వారు అనే భక్తుడు గునపంతో కొట్టిన దెబ్బ అని చెప్పు కుంటుంటే నేను విని మురిసిపోతాను. అందువల్ల నాకు ఇక్కడ



అనంతాళ్వారులు పుష్పవనం పెంచితే–శ్రీమహావిష్ణువైన వేంకటేశ్వరస్వామివారు రాత్రివేళ అమ్మవారితో విహరించడానికి వెళ్ళారు. కనపడ్డ పువ్వుల్లా కోసి, అమ్మవారితలలో పెడుతుండే వారు. ఇద్దరూ సంతోషంగా తిరుగుతుండేవారు. తెల్లవారి అనంతాళ్వారు వచ్చేటప్పటికి తోటలో ఒక్క పువ్వు కనపడేది కాదు. ఎవరో రాత్రివేళ పువ్వులు కోసుకుని పోతున్నారని శిష్యులను కాపలా పెట్టాడు. దొరికేవారు కాదు. తానే కాపలా ఉండాలనుకుని కూర్చున్నారు. ఓ రాత్రివేళ లక్ష్మీదేవితో కలసి వచ్చారు–వేంకటేశ్వరస్వామి. పువ్వులన్నీ పుణికేస్తున్నారు. దొంగ దొరికాడు. ఎంతో అందంగా ఉన్నాడు కానీ ఇదేం బుద్ధి ఈయనకు? రాచకన్యలా ఉంది–భార్య! ఆ పిల్లను పట్టుకుని వచ్చి పువ్వులన్నీ పుణికేస్తున్నాడని, ఒక్క పరుగున వేంకటేశ్వర స్వామిని పట్టుకోబోయాడు. ఆయన దొరకుతాడా?

చిక్కడు సిరి కౌగిటిలో
చిక్కడు సనకాది యోగిచిత్తాబ్జములన్
చిక్కడు శ్రుతిలతికావలి
చిక్కె నతడు లీలఁ దల్లిచేతన్ ఱోలన్.

లక్ష్మీదేవికౌగిటిలో దొరకడు. సనకాదిమహర్షులకు దొరకడు. భక్తులకు దొరకడు. వేదాలకు చిక్కడు. ఉపనిషత్తులకు చిక్కడు. అనంతాళ్వారు పరిగెడితే దొరుకుతాడా? పారిపోయాడు. జగజ్జనని అదేమిటి అలా పారిపోతున్నాడాయన? అని ఆశ్చర్యపోతూంది. గభాలున వచ్చి, ఆయన అమ్మవారిని పట్టుకుని, అక్కడ ఒక చందనపు చెట్టు ఉంటే దానికి తన మీద ఉన్నఉత్తరీయం వేసి కట్టి, మీఆయన ఎవరు? ఎక్కడ ఉంటాడు? అని అడిగాడు. ఏం చెపుతుంది?

పృథివ్యాం రాజసింహానాం ముఖ్యస్య విదితాత్మనః
స్నుషా దశరథస్యాహం శత్రుసైన్యప్రతాసినః॥
దుహితా జనకస్యాహం వైదేహస్య మహాత్మనః
సీతా చ నామ నామ్నాహం భార్యా రామస్య ధీమతః

(సుందర-33వ సర్గలో)

"నేను దశరథుని కోడల్ని, జనకుని కూతుర్ని, శ్రీరాముని భార్యను, నా పేరు సీత"– అని అమ్మవారు సుందరకాండలో చెప్పింది. స్వామి వామనమూర్తిగా వచ్చినపుడు అంటాడు.

ఇది నాకు నెలవని యేరీతిఁ బలుకుదు? నొకచోటనక యెందు నుండ నేర్తు,
నెవ్వని వాడ నం చేమని పలుకుదు? నాయంత వాడనై నడవ నేర్తు,
నీ నడవడి యని యెట్లు వక్కాణింతు బూని ముప్పోకల బోవ నేర్తు,
నది నేర్తు నిది నేర్తు నని యేల చెప్పంగ? నేరుపు లన్నియు నేన నేర్తు,

ఒక పచ్చకర్పూరపు బొట్టు పెట్టండి" అన్నాడు. శంఖనిధి, పద్మనిధి దాటి, లోపలకి వెడుతుంటే ఉత్తరపుగోడమీద పెట్టి ఉంటుంది– ఆ గునపం.

ఆ దెబ్బకు గుర్తుగా ప్రతి సం॥ బ్రహ్మోత్సవాలలో ధ్వజావరోహణం జరిగిన మరునాడు, వేంకటేశ్వరస్వామికి బాగ్ సవారి ఉత్సవమని ఉత్సవం జరుగుతుంది. ఆ రోజు అనంతాళ్వారులు తరుముకుని వస్తుంటే ఎలా పరుగుపెట్టారో స్వామిపల్లకి ఆ రోజున అలా పరుగుపెడుతుంది. పల్లకి ప్రదక్షిణంగా తిరగాలి. కాని ఆ ఉత్సవంలో అలా తిరగదు. ఇప్పటికీ అనంతాళ్వారుల సమాధి ఉంది. ఆ సమాధిలో నుండి ఒక పొగడమాను పుట్టింది. ఇప్పుడు పెద్ద మర్రిచెట్టు పుట్టింది. అక్కడ హారతి ఇస్తారు.

అటూ ఇటూ పరుగు పెట్టి, అర్చకుడు ఆ కోనేట్లో స్నానానికి వెళతాడు. పల్లకిమాత్రం అప్రదక్షిణంగా పరుగెత్తుకుంటూ వచ్చి, ఆనందనిలయంలోకి వెళ్ళిపోతుంది. భక్తుల కోసం ఎంతో లొంగి ఉంటాడు. గునపం పట్టుకుని ఆయన తరుముతుంటే పరమాత్మ పరుగెత్తే ఉత్సవం ఎక్కడన్నా చూశామా? ఏడుకొండలలో చేస్తారు.

కోపము విడిచితేనే పాపము దానే పోవు

నొరులు గారు నాకు నొరులకు నేనొదు
నొంటివాడ జుట్ట మొకడు లేడు
సిరియుఁ దొల్లిగలదు చెప్పెద నా టెంకి,
సుజనులందుఁ దఱచు సొచ్చియుందు.

ఆయన ఎప్పుడూ భక్తపరాధీనుష్ట. అంతటా ఉండేవాణ్ణి ఎక్కడుంటాడని చెప్పగలను? ఎంతమంది ఎన్ని సహస్రనామాలు పెట్టి పిలిచినా పలికేవాడు ఆయనే అంటుంది. చాలా గడుసుగా మాట్లాడుతున్నావమ్మా అంటాడాయన. ప్రహ్లాదుడు చెప్పాడు గదా!

ఇందు కల దందు లేడని
సందేహము వలదు చక్రి, సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
అందందే కలడు దానవాగ్రణి! వింటే

నీవు జాగ్రత్తగా చూస్తే ఆయన అంతటా ఉంటాడు – అన్నది. నీకోసం రాకుండా ఉంటాడా? ఎలా రాకుండా ఉంటాడో చూస్తానని అమ్మవారిపాదాలవద్ద పడుకొన్నాడు.

అనంతాళ్వారు ఎంత అదృష్టవంతుడో!

ఏ తల్లిపాదాలకు నమస్కరించి,

ఈశానాం జగతోஉస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షఃస్థల నిత్యవాసరసికాం తత్ క్షాంతిసంవర్ధినీమ్
పద్మాలంకృతపాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాదిగుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్ ॥

ఏ తల్లి కంటికొనచూపుకోసం అనుక్షణం పరితపిస్తుంటారో,

క్షమస్వ భగవత్యంబ! క్షమాశీలే పరాత్పరే !
శుద్ధతత్త్వస్వరూపే చ కోపాదిపరివర్జితే !!

ఉపమే సత్త్వసాధ్వీనాం దేవీనాం దేవపూజితే !
త్వయావినా జగత్సర్వం, మృత్యుతుల్యం చ నిష్ఫలమ్ !

సర్వసంపత్ స్వరూపే త్వం సంతుష్టా సర్వరూపిణీ !
రామేశ్వ ర్యధిదేవీ త్వం, తత్కలాః సర్వయోషితః !!

కైలాసే పార్వతీ త్వం చ క్షీరోదే సింధుకన్యకా !
స్వర్గే చ స్వర్గలక్ష్మీ స్త్వం మర్త్యలక్ష్మీ శ్చ భూతలే !!

వైకుంఠే చ మహాలక్ష్మీః దేవదేవి సరస్వతి!
గంగా చ తులసీ త్వం చ సావిత్రీ బ్రహ్మలోకగా!
కృపాప్రాణాధికాదేవీ గోలోకే రాధికా స్వయమ్।
రాసే రాసేశ్వరీ త్వం చ బృందా బృందావనే వనే !!

కృష్ణప్రియా త్వం భాండీరే, చంద్రా చందనకాననే !
విరజా చంపకవనే శతశృంగే చ సుందరీ !
పద్మావతీ పద్మవనే మాలతీ మాలతీవనే !
కుందదంతా కుందవనే సుశీలా కేతకీవనే !!

కదంబమాలా త్వం దేవి! కదంబకాననేஉపిచ !
రాజ్యలక్ష్మీః రాజగేహే గృహలక్ష్మీ ర్గృహే గృహే !!

ఇది ప్రతిరోజూ చెప్పుకోవలసినస్తోత్రం. చక్కనిభార్యని లభించడంకోసం అవివాహితులైన యువకులు, భార్య అను కూలవతిగా ఉండడానికి భర్తా, సంతానం కోరేవారు, పరమై శ్వర్యం పొందాలనుకునేవారు, నష్టధనాన్ని పొందగోరేవారు, కీర్తిని పొందాలనుకునేవారు, ఇంకా సకలశుభాలు పొందాలను కునేవారు నిత్యం పఠించవలసింది.

అటువంటి అమ్మవారిపాదాలవద్ద పడుకున్నాడు. తెల్లవారి ద్వారాలు తెరిచారు. స్వామివక్షఃస్థలంలో బంగారు లక్ష్మి లేదు. అర్చకులు హడిలిపోతే స్వామి చెప్పారు– "అనంతాళ్వారు రాత్రంతా లక్ష్మిదేవిని కట్టేశాడు. ఆయన్ను వేడుకుని అడిగి తీసుకుని రండి" అని చెప్పాడు. అర్చకులు వేదమంత్రాలతోటి, మంగళవాద్యాలతోటి వెళ్ళారు. ఏ తల్లి క్రీగంటిచూపులకు మహ ర్షులు వేచి ఉంటారో–ఆ తల్లిని తన ఉత్తరీయంతో కట్టి వాళ్లా యన వస్తాడని ఆమెపాదాలవద్ద కూర్చుని ఉన్నాడు. అనంతా ళ్వారూ! ఎవరిని కట్టేశావో తెలుసా? సమస్త జగత్తును హేలగా ఆడించగలిగినవాడిభార్య– ఆవిడ.

అమ్మవారిని తీసుకుని రమ్మను అన్నారు. అప్పుడు "అయ్యో! తల్లి! నిన్ను కట్టేశానా? ఎంత అదృష్టవంతుణ్ణి" అని కూతురిని తీసుకుని వెళ్ళి, అల్లుడికి ఇచ్చినట్లుగా, ఒక బుట్ట తెచ్చి, తోటలోనిపువ్వులు అందులో వేసి "ఇందులో కూర్చో అమ్మా!" అని ఆ బుట్ట చేత్తో పట్టుకుని వగరుస్తూ వేంకటేశ్వరుని పాదాలవద్ద పెట్టారు. ఆ రోజున స్వామి "మామాగారూ! రండి," అని నోరువిప్పి మాట్లాడారు. నా భార్యను నీ కూతురుగా ఇంట్లో ప్రేమతో కట్టేసుకున్నావు. పూలబుట్టలో కూర్చోపెట్టి తీసు కుని వచ్చావు. మామగారివి కదా! చందనతాంబూలాలు స్వీక రించు" అని వేంకటాచలపతి గంధం రాసి, పుష్పమాలలువేసి, పట్టుబట్టలు పెట్టారు. స్వామిచేత మామా! అని పిలిపించుకున్న ఘనత అనంతాళ్వారుది. ఇప్పటికీ అనంతాళ్వారులసమాధి నైరృతిమూలలో ఉంది. అందుకే వాటికి 'ఏ.టి.జి.కాటేజెస్' అని పేరు.

(ఇంకా ఉంది)



ఏమని పొగడుదుమూ..

- డా॥ ఈ.ఏ.సింగరాచార్యులు, 98850 03420

ఆళ్వారుల భక్తిసాహిత్యం గణనీయమైంది. ఆళ్వారులు ద్రావిడభాషలో వెలయించిన నాలాయిరంలో, లౌకిక విషయాలనుగూర్చిన వర్ణనగానీ, ప్రశస్తిగానీ లేకుండా– కేవలం దివ్యమైన శ్రీమన్నారాయణుని వైభవాన్ని కీర్తిస్తున్నందున దివ్యప్రబంధమనీ, సంస్కృతవేదంలో ప్రతిపాదింపబడిన తత్త్వార్థాలను ద్రావిడభాషలో సామాన్యులు సైతం గ్రహించేరీతిలో అందిస్తున్నందున ద్రావిడవేదమనీ ప్రసిద్ధి చెందింది. శ్రీమన్నారాయణుడే పరతత్త్వమనీ, జగత్కారణమనీ, ఆ స్వామియే ఉపాసించదగిన పరదైవమనీ, అతడే మోక్షప్రదుడనీ, ఆస్వామిని సర్వకాలసర్వదేశ సర్వావస్థలలో ఆస్వామి మెచ్చిన సేవను–ఆస్వామి తృప్తి కోసంగా చేయడమే పరమపురుషార్థ మనే తాము నమ్మిన తత్త్వాన్ని ఆళ్వార్లు తమ మధురమైన పాశురాలద్వారా ప్రబోధించారు. ఈ ప్రయత్నంలో ఆళ్వార్లు నారాయణుని వైభవాన్ని తెలియజేయడం అనేది ప్రధానమైన అంగంగా భావించినా, ఆస్వామి లక్ష్మీవిశిష్టుడు కనుక, లక్ష్మితో కూడుకొని ఉండే నారాయణుడే ఆశ్రయించదగినవాడు, శ్రీ, శ్రీపతుల కైంకర్యమే పరమపురుషార్థం కనుక ఆసిద్ధాంతాన్ని తమ ప్రబంధాలలో వ్యక్తం చేసే ప్రయత్నంలో లక్ష్మీదేవికి సంబంధించిన పలు విలక్షణాలను, వైభవాలను తమ దివ్యప్రబంధాలలో ప్రసక్తానుప్రసక్తంగా ప్రస్తావించడం పదే పదే గోచరమవుతుంది.

1) కఠవల్లీగతమైన ద్వయోపనిషత్తులోని ద్వయ మంత్రంలో రెండు వాక్యాలున్నాయి. ఇందులోని మొదటి వాక్యంలో– లక్ష్మీవిశిష్టుడైన నారాయణుడే ఆశ్రయణీయుడనీ (ఆశ్రయించదగినవాడనీ), రెండవవాక్యంలో– ఆ లక్ష్మీదేవీ, నారాయణులు అనే దివ్యదంపతులకు సేవచేయడమే పరమ పురుషార్థమని తెలుపబడుతున్నది. దీనివల్ల శరణాగతి చేసేటపుడు– దివ్యదంపతులకు సేవచేసేటపుడు – అనే ఈ రెండుదశలలోను నారాయణుడు లక్ష్మీసహితుడై ఉండాలని తెలుస్తున్నది. వైదికమైన ఈలక్ష్మీవైభవాన్ని నమ్మాళ్వార్లు తాము శ్రీవేంకటేశ్వరుణ్ణి శరణాగతి చేస్తూ "అకలకిల్లేన్ ఇఱైయుమెన్ఱు అలర్మేల్మంగై యుఱై మార్బా! .... ఉన్ అడిక్కీళ్ అమర్న్దు పుకున్దేన్" (క్షణంకూడా ఎడబాసి ఉండలేనని నిత్యం వక్షఃస్థలంలో వేంచేసి ఉండే లక్ష్మీదేవిని కలవాడా!....నీ చరణాలచెంత స్థిరంగా నిలచి శరణు పొందాము) అని పల్కడంద్వారా తెలిపారు. ఇదే విధంగా పెరియాళ్వార్లు మంగళాశాసనప్రబంధంగా ప్రసిద్ధమైన పల్లాండులో "తిరుమాలే! నాన్ ఉనక్కు పళవడియేన్" (శ్రియఃపతీ! నీకు నేను అనాదిగా దాసుడను) అని అనడం ద్వారా దాస్యం (కైంకర్యం) లక్ష్మీసహితుడైన నారాయణునికే చేయా లనే తత్త్వాన్ని సూచించారు. "అడిమైశెయ్వార్ తిరుమాలుక్కు" (శ్రియఃపతికి కైంకర్యాన్ని చేస్తారు) ఇత్యాది ప్రయోగాలు ఇటువంటివే!

2) "శ్రద్ధయా దేవో దేవత్వ మశ్నుతే" అనే శ్రుతి వాక్యం శ్రద్ధారూపిణియైన లక్ష్మీదేవివల్ల నారాయణుడు దేవత్వాన్ని పొందుతున్నాడని తెల్పుతున్నది. ఇక్కడ "శ్రద్ధా!" అనే

అక్కర గలిగి కడునాప్తుడైన వాడే బంటు

శబ్దం లక్ష్మీవాచకం. "శ్రద్ధాం విభూతిం సురభిమ్" అనే లక్ష్మీ అష్టోత్తరశతనామస్తోత్రంలో ఈ పదం లక్ష్మీ పర్యాయంగా పఠింపబడింది. ఈ వైదికతత్త్వాన్ని నమ్మాళ్వార్లు "తిరుమామకళ్‌కేళ్వా! దేవా!" (లక్ష్మీవల్లభా! దేవా) అనే సూక్తి ద్వారా వ్యక్తంచేశారు. ఇక్కడ నమ్మాళ్వార్ సూక్తిలోని రెండు సంబోధనలలో హేతుహేతుమద్భావాన్ని- అంటే - లక్ష్మీదేవితో క్రీడించేవాడు కనుకనే, ఆ లక్ష్మీ సంబంధం కారణంగా నారాయణుడు దేవుడయ్యాడు- అంటే- పరతత్త్వమయ్యాడు- అనే అర్థాన్ని గ్రహించడం సరసం. ఈ అర్థమే "తిరుమకళార్ తనిక్కేళ్వన్ పెరుమైయుడైయపిరానార్" (లక్ష్మీదేవీవాల్లభ్యాన్ని పొందిన విలక్షణతను కల్గిన స్వామి) అని, "తిరుమంగైతన్నోడుమ్ తికళ్‌నిన్ద తిరుమాల్" (లక్ష్మీదేవితో ప్రకాశించే శ్రియఃపతి) ఇత్యాది ఆళ్వార్లసూక్తులలో గమనించవచ్చు.

3) లక్ష్మీవైభవాన్ని ప్రకాశింపజేసే వేదసూక్తాలలో శ్రీసూక్తం ఒకటి. అందులో ప్రారంభంలోనే "హిరణ్యవర్ణాం హరిణీమ్" (బంగారువర్ణాన్ని కల్గిందీ, భక్తులనష్టాలు పోగొట్టేదీ) అని అధ్యయనం చేయబడుతూంది. 'పొన్‌పావై' (బంగారువర్ణాన్ని కల్గిన లక్ష్మీదేవి) అని తిరుమళిశై ఆళ్వార్లు (నాన్ముకన్ తిరువందాది-59), "పొన్‌మాదు" (బంగారు వర్ణాన్ని కల యువతి) అని నమ్మాళ్వార్లు, (తిరువిరుత్తమ్-52) "హిరణ్యవర్ణామ్" అనే శ్రీసూక్తంలోని మొదటినామం యొక్కఅర్థాన్ని అనుసంధించారు. అదే రీతిలో "వేరిమాఱాద పూమేల్ ఇరుప్పాళ్ వినైతీర్‌క్కుమ్" (పరిమళం మారని తామరపూవుపై ఉండే లక్ష్మీదేవి భక్తుల పాపాలను హరిస్తుంది) అని నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళి ప్రబంధంలో (4-5-11), "హరిణీమ్" అనే నామంయొక్క అర్థాన్ని పలికారు.

ఇక్కడ ప్రసంగవశాత్తు ఇంకొక విషయంకూడా ప్రస్తావింపబడుతున్నది. లక్ష్మీతంత్రం మొదలైన ఆగమ గ్రంథాలలో శ్రీసూక్తంలోని లక్ష్మీనామాలకు తాంత్రిక వ్యుత్పత్తులు ప్రదర్శింపబడి, వాటిద్వారా విలక్షణమైన అర్థాలు వివరింపబడ్డాయి. ఉదాహరణకు, "హిరణ్యవర్ణా" అనే నామానికి లక్ష్మీతంత్రమనే ఆగమగ్రంథంలో - "నిహితా సర్వభూతేషు రణే భృంగవధూరివ, జనయంతీ పరం నాదం తైలధారావదచ్యుతమ్" (సమస్తజీవులలో మిక్కిలిప్రీతితో ఉన్నదాననై, తైలధారవలె నిరంతరం గొప్ప, అవిచ్ఛిన్నమైన నాదాన్ని ఆడుతుమ్మెదలవలె శబ్దిస్తాను) అనే తాంత్రిక వ్యుత్పత్తి తెలుపబడింది. (ఇక్కడ "రణే" - అనేది క్రియా పదం. "శబ్దిస్తాను"- అని దీని అర్థం) ఈ వ్యుత్పత్తినిబట్టి "హిరణ్యవర్ణా" అనేనామంలోని "హి" అనేది "నిహితా" అని, "రణ్" అనేది "రణే" అని, "య" అనేది "జనయంతీ" అని వివరింపబడినట్లు తెలుస్తున్నది. ఈ వివరణలో తెలుప బడిన అన్ని జీవులలో లక్ష్మీదేవి ప్రీతితో ఉంటుందనే విషయాన్ని పెరియాళ్వార్లు "అరవిన్దప్పావైయుమ్ తానుమ్ అకమ్బుడి వన్దు పుకున్దు" (5) (లక్ష్మీదేవి, తాను నామనుస్సు లోకి వచ్చి ప్రవేశించి) అని పలికారు.

"హరిణీ" అనే నామానికి "హరిణాయతలోచనామ్" అనేది లక్ష్మీతంత్రవివరణం. లేడికన్నులవలె విశాలమైన కన్నులు కల్గిందని దీనిభావం. ఈ విశేషాన్ని తిరుమంగై ఆళ్వార్లు "మానమరుమ్ మెన్నోక్కి" అని నమ్మాళ్వార్లు "మానేయ్ మడనోక్కి" (లేడి కన్నులతో సాటి వచ్చే నేత్రాలు కల్గింది) అని తెలిపారు. ఈ విధంగా ఆగమప్రోక్తాలైన అర్థాలుకూడా ఆళ్వార్లసూక్తులలో ప్రతిఫలిస్తున్నవి.



ఆళ్వార్ల ప్రబంధసూక్తులలో కనిపించే మరో విశేషం తప్పక గమనించదగింది ఉంది. వేదం "సర్వే నిమిషా జజ్ఞిరే విద్యుతః పురుషాదధి" (కలాకాష్ఠాదిరూపమైన కాలతత్త్వం విద్యుద్వర్ణుడైన పురుషునివల్ల ఆవిర్భవించింది) అని తెలిపింది. ఇక్కడ కాలమనేది మిగిలిన వ్యష్టిసృష్టికి అంతటికీ ఉపలక్షణం. సృష్టిపురుషుడు విద్యుద్వర్ణుడు అని అన్నందున, సృష్టిసమయంలో అతడు విద్యుద్వర్ణ అయిన లక్ష్మీదేవితో కూడినవాడనికూడా స్పష్టమవుతున్నది. ఈ విశేషాన్ని నమ్మాళ్వార్లు "ఇలమ్ పడైత్తవనై త్తిరుమార్బనై" (లోకాన్ని సృష్టించిన లక్ష్మీవక్షస్కుని) అనే ప్రయోగంద్వారా తిరువాయ్ మొళి ప్రబంధంలో సూచించారు. సరోయోగి అనే ఇంకొక ఆళ్వార్లుకూడా "వానాకి త్తీయాయ్ మఱికడలాయ్ మారుతమాయ్... తిరుమాలే!" (ఆకాశమై, అగ్నియై, శబ్దించే సముద్రమై, వాయువైన.... శ్రియఃపతీ!) అని తమ ప్రబంధంలో పలికారు.

రక్షణసమయంలోను భగవంతుడు లక్ష్మీవిశిష్టుడనే విషయాన్ని వేదం "అస్యేశానా జగతో విష్ణుపత్నీ" (ఈజగత్తును ఈశాన-పాలించేది; విష్ణుపత్ని) అని తెలుపగా, ఈ అర్థాన్ని ఆళ్వార్లు "ఉలకాణ్డతిరుమాల్" (లోకాలను రక్షించిన శ్రియఃపతి) అని అనుసంధించారు. ఇక్కడ చూపబడిన ఆళ్వార్ల ప్రయోగాలలో అంతట సాభిప్రాయ విశేష్యాలు ప్రయోగింపబడ్డాయని గమనించాలి.

లయంలోకూడా భగవంతుడు లక్ష్మీసహితుడని "ఆనీదవాతగ్ం స్వధయా తదేకమ్" (ఈ జగత్తు అంతా స్వధా శబ్దవాచ్యురాలైన లక్ష్మీతో కూడిన పరమపురుషునిలో లీనమైంది) అని తెల్పింది. ఇందువల్ల లయకారకుడైన పరమాత్మ లక్ష్మీవిశిష్టుడని తెలుస్తున్నది. ఈ అర్థాన్ని పేయాళ్వార్లు (మహాయోగి) తమ ప్రబంధంలో "మున్నులకముణ్డు మిళ్న్దాయ్క్కు.. తిరుమాలే!" (శ్రియఃపతీ! ముల్లోకాలను ఆరగించి, వెలువరించిన నీవు) (20) అనే సంబోధన ద్వారా తెలిపారు.

ఈ విధంగా వైదికతత్త్వార్థ విషయాలనేకాక, లక్ష్మీదేవికి సంబంధించిన ఎన్నో విశేషాలను ఆళ్వార్ల పాశురాలలోని ప్రయోగాలు ఎరుక పరుస్తున్నాయి. లక్ష్మీదేవికి నారాయణుడు, నారాయణునికి లక్ష్మీదేవి పరస్పరం అన్ని రీతులలో తగినవారనే విషయాన్ని నమ్మాళ్లార్లు "ఉనక్కేఱ్కుమ్ కోలమలర్ప్పావై" (తిరువాయ్మొళి) (నీకు తగినది అయిన, అందమైన తామరపూవులో ఉండే సుందరి లక్ష్మీదేవి) అని అంటూ తెలిపారు. నారాయణుడు బహుపత్నీకుడైనా, ప్రధానమహిషి లక్ష్మీదేవియేనని, మిగిలిన పత్నులందఱు ఆమెతో ఏ విధమైన సాపత్న్యదోషాన్ని (సవతిపోరును) కల్గినవారు కారనే విషయాన్ని "తిరుమకళుమ్ మణ్మకళుమ్ ఆయ్మకళుమ్ శేర్న్దాల్ తిరుమకట్కే తీర్న్దవాఱెన్కొల్?" (లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవి కలసి ఉన్నపుడు, లక్ష్మీదేవికే మిగిలిన ఇరువురు సహకరించే రీతి ఎంత ఆశ్చర్యమోకదా!) అనే సరోయోగిసూక్తి తెల్పుతున్నది. లక్ష్మీదేవికి మిగిలిన ఇద్దఱు నీడవంటివారని అంటూ నమ్మాళ్వార్లు "కోవలర్ మడప్పావైయుమ్ మణ్మకళుమ్ తిరువుమ్ నిళల్పోల్ వనర్" (నీళాదేవి, భూదేవి- అనే ఇద్దరు లక్ష్మీదేవికి ఛాయాసమానలు) అని తిరువీరుత్తమనే ప్రబంధంలో (3) పలికారు.

ఇంతేకాక, లక్ష్మీదేవి క్షీరసాగరంనుండి ఉద్భవించిన వృత్తాంతాన్ని తిరుమంగై ఆళ్వార్లు పెరియతిరుమొళి అనే ప్రబంధంలో "మకరమ్ శుళలనీర్ పయన్దదెయ్ వత్తిరుమామలర్మంగై" (3-2-7) (మత్స్యాలన్నీ పరిభ్రమించగా సుడులు తిరిగే నీటిని కల సముద్రం ప్రసవించిన దివ్యకాంత లక్ష్మీదేవి) అని అనుసంధించారు. ఆమె చంద్రునివంటి ముఖాన్ని కల్గి ఉండడాన్ని 'వెణ్మదిపోల్ తిరుముకత్తు అరివై" (తెల్లని చంద్రునివంటి ముఖాన్ని కల్గిన యువతి) (2-7-1) అని, "వణ్డార్కూన్దల్ మలర్ మంగై" (తుమ్మెదలు నిండుగా ఉంటే కేశపాశాన్ని కల లక్ష్మీదేవి) (8-6-1) అని, "వడిత్తడంగణ్ మలరవళ్" (నిశితమైన విశాలమైన నేత్రాలను కల లక్ష్మి) (8-1-5) అని - ఈ విధంగా లక్ష్మీదేవియొక్క అతిలోకసౌందర్యాన్ని ఆ ప్రబంధంలో తిరుమంగై ఆళ్వార్లు ప్రస్తావించారు. ఇంకా ఎన్నో - లక్ష్మీదేవియొక్క రూప, స్వరూప, గుణ, లీలల వైలక్షణ్యాలను తెలిపే ప్రయోగాలూ, పదసందర్భాలూ ఆళ్వార్ల పాశురాలలో ఉన్నాయి.

మంగళకైశికీ గాన కైంకర్యం

- డా॥ ముదివేడు ప్రభాకరరావు, 94418 72536

శ్రీవైష్ణవభక్తి సంప్రదాయంలో భగవత్ కైంకర్యాన్ని జీవితాంతం ఒకవ్రతంగా అనుష్ఠానం చేయడం ఒక విలక్షణమైన అంశం! విశేషించి, మంగళకైశికీ రాగంలో వైష్ణవ భక్తులు ప్రతియేటా కార్తికమాసంలో శుద్ధద్వాదశి (క్షీరాబ్దిద్వాదశి) నాటికి పూర్తయ్యేవిధంగా నాలుగుమాసాలు నిష్ఠాగరిష్ఠులై మంగళకైశికీరాగంలో గానకైంకర్యంచేసి, వ్రతపరిసమాప్తి ద్వాదశినాటికి భగవత్సమర్పణం చేయడాన్నే కైశికద్వాదశీవ్రతమని, మంగళకైశికీవ్రతమని పిలుస్తారు. ఈ క్షీరాబ్ధిద్వాదశిరోజే పరివ్రాజకులు, పీఠాధిపతులుకూడా చాతుర్మాస్యవ్రతాన్ని పూర్తిచేసి వ్రతానుష్ఠానఫలాన్ని పొందేరోజు కావడం విశేషం!

కైశికపురాణం

తమిళనాడులో 'కైశికపురాణం'గా ప్రసిద్ధి చెందిన ఈ కథకు శ్రీపరాశరభట్టు (క్రీ.శ.1062-1190) మణిప్రవాళంలో వ్యాఖ్య వ్రాశారు. జనబాహుళ్యంలో ఈ వ్రతకథానాయకుని నంబాడువాన్ (నమ్+పాడువాన్=మన గాయకుడు) అనే పేరుతో పిలుస్తారు. ఈ కథనే 'దాసరి కథ'గా శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద'లో గోదాదేవి కథకు ముందుగా చెప్పడంలో గోదాకథకు మూలబీజం దాసరిగాన కైంకర్యకథలో నిక్షిప్తమై ఉందనేది స్పష్టం. వీరిద్దరి గానకైంకర్యాన్నే పుణికిపుచ్చుకుని యావజ్జీవం అనుష్ఠించిన ప్రథమాంధ్రవాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు. వీరందరికీ ఆద్యుడు వరాహపురాణకాలంనాటి దళితుడైన దాసరియే!

కైశికపురాణం-నంబాడువాన్ కథావిశేషాలు

శ్రీవైష్ణవసంప్రదాయంలోని 108 దివ్యదేశాలలో పాండ్యమండలంలోని దివ్యతిరుపతుల్లో 'కుఱుగుడి' 'కుఱుంగుడి', 'తిరుక్కుఱుంగుడి' అనే దివ్యదేశం ఉంది. విష్ణువు వామనావతారమెత్తినప్పుడు అక్కడ అర్చావతారమూర్తిగా వెలశాడు. గనుక కుఱు=పొట్టివాడైన; వామనమూర్తి అని ఆ దేవుణ్ణి పిలిచారు. ఈ స్వామినే వైష్ణవులు కుఱుంగుడినంబి, వైష్ణవనంబి, మలైమేల్‌నంబి, నిన్టనంబి, ఇరుందనంబి, కిడంద నంబి, తిరుప్పాఱ్కడల్‌నంబి అనే పేర్లతో పిలుస్తారు. దేవాలయగర్భగుడిపై గల విమానంపేరు పంచకేతన విమానం. ఈ 'కుఱుంగుడి' (వామనదేవాలయం) తమిళనాడులోని మధురై పట్టణానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ స్వామిమీదనే 'నంబాడువాన్' అనే దాసరి నిత్యకైంకర్యంగా పాటలు పాడి, 'బ్రహ్మరాక్షసి'ని ఉద్ధరించి సహజరూపాన్ని ఇచ్చాడు.

"కోటికన్యాదానం" వారి చారిత్రకనేపథ్యం

విజయనగరప్రభువుల కులదైవం హంపీవిరూపాక్షస్వామి. వారి 'రాజముద్రిక' లో 'శ్రీవిరూపాక్ష' అని



మంగళకైశికీ వ్రతకథ

వరాహపురాణం(అధ్యాయం 66-శ్లోకాలు 1-82)లో ఉంది. ఇది వరాహావతారంలో మహావిష్ణువు, భూదేవికి చెప్పిన కథ. ఈ కథయే గోదాదేవి అనుష్ఠించిన ధనుర్మాసవ్రతానికి ప్రేరణ. అది కూడ గానకైంకర్యమే కావడం విశేషం.



తిరుమలలో కైశికద్వాదశీ ఆస్థానోత్సవం

ఒక పురాణకథాసంప్రదాయం, దేవాలయ సేవా సంప్రదాయంగా ఎలా పరిణమిస్తుందో తెలుసుకోవడానికి తిరుమలలో జరిగే కైశికద్వాదశీ ఆస్థానోత్సవమే నిదర్శనం.

2016, నవంబరు నెల11వతేదీ నుండీ కార్తికశుద్ధ ద్వాదశి (క్షీరాబ్ధిద్వాదశి)రోజు తిరుమలపై ఆస్థానోత్సవం జరుగుతోంది. ప్రాతఃకాలఆరాధన అయిన వెంటనే స్వామి అపరావతారమైన ఉగ్రశ్రీనివాసమూర్తివారు ఉభయనాంచార్లతో బంగారు తిరుచ్చిలో వేంచేస్తారు. ఆ రోజు విశేషతిరువాభరణాలు సమర్పిస్తారు. విశేషపుష్పమాలికల చేత అతిరమణీయంగా అలంకరించబడి, అరుణోదయకాలంలోనే ఆనంద నిలయవిమాన ప్రదక్షిణంగా నాలుగు తిరుమాడవీథులలో ఊరేగింపు పూర్తికాగా, సూర్యోదయంకాక మునుపే మండపానికి వేంచేస్తారు. తర్వాత శ్రీవారికి ఆస్థానాలంకారం జరిగి, ఆరాధన జరిగి తళియలు నివేదనమౌతాయి.

తర్వాత కైశికద్వాదశి ఆస్థానం ప్రారంభమౌతుంది. శ్రీస్వామివారికి అక్షతారోపణం జరిగిన తర్వాత శ్రీవారి పాదాలకు సమర్పింపబడియున్న కైశికపురాణాన్ని 'కాలక్షేపం' చేయడానికి 'కోటికన్యాదానం' లక్ష్మీకుమారతాతాచార్యుల వంశస్థులైన వారసునికి 'పరివట్టం' కట్టియిస్తారు. ఆ విద్వాంసుడు కైశికభక్తచరితాన్ని కాలక్షేపం చేస్తారు. పురాణపఠనం తర్వాత పంచ ముఖాలకొలువుకాగా హారతులు-జియ్యంగారు వారికి, సర్కారువారికి (దేవాలయాధికారులకు) మర్యాదలు జరిగిన పిమ్మట, గోష్ఠిలోనివారికి, స్థానబహుమాన పురస్సరంగా శ్రీవారి ప్రసాద వినియోగం జరుగుతుంది. ఆరాధనమైన తర్వాత 'కోటికన్యాదానం' లక్ష్మీకుమార తాతాచార్యుల వంశస్థులవారికి శ్రీవారిసన్నిధిలో మర్యాదలు జరిగివారిని విడిదికి పంపిస్తారు. స్వామివారు తమ సన్నిధానానికి వేంచేస్తారు.

ఉంటుంది. కాని, సంగమవంశంలో చివరిరాజైన విరూపాక్ష రాయలకాలంలో (క్రీ.శ.1465-1485) ఏట్టూరు సింగరాచార్యులనే వైష్ణవుడు రాజుకు వైష్ణవమతం ఇప్పించాడు. అప్పటినుండి 'విరూపాక్ష' ముద్రకు బదులు 'శ్రీవేంకటేశ' ముద్ర వచ్చింది. శ్రీకృష్ణదేవరాయల గురువైన తాతాచార్యులవారు పై చెప్పబడిన ఏట్టూరు సింగరాచార్యులకు తొమ్మిదవతరంవారు. ఈయనకే పంచమతభంజన తాతాచార్య లనిపేరు. ఐదు అన్యమతాలను వాదంలో ఓడించడంచేత ఆయనకు ఆ బిరుదు వచ్చింది. ఈయన కుమారుడే లక్ష్మీకుమారతాతాచార్యులు. ఈయనకే కోటికన్యాదానం తాతాచార్యులని పేరు. ఈయనే తన జీవితకాలంలో బీదవారైన స్త్రీలకు సొంతఖర్చులతో వివాహాలు జరిపించాడు. అదొక వ్రతంగా జీవితకాలమంతా లెక్కలేనన్ని వివాహాలు జరపడంవల్ల 'కోటికన్యాదానం' వారనే ప్రసిద్ధి ఏర్పడింది.

ఈయన ఆరవీటి వంశంలోని మొదటి వేంకటపతి దేవరాయల రాజగురువు (క్రీ.శ.1586-1620). తిరుమలలో జరిగే కైశికద్వాదశి ఆస్థానోత్సవంలో 'కోటికన్యాదానం' తాతాచార్యుల వంశస్థులవారసుడు పాల్గొని, కైశిక పురాణ 'కాలక్షేపం' చేస్తున్నారు. తిరుమల దేవాలయ మర్యాదలతో నేటికీ సన్మానాలు పొందుతున్నారు.

కాని పని సేయకుంటే కాయమే సుఖము

చరిత్రలో తిరుచానూరు

– ఆచార్య గల్లా చలపతి, 98858 26626



అలమేలుమంగ తిరుచానూరులో పద్మావతీ అమ్మవారుగా పూజలందుకొంటూ భక్తుల్ని అనుగ్రహిస్తూంది. ప్రాచీనకాలంలో తిరుచానూరులో శ్రీశుకమహర్షి ఆశ్రమం ఉండడంవల్ల ఆ గ్రామానికి శ్రీశుకనూరు (శ్రీశుక గ్రామ) అనే పేరు ఏర్పడింది. అదే క్రమంగా తిరుచ్చోగినూరు (శ్రీ=తిరు), తిరుచ్చుకనూర్ అనే రూపాంతరాలు పొందుతూ, తిరుచానూరుగా స్థిరరూపంపొందిందనీ తెలుస్తూంది. ఈ పేర్లన్నీ శాసనాల్లో కనిపిస్తున్నాయి. ఇక్కడ దొరికిన పల్లవుల కాలంనాటి శాసనాల్నిబట్టి తిరుచానూరు పల్లవులపాలనలోని తిరువేంగడ కొట్టానికి చెందిన కుడవూర్ నాడులోని ఒక గ్రామంగా కనిపిస్తూంది.

చరిత్ర విషయం

తిరుచానూరుగ్రామం తిరుపతికి ఐదుకిలోమీటర్ల దూరంలో ఆగ్నేయంగా సువర్ణముఖిఉత్తరంఒడ్డున ఉంది. పల్లవుల కాలంనుండి ఈ ఊరు చరిత్రలో కనిపిస్తూంది. చోళులకాలంలోని శాసనాలలో తిరుచానూరులో ఒకసభ (పాలన కేంద్రం) ఉండినట్లు– స్థానికపాలన, ఆలయవ్యవహారాలు ఈ సభద్వారా జరుగుతూ ఉండినట్లు – శాసనాలు చెపుతున్నాయి. అప్పటికి తిరుమల ఆలయం అంత ప్రసిద్ధి పొందలేదు. పూజావ్యవహారాలుమాత్రం జరుగుతూ ఉండేవి.

కొండపైకి వెళ్లడానికి తగిన సౌకర్యాలు ఏర్పడకపోవడంతో కొందరుమాత్రమే వెళుతూఉండేవారు. ఆ కారణంవల్ల తిరుచానూరులోనే ఒక దేవాలయం నిర్మించి, అందులో శ్రీనివాసునికి ప్రతిరూప మనదగిన విగ్రహం పెట్టి, భక్తులు పూజించుకొనే అవకాశం కల్పింపబడినట్లు – క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దానికి ముందు వెలువడిన తమిళశాసనాలు పేర్కొంటున్నాయి.

పల్లవరాణి సమవాయికూడా శ్రీనివాసుణ్ణి ఇక్కడ నుండే ఆరాధించింది. ఇప్పుడున్న శ్రీపద్మావతీఅమ్మవారి ఆలయంగా పేరు పొందిన తిరుచానూరుఆలయాన్ని పరిశీలిస్తే ఆలయప్రాంగణంలో సుందరరాజపెరుమాళ్ దేవాలయం, శ్రీకృష్ణదేవాలయం, పద్మావతీదేవాలయం కనిపిస్తున్నాయి.

కానీ, పల్లవుల, చోళుల కాలంలో భక్తులకోసం కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీనివాసుని ప్రతిరూప మనదగిన విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దేవాలయం కనిపించడం లేదు. ఈ ఆలయం పూర్తిగా శిథిలమై పోయింది.

ఈ విషయాన్ని ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో ఒక ప్రభుత్వ శాసనపరిశోధకుడు 1904వ సం॥ వార్షిక నివేదికలో పేర్కొన్నాడు.

శ్రీనివాసుని వక్షఃస్థలంలో ముందుకు ఉబ్బెత్తుగా పద్మం మీద కొలువైనట్లున్న అమ్మవారు కనిపిస్తారు. స్వామివక్షఃస్థలంపై వస్త్రం కప్పడంతో, ఆభరణాలతో, పుష్పాలంకారాలతో కూడి ఉండడం వల్ల అలమేలుమంగమ్మను భక్తులు ప్రతిరోజూ దర్శించుకోవడానికి వీలుగాక- శుక్రవారాభిషేకసమయంలో మాత్రమే దర్శించే వీలున్న సంగతి రామానుజాచార్యులవారు గమనించారు. అమ్మదర్శనం అన్నిసమయాల్లో భక్తులకు కలిగించే ఉద్దేశంతో ఆయన బంగారుఅలమేలుమంగమ్మప్రతిమను తయారు చేయించి, స్వామిహృదయంపైన కుడివైపున అలంకరింపజేశారు.

పద్మావతీ అమ్మవారి ఆలయం

ఎప్పుడు నిర్మింపబడిందో సరిగా తెలియని ఈ ఆలయం శ్రీకృష్ణదేవాలయానికి ఉత్తరంగా తూర్పుముఖంగా ఉంది. ఆలయవాస్తునిర్మాణాన్ని బట్టి ఇది 17వ శతాబ్దిలో నిర్మింపబడి ఉంటుందని చెప్పవచ్చు. ఆలయవాస్తుశిల్పం 17వ శతాబ్దికి చెందన విజయనగరశైలిని పోలిఉండడం దీనికి కారణం. 16వ శతాబ్ది ప్రారంభంలో శ్రీనివాసమంగాపురంలో కల్యాణవేంకటేశ్వరస్వామిఆలయనిర్మాణం జరిగింది. భక్తులు తిరుపతినే ప్రధానకేంద్రంగా భావించడంవల్ల దగ్గరగా ఉన్న తిరుచానూరుకే ఎక్కువగా వెళుతూ ఉండేవారు. శ్రీనివాసమంగాపురానికి తక్కువగా వెళ్లేవారు. అప్పటికే తిరుచానూరులో రెండుదేవాలయాలుండడంకూడా దీనికి కారణం. యాత్రికులను ఎక్కువగా ఆకర్షిస్తున్న తిరుచానూరులోనే అమ్మవారికి ఒకఆలయం నిర్మించాలనే సంకల్పం ఎవరికి కలిగిందో తెలియదు కాని ఆలయం కట్టబడింది. ఆలయంలో అమ్మవారు పద్మంమీద పద్మాసనభంగిమలో కొలువై ఉంది. నాలుగుచేతులలో – పై రెండుచేతులు పద్మాలను ధరించి కనిపిస్తున్నాయి. కిందిచేతులలో కుడిచేయి అభయముద్రలో, ఎడమచేయి వరదముద్రలో ఉన్నాయి.

అమ్మవారి గర్భగృహానికి ఎదురుగా ఉన్న ముఖమండపంలో దక్షిణంవైపున ఉత్తరముఖంగా చిన్నవిష్వక్సేనులసన్నిధి ఉంది. ముఖమండపంఉత్తరంవైపున దక్షిణముఖంగా రామానుజులవారిసన్నిధి ఉంది. దేవాలయప్రహరిగోడకు వాయవ్య భాగంలో పద్మసరోవరం (పుష్కరిణి) ఉంది. సరోవరం మధ్యలోని నీరాళిమండపం విజయనగరనిర్మాణశైలిలో కనిపిస్తున్నది.

తిరుచానూరికే అలమేలుమంగాపుర మని మరొక పేరుంది. ఇక్కడి దేవాలయంలో 'శాంతినిలయం' అనే బంగారు గోపురంలో పద్మావతీదేవి అర్చామూర్తిగా దర్శనమిస్తూ, భక్తులను అనుగ్రహిస్తూ ఉంది. ఇక్కడ అర్చామూర్తిగా ప్రతిష్ఠింపబడక ముందు అమ్మవారు స్వామివారి'వక్షఃస్థలనిత్యవాసరసిక' గానే పూజలందుకొన్నది. తిరుమల ఆలయంలో అన్నమయ్యకు విగ్రహరూపంలో కనిపించిన ఈ తల్లికి– ఆయనకు సుమారు నూటఏభైసంవత్సరాల తర్వాత తిరుచానూరులో ప్రత్యేకంగా ఒక ఆలయం ఏర్పడింది. ఈ ఆలయప్రాంగణంలోని శ్రీకృష్ణ, సుందరరాజస్వామి దేవాలయాలతో పోల్చిచూస్తే అమ్మవారి ఆలయం కొత్తగా కనిపించడంవల్ల దీనిని శాసనపరిశోధకుడైన వెంకయ్య 18వ శతాబ్ది ప్రారంభంలో వచ్చినట్లు ఊహించాడు. ఇంకా కొంతముందే ఈ ఆలయనిర్మాణం జరిగినట్లుంది.

కుంఫిణి ప్రభుత్వం 21–4–1843లో తిరుమల ఆలయాన్ని, అనుబంధ ఆలయాలను హథిరాంజీమఠానికి అప్పగించింది. తర్వాత ఆయా దేవాలయాల ప్రాచీన విషయాలను సేకరించడానికి 'ప్రెసిడెన్సీ' ఉద్యోగులు ప్రయత్నించారు. ఆ సందర్భంలో వెంకయ్య 1–6–1904లో తిరుచానూరు ఆలయంనుండి సేకరించిన విషయాల్ని ప్రభుత్వప్రధానకార్యదర్శికి పంపడానికి తయారుచేసిన నివేదికలోని విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి.

చారిత్రకవిషయాలే – కాక వెంకయ్యకాలంవరకు ప్రచారంలో ఉండిన విషయాలుకూడా ఈ నివేదికలో ఉన్నాయి. తిరువిళంగోయిల్ పెకలింపబడిన తర్వాత కొంతకాలానికి పద్మావతీఅమ్మవారిఆలయనిర్మాణం జరిగినట్లు వెంకయ్య అభిప్రాయం.



అన్నమయ్య ఆకలితీర్చిన... అలమేలుమంగ

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152



సుమారు ఆరువందల ఏండ్లకిందట జరిగిన దివ్యగాథ! ఇప్పుడు దీన్ని కథ అంటున్నాం. కాని ఇది ఏడుకొండల్లో నిజంగా జరిగిన ఆనందమయమైన సంఘటన! మోకాళ్లమెట్లదగ్గర చోటు చేసుకున్న అద్భుతవృత్తాంతం!

ఏమిటిది? అంటే.

అన్నమయ్యపేరు అందరూ వినే వుంటారు. ఆయన వూరు తాళ్లపాక. తండ్రి నారాయణసూరి, తల్లి లక్కమాంబ ఒక కొడుకు పుట్టాలి అంటూ సంతానంకోసం తిరుమలయాత్ర చేశారు. ఆనందనిలయుణ్ణి వేడుకొన్నారు. గరుడగంభం దగ్గర సాగిలబడి వరపడినారు.

వేంకటేశుడు వరాలరాయడు కదా! అడిగినవారికి లేదంటాడా! సాగిలబడి మగతగా వున్న నారాయణసూరి దంపతుల చేతుల్లో తన బంగారు నందకఖడ్గాన్ని పెట్టాడు. ఆ ఖడ్గానికున్న చిరుగజ్జులు గల గలలాడాయి. ఆ సవ్వడితో ఆలుమగలు ఇద్దరికి మగత తొలగింది. కళ్లు తెరిచారు. అంతే! వారియాత్ర సఫలమయ్యింది.

పరబ్రహ్మమైన ఆనందనిలయుని వరప్రసాదంతో లేక లేక పుట్టాడు "అన్నమయ్య". గోముగా పెరిగాడు. అతిగారాబంవల్ల మంకుపిల్లవాడుగా తయారయ్యాడు. ఎనిమిదేళ్ల అన్నమయ్య. సరిగా బడికి పోడు. అల్లరిగా గాలికి తిరుగుతాడు. కూనిరాగాలు తీస్తూ పాతగుళ్లచుట్టూ. పొలాలెంబడి తిరుగుతాడు.

సోమరిగా పనీపాటా లేకుండా కాలక్షేపం చేస్తున్న అన్నమయ్యను ఇంట్లో అందరు అరిచారు. తలో మాటా అన్నారు, ఎనిమిదేళ్ల చిన్న బుడతడు కదా! అని కూడా ఆలోచించని చుట్టాలందరూ తిట్టారు, తిమ్మారు.

తాము వేడుకొంటేనే కదా! అన్నమయ్య బంగారు నందకఖడ్గాంశంతో పుట్టాడన్న విషయం తల్లిదండ్రులు అప్పుడే మరచిపోయారు. అదే మాయ! అందువల్లే 'ఇనుప కొడవలి'ని చేతికిచ్చారు. గడ్డి తెమ్మన్నారు.

అయోమయంలో పడ్డాడు-అన్నమయ్య. ఆవేదనతో గడ్డి కోయటంలో వేలు తెగింది. తన గ్రహచారం బాగ లేదను కొన్నాడు, 'ఇనుపకొడవలి"ని విసిరికొట్టాడు. ఇంటి నుంచి పారిపోయాడు. తెగిన గాలిపటంలాగా గాలి ఎటు వీస్తే అటు ఏడుస్తూ పరిగెత్తాడు.

ఒంటరిగానే పోతున్నాడు. ఒక గమ్యం లేదు. ఎటు పోతున్నాడో తెలియదు. ఎటు పోవాలో తెలియదు. ఎందుకు పోతున్నాడో తెలియదు. ఏడుస్తూ పోతున్న అన్నమయ్యకు దూరంగా కొన్నిశబ్దాలు విన్పించినై"

గోవిందా! గోవిందా! ఏడుకొండలవాడా! వేంకట రమణా! గోవిందా! గోవింద!!...అంటూ గోవిందనామాలు చెవుల్లో పడ్డాయి. ఆనందం అయింది. ఎన్నో యుగాల నుంచి ఆ గోవిందనామాలతో తనకు ఎంతో అనుబంధం ఉన్నట్లుగా తోచింది. తెలియని తన్మయత్వం కలిగింది.

ఇంతలో గుంపుగా వున్న యాత్రికులు అన్నమయ్య దగ్గరికి వచ్చారు. తెగినవేలుతో, కారుతున్న నెత్తురుతో ఏడుస్తున్న అన్నమయ్యను చూశారు. జాలిపడ్డారు. ఎవరు నాయనా! నీవు? అని అడుగుతూ పక్కనే వున్న ఒక ఆకు పసరును అన్నమయ్య చేతికి పూశారు. వెంటనే గాయం మాయం అయ్యింది. అన్నమయ్య చెప్పిన కథంతా విన్నారు. మేం తిరుపతి కొండకు పోతున్నాం. నీవూ మాతోపాటు రా! తర్వాత ఆలోచిద్దాం. అంటూ అందరూ భజన చేస్తూ ముందుకు సాగారు. అన్నమయ్య కూడా వాళ్లవెంటే తిరుమలకొండకు నడిచాడు.

అలిపిరి నుంచి తిరుమల కొండ ఎక్కాడు. అందరూ గోవిందా! అంటూ వడివడిగా తిరుమలకొండను ఎక్కుతూ ఉండి నారు. ఎవరి ధ్యాస వారిదే! ఎవరిధ్యానం వారిదే! ఇలా అందరూ ముందుకు సాగిపోయారు.

బాగా పొద్దు ఎక్కింది. ఎండ ఎక్కువగా ఉంది. బాలుడైన అన్నమయ్య వెనక బడ్డాడు. ఒంటరివాడయ్యాడు. బాగా దప్పికగా ఉంది. ఆకలిగాకూడా ఉంది. ఉసూరుమంటూ అలాగే కాళ్లీడ్చు కుంటూ మోకాళ్లమెట్ల దగ్గరికి వచ్చాడు, చూట్టూ చూశాడు- మనుషులజాడే లేదు. అందరూ వెళ్లిపోయారు. సరేలే అనుకొంటూ మోకాలిమెట్ల పర్వతాన్ని ఎక్కడానికి ప్రారంభించాడు- అన్నమయ్య.

ఒకటి రెండు మెట్లు ఎక్కాడు. నీరసం ఎక్కువైంది. కళ్లు బైర్లుకమ్మాయి. కళ్లు తిరుగుతున్నాయి. ఎవరో కిందికి తోస్తున్న ట్లుంది. కిందపడిపోతున్నా రక్షించండి! రక్షించండి అంటూ అరుస్తు స్పృహలేకుండ కిందపడ్డాడు- అన్నమయ్య.

